ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



4 అణాల

10-2-'54

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKL



పంచతంత్రం
సంధి-విగ్రహం
కర్త... విశ్వాత్ముల నరసింహమూర్తి
(మేఘవర్ణుడు:- చిత్రవర్ణునితో) "మంచితనముతో జరిగే పనికి శౌర్యము చూపుట నిరుపయోగము- బలవంతుడగు హిరణ్యగర్భుని సంధి కోరుటయె ఉచితము కాదా!"
"సింహళ ద్వీపము నేలుచుండినా మహాబలుని సాయం కోరగ హిరణ్యగర్భుడు దూతను పంపెను; మహాబలుడును మనకు శత్రువే! బలవంతులగు వారిరువురును అవలీలగ మన నోడించెదరు. కావున, ఓ మహాప్రభూ! హిరణ్యగర్భుని స్నేహము కోరుట సర్వవిధముల శ్రేయస్కరము!!"
"హిరణ్యగర్భుడు ఏనాడో తన రాజ్యస్వాతంత్ర్యతను కోలుపోయెను అట్టివానిని కోరి ఇప్పుడూ రాజును చేయుట సబబేనా?"
ఇంతలోనే ఒక శుకము గుండెలవియు వేగముతో పరుగు పరుగునా వచ్చుచుండెను.
(కొలువు కూటము వాకిట నిలచి) "దేవా! సింహళద్వీపాన్నేలే మహాబలుడు తన సేనలతో మన పట్టణమును ముట్టడించెను!"
"ఏమేమీ? ఏమనుచుంటివి?"
"మహాప్రభూ! మనవి చేసెదను.- సింహళ ద్వీపపు రాజగు- మహాబలుడు మనరాజ్యమును -తన సేనలతో ముట్టడించెను.- ఫలముల కోసం వనమున కేగి- వృక్షాగ్రముపై కెక్కిన నేను- సేనల రాకను పొడగాంచితిని.- దేవరవారికి ఈ వార్తలను- విన్నవించుటకు పరుగున వచ్చితి."
చిత్రవర్ణుడా యీ మాటలను వినిన వెంటనే రౌద్రమూర్తియై సభనంతటినీ కలయజూచెను
"మహామంత్రీ! దూరదర్శీ!- నిన్న కాక మొన్న కదా,- మహాబలుడు మనచేతిలో -పరాజయము పొందినాడు?- దానినంతా విస్మరించి- కయ్యానికి కాలు దువ్వి- వచ్చి యిచట విడిసినాడు.- అతని గర్వమణచవలెను!"
"మహారాజా! ఆగ్రహింపకుడు!"
"మహాబలుని సేనలను సమూలముగ త్రుంచివేసి తక్షణమే మనము పోయి సింహళ ద్వీపము కూడా ఆక్రమించుకొనవలయును!!"
"మహాప్రభూ! నా మాట వినండి.- ఆవేశానికి లోబడకండి.- మన స్థితిగతులు మారినవండి.- క్రోధము పూనుట తగని పనండి.- వెనుకటి కొక విప్రుడు కూడా- తన్ను నమ్మిన ముంగిస నట్లే- ముందువెనుకలాలోచింపక- చంపిన వెనుక విచారపడెను!"
"ఎవరా విప్రుడు? ఏమా కథ?"
46

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ

ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 47
సంచిక 22
10-2-54

విజయ మాఘ శుద్ధ అష్టమి బుధవారం



భిల్లుల విలువిద్య

— జె. వి. శివరామశాస్త్రి.

విషయానుక్రమణిక

ముఖచిత్రం:—ఏ. వి. యం. వారి 'One day'లో సూర్యకళ.

కాలక్షేపం

"సకల కలా విభూషితులు,
శబ్దవిదుల్, నయతత్వ బోధకుల్,
ప్రకట కవీంద్రు, లే నృపతి
పజ్జను నిర్ధనులై చరింతు, రా
వికృతపుజాడ్య మా దొరది;—
విత్తములేకయ వారు పూజ్యు; లం
ధకజన దూషితంబులు [లే?"
ఘనంబులుగావె యమూల్య రత్నము

తా॥ సకల కళలయందును శాస్త్రముల యందును ప్రవీణులై అట్టి కళలతో విరాజిల్లు చున్నటువంటి వారున్నూ, శబ్ద శాస్త్రవేత్తలున్నూ, నీతిమార్గ తత్వమును బోధించగలవారున్నూ, ప్రసిద్ధ కవీంద్రులున్నూ, ఏ ప్రభువువద్దను ధనహీనులై దరిద్రులై చరిస్తూ ఉంటారో, వారి దారిద్ర్యమునకు కారణభూతమైన వికృతపుబుద్ధిజాడ్యము ఆ ప్రభువుదే. ఎందుచేతననగా, ధనము లేకపోయినప్పటికీ ఆ పండితులు పూజనీయులే యగుదురు. అది ఎట్లనగా, అంధులైన జనులు దూషించినప్పటికీ, యమూల్యమైన రత్నములు గొప్పవి కాకుండునా?

ధనము లేకపోయినప్పటికీ పండితులు పూజనీయులే యగుదురు. కాని, కొందరు ప్రభువులు వారిని పూజించక పోవడం సంభవిస్తోంది. పండితులను కొందరిని దగ్గరకుతీసి మచ్చికచేసి పెంచుకొన్న ప్రభువులు చాలామంది ఉన్నారు. రాజుల శౌర్యప్రతాపములను కొనియాడుచు, వారి విజయయాత్రలను వివరించుచు, వారికి ఇంపైన లోయ్యాలులతోడి తియ్యని తియ్య విలుకొని కయ్యాల సయ్యాటల 'నయ్యారె! వారె! వవ్వారె!!' యని వారే యిద్దమెయి మెచ్చుకొను మచ్చున పచ్చిపచ్చిగ వర్ణించి, ఆసరదారుల సరదాల సయ్యాలలూపి, వారిచ్చిన వెయ్యారుల స్వీకరించుచు, దొరల దివాణ పంజరముల లోని పెంపుడు చిలుకలవలె, ఆ ఎలికల తూలికాతల్ప డోలికల చెంతనోలిగూర్చు లీలా శుకములవలె మెలంగుటకంటె సత్కవుల్ హాళికులైన నేమి? యని సవాలు చేసిన కాలము గడపిన కవులు పలువురిలను వెలసి, సిరుల తులతూగి, తమ కావ్యకన్యకల నా రాజన్యుల కమ్మి తమ జీవితమ్ము ధన్యమ్మని నమ్మి దివమ్ము చేరిరి. కాని, అట్టి వారి జీవితమ్ము వమ్ము అని వాదించి బమ్మెరపోతన్న వంటి స్వతంత్ర సాహిత్య విప్లవకారుడు ధీరుడై "బాల రసాల సాల నవ పల్లవ కోమల కావ్య కన్యకన్" కూళలకు అమ్మను అని శపథం చేశాడు. రాజులు ఆదరిస్తామంటే కూడా వారిని తన దరిని చేరనివ్వ నన్నాడు యీ నిరంకుశకవి. అటువంటి సందర్భంలో ఆయన నిర్ధనుడై ప్రభువుల జీతబత్తెములు లేకుండా జీవితం గడపినాడంటే, అందుకు ఆనాటి కర్ణాటరాజులను నిందించవలసిన నిమిత్తము లేదని నిర్ధారణ చేయవలసివస్తుంది.

అయినా, ఒక్క విషయం ఆలోచించాలి. మేలైన ఏనుగుదంతంతో నక్షి చెక్కిన పెట్టెమును గాని, వసందైనపందిరమంచమును గాని తయారుచేసిన పనివాడు దానిని ఎవరికైనా విక్రయించవలెనంటే, సంతలో పెట్టి సమస్తమైనవారికీ ప్రదర్శించిన ప్రయోజనం లేదు. అందమైన పందిరమంచము అంతఃపురంలో ఉండదగినది. దాని పనితన మెరింగిన ప్రభువు దానిని కొని తనివితీరందవలెను. ఆ ప్రభువునకు అది అవసరమా? అనవసరమా? అనే ప్రశ్న అనవసరము. ప్రభువున కది అనవసరమైనప్పటికీ, అటువంటి కళా ప్రావీణ్యమును, పనితనమును, అఖండ పాండిత్యమును ఆదరించి గౌరవించి, పెంచి పోషించవలసిన బాధ్యత రాజుల దనుట నిజము. అజంతాగుహాలలోని అద్భుత చిత్రలేఖనము శాతవాహన ప్రభువుల చిత్రకళాభిమానము అద్భుతమని చిత్రమని నేటికిని ఉల్లము పల్లవించునట్లుగా వెల్లడించుచున్నది. శాతవాహనులు చేసిన

కళావాహనముచే శాతవాహనులకీర్తి శతాధికమై శాశ్వతమైనది. అంజతా చిత్రములు అంటే ఆనాటి ఆంధ్రుల కళాసత్రములు. కళా ప్రవీణులగువారికి ఆనాటి ప్రభువులు అన్నము పెట్టి, పట్టుశాలువ లిచ్చి, పట్టము లిచ్చిన దీ గుహాలలోనే. ఈ చిత్రలేఖనమునకై ఆనాటి ప్రభువులు వెచ్చించినదంతా అర్థంలేని వ్యర్థవ్యయం అని భయంలేకుండా వాదించగలమా? కళా ప్రపంచంలో ఖరీదులు కట్టడం చాలా కష్టం. లాభనష్టాలను వ్యాపారసరళిగా గుణించి, పెట్టుబడికితగిన గిట్టుబడి అంచనా వేయడం, కళను ప్రేతకళగా మార్చి దానిని పాతిపెట్టడం అవుతుంది.

ముంతాజ్ బేగం చచ్చిపోతే షాజహాను చక్రవర్తి కోట్లు ఖర్చుచేసి తాజమహాలు అనే చలువరాతిమందిరంలో కళారాధన చేశాడు. టాన్‌సేన్ అనే అపూర్వ జగద్విఖ్యాత సంగీతవిద్వాంసుణ్ని అక్బరు చక్రవర్తి తన సహచరుణ్నిగా చేసికోవాలనే ఆసక్తితో అతనిని తన బుజాలమీద ఎక్కించుకొని, అతడందుకోలేని సహకారఫలమును (మామిడిపండును) అతనికి అందేటట్లుగా చేశాడు ఒకనాడు - కాని, ఔరంగజేబు చక్రవర్తి కళారాధన చేయలేక పోయినాడు. "తిరిగీ పైకి లేవకుండా సంగీతకళను లోతుగా పాతిపెట్టి సమాధిచేయండి" అని హుకుం జారీ చేశాడు. "కళ" అనేది అతనిలో లేదు. అందువల్లనే కళ అంటే అతనికి భయం. ఎలుగుబంటికి అగ్నిహోత్రుణ్ని చూస్తే భయం ఎందుచేత? ఒంటినిండా దండిగా పెరిగిన రోమములను హోమం చేయడం దానికి యిష్టములేదు సహానం లేనివాడు సహస్ర అసహ్య అవలక్షణాలపెడి రోమరాజితో విరాజిల్లు మూర్ఖుడై అడవి మనిషివలె అతి భయంకరుడై అతిభయస్థుడై అధఃపతితుడవుతాడు. రోమక్ సామ్రాజ్యం నాశనమైనట్లుగానే, మొగలు సామ్రాజ్యం కూడా ఔరంగజేబు చక్రవర్తితో వక్రగతిపాలైంది లయబద్ధమైన సంగీతమును లయం చేయాలనేవానిమూలంగా, మొగల్ సామ్రాజ్యం సమస్థాయిలో నిలువలేక, ప్రభువుకూ ప్రజలకూ శ్రుతి కలియక, అపశ్రుతిలోపడి, లయతప్పి, లయమైపోయింది.

భగవంతునిసృష్టి ఏ దృష్టితో చేయబడినదో మానవుడు పూర్తిగా అర్థం చేసికొనడం చాలా కష్టం. పుష్పములకు వింత రంగులను ఎందుకు చిత్రించాడు? తుమ్మెదలూ సీతాకోక చిలుకలూ మొదలైన రెక్కల పురుగులను ఆకర్షించుటకును, ఆ పురుగుల రెక్కలకు అంటుకొన్న పుప్పొడితో అవి తిరిగి అక్కడినుంచి ఎగిరిపోయి యితర పువ్వులమీద వ్రాలుటకును, ఆ పుప్పొడి సంపర్కంవల్ల పువ్వులు పిందలై కాయలై ఫలించుటకును పుష్పములను పలుతెరంగుల రంగుల హారరంగుల మెరుంగులు తురంగలించునట్లుగా బ్రహ్మ కడునేర్పుతో కల్పనచేశాడని వృక్షశాస్త్ర పండితుడు వాదిస్తాడు. ఆ పుష్పముల వింత కాంతులకు ఆ రెక్కల పురుగులు ఆనందము చెంది చిందులు త్రొక్కునట్లుగా చేసినవాడు బ్రహ్మయని గ్రహించినవాడే కవిబ్రహ్మ. ఒకవిధమైన సౌందర్య ప్రభావమును చూచి ఆనందించగల శక్తి ఆ పురుగులలో ఉంది. అదే దాని ఆత్మలో ఉన్న ఆనందం. ఆత్మ కోరేది ఆనందం. దుఃఖం కాదు. ఆనందం అనేది ఆత్మయొక్క ప్రత్యేక లక్షణం. సృష్టికర్త తన ప్రభావాన్ని తన మహత్తునూ యీ అందంవల్ల కలిగే ఆనందంలో ప్రతిఫలింపజేస్తున్నాడు. "ఆనందం" అంటేనే "బ్రహ్మ" అని, వృక్షశాస్త్రజ్ఞుల కంటె పది ఆకులు ఎక్కువ చదివిన, తత్వశాస్త్రజ్ఞులు అన్నారు. రవీంద్రనాథ టాగూరువంటి కవీంద్రుడు యీ విధంగా భగవత్తత్వమును ఉపాసన చేశాడు. సృష్టియావత్తూ లయబద్ధమైన ఆర్కెస్ట్రావలె (మనోహర వాద్య సమ్మేళనమువలె) ఆయనకు సాక్షాత్కరించింది. ఆయన ఆత్మ కూడా యీ వాద్య సమ్మేళనంలో హృద్యంగా సమశ్రుతి బద్ధమై చిందులు త్రొక్కింది. ఆయన వాక్కు ఆ రీతిగా పలికింది.

"పలికించెడువాడు రామభద్రుండట" అని త్రికరణశుద్ధిగా ముమ్మాటికీ చెప్పగల్గిన కవికి, సరస్వతీ సాక్షాత్కారం అయినదంటే అబద్ధంలేదు. సరస్వతియొక్క సాక్షాత్కారమైన కవికి బ్రహ్మకూడా సాక్షాత్కరించి ఉండక తప్పదు. బ్రహ్మానంద పరవశుడైనవాడు ఒక్కొక్కపదము తన నోటివెంట ఎట్లా వెంచేసిందో పేర్కొనలేడు. "తను వెంచేయు పదంబు పేర్కొనడనాథస్త్రీ జనాలాపముల్ వినెనో" అని పోతన్నగారు వ్రాసిన పద్యంలో ఆయన కవిబ్రహ్మ అయినాడా? బ్రహ్మ పలికించిన కవి అయినాడా? చెప్పలేము. భగవంతుడు గజేంద్రుని రక్షించడానికి బయలుదేరినప్పుడు ఎక్కడికి ఏదారిగా ప్రయాణమై పోతున్నాడో పేర్కొనడం లేదట—భగవంతుని గమనమార్గములు అగమ్యగోచరములు. వాటిని భగవంతుడు పేర్కొనడు.

★ కాలక్షేపం ★

ఎవ్వరికీ తెలియనివ్వడు. ఇంగ్లీషులో మిల్టను అనే మహోత్కృష్టకవి *"Paradise Lost"* (నష్టత్రివిష్టపం—అనగా మానవుడు కోల్పోయిన భూతల స్వర్గం) అనే గొప్ప పద్యకావ్యం వ్రాశాడు. ఈ గ్రంథ ప్రారంభంలో మొదటి పంక్తులలో తన కావ్యసంకల్పం వివరిస్తూ *"To Justify the ways of God unto man"*

"మానవకోటికి భగవల్లీలల
మహిమల వేద్య మొనర్చుటకై."

ఈ మహాకావ్యమును రచిస్తున్నానని నిర్వచించాడు. కాని, భగవంతుని లీలల యొక్క అంతరార్థములున్నూ పరమార్థములున్నూ అగమ్యగోచరములు. అవాఙ్మనస గోచరములు. మాటలకందని మేటి విషయము లవి. చూచి ఆనందించవలసిన దీ యీ సృష్టియొక్క విచిత్రలీల. అందువల్ల పోతన్నగారు భగవంతుని చిద్విలాసములను మన బుద్ధికందని అవకతవక అసంబద్ధ విషయములుగానే వర్ణించాడు. ఆర్తుడైన తన భక్తుడైన గజేంద్రుణ్ని రక్షించడానికి బయలుదేరిన భగవంతుడు "సిరికిం జెప్పడు, శంఖచక్రయుగమున్ చేదోయి సంధించడు"అని వర్ణించాడు. "తను వేంచేయు పదంబు పేర్కొనడు" అని భగవంతుని గమనపథకం అగమ్యగోచరం అన్నాడు. ఆవిధంగా తనకు అర్థంకాని అద్భుతలీలలకు అబ్బురము చెంది, ఉబ్బి తబ్బిబ్బయి, అట్టి ఆశ్చర్యంతో ఆనందపరవశుడైనాడు. అట్టి ఆనందంలో పరవశుడు కావడమే బ్రహ్మానందం పొందడం. అదే రససిద్ధి. పుష్పములోని మకరందం ఆస్వాదించే తేనెటీగకంటె, పుష్పముల పుట్టు పూర్వోత్తరముల పరిశీలించి పరిశోధించెడి శాస్త్రవేత్తకంటె, "మల్లియలార మీ పొదల మాటున లేడుగదమ్మ చెప్పరే" అని మల్లెపూవులను సంబోధించి, "ఓ మల్లెపూవులారా! భగవంతుడు మీ పొదలచాటున ఉన్నాడా? లేడా? చెప్పండి" అని ప్రశ్నించిన పోతన్న మహాకవి వెర్రివాడు కాడు. భగవంతుణ్ని వెతకడంకోసం శాస్త్రపరిశోధనలు చేసే మానవుల నందరినీ వెర్రివాళ్ళనుగా చేసిన బమ్మెర పోతన్నకు బ్రహ్మ సాక్షాత్కారం అయినదంటే, సరస్వతీసాక్షాత్కారం అయినదంటే అందులో అసత్యం లేదు.

అటువంటి బ్రహ్మవేత్తలగు కళాప్రవీణులను ఆదరించడంవల్ల మనలో ఉన్న బుద్ధి జాడ్యం కొంతయినా వారి సాంగత్య ప్రభావంవల్ల పోవచ్చును. అదికూడా మన ప్రాప్తమునుబట్టి ఉంటుంది. మన మేలు కోసం, మనం తరించడంకోసం, వారిని ఆరాధించాలి. త్యాగరాజు గారికి వెయ్యి న్నూటపదహార్లు కాదుగదా, వెయ్యి వెయ్యి న్నూటపదహార్లిచ్చినా, ఆయనకు అక్కర లేదు. రాముని సన్నిధి సుఖమా? నిధి చాలా సుఖమా? అని సవాలుచేసి, సంగీత స్వర రాగసుధాంబుధిలో తేలియాడే మహాత్ముణ్ని తంజావూరు మహారాజాగారు ఎంత ధనమిచ్చి కొనుక్కోగలడు? ఎంత ధనమిచ్చి తన పెంపుడు చిలుకవలె తన ఆస్థానంలో స్థిరస్థాయిగా ఉంచుకోగలడు? భగవంతుడైన శ్రీకృష్ణుని తన విడువారాల నగలతో తులతూచి తన మాటకు అడుగు దాటని భటునివలె చేసికోవలెనని సత్యభామ ప్రయత్నిస్తే ఏమైంది? మహాత్ముణ్ని చాకగా తన పైకంతో తన పైట కొంగుతో కట్టివేయాలంటే సాధ్యమవుతుందా? ఇది అంతటి "బలే మంచి చౌక బేరం" కాదు. కళాప్రపంచంలో బ్రహ్మానంద రససిద్ధిని పొంది, ఇటువంటి బ్రహ్మానందమును యితరులకు కలుగజేయగల మహాత్ములను యథాశక్తిగా మనము పూజించవలసినదేగాని, వెలయిచ్చి వలలో వేసికొనలేము. కాని, భక్తితో యథాశక్తిగా సమర్పించి సన్మానించి గౌరవంకూడా యివ్వలేని ప్రభువుల ధనం కళాప్రావీణ్యానికి యింధనం - కళను తగులబెట్టెడి యింధనం (వంటచెఱకు) అది. అటువంటివారికి కళారాధనం మోక్షసాధనం అనే విషయం విప్పి చెప్పడం విషమం.

రామయ్యగారు శుద్ధాంధ్రుడు. కర్ణాటక సంగీతం అనే మహార్ణవమే రామయ్యగారు అని చెప్పవచ్చు. వీణవాయిస్తే స్వర్గం నుంచిరాలుస్వరాలు అమృతధారలలీల చల్లని జల్లువలె సోకి ఒడలు జల్లుమనేది. ఆయన గాత్రం ఆ వీణలో లీనమైపోయేది. అంతటి ప్రవీణుడు యీ తెలుగుసీమలో ఉన్నాడంటే, ఆయనవిలువ తెలుగుజాతి తెలుసుకోలేకపోయింది. మైసూరునుంచి వచ్చిన ఒక మహావిద్వాంసుడు ఆయన సంగీతం విని సాష్టాంగ నమస్కారం చేశాడు. రామయ్యగారిని మైసూరుకు తీసికొనివెళ్ళి మహారాజాగారి చేత అఖండమైన సన్మానం చేయించాడు - చేతులకు రత్నాంకితములైన కడియాలూ, రెండునూటపదహార్లూ, పసిడి దుశ్శాలువలూ, అంగరఖాలూ మైసూరు మహారాజాగారు యిచ్చారు. రామయ్యగారిది పేద సంసారం. మూడెకరాల మాగాణీ భూమితో సంసార మీదుచూ, వీణె మీటుతూ కాలక్షేపం చేస్తున్నాడు. కుమార్తెవివాహానికి అప్పు చేసినందున ఉన్న ఆస్తికి ముప్పు వచ్చింది. ముసలివాడైనాడు. ఆంధ్రదేశంలోని బెజవాడవంటి మహాపట్టణం చేరి బ్రతుకవచ్చునని నిశ్చయించాడు. ఒక శ్రీమంతుడు నాటక సమాజాలు ఏర్పాటుచేస్తే, ఆ నాటక సమాజంలోని నటులకు తగిన సంగీత శిక్షణ యిచ్చి ఆ ధనికుని పోషణలో తన సంగీతానికీ సంసారానికీ ఆధార మేర్పడగలదని ఆశించాడు. ఆ నాటకసమాజసభ్యులందరూ యీ ముసలితాత సంగీతంతో ఎండిన ప్రాణులు చిగుర్చునని మాట కల్ల అన్నారు. నాటకరంగానికి బెండువంటి తేలిక సంగీతం, కాఫీ, ఇడ్లీ, టీ, బిస్కట్లులాగున అల్పాహారంవలెఉంటే అక్కరకు వస్తుందనిన్నీ, శాస్త్రకట్టు సంగీతంతోనూ తంబూరా శ్రుతిలోనూ, నాటకాలు గిట్టుబాటు కావనిన్నీ సిద్ధాంతీకరించిన నటబృందం రామయ్యగారికీ, ఆయన సంగీతానికీ "రాం! రాం!" అని వంతించారు. ఆ విషయాన్ని ఆ నాటక సమాజంవారు తమ సమాజపోషకుడైన శ్రీ రాజాగారికి నివేదించారు. వారి నివేదికను ఆ రాజాగారు శిరసావహించారు. రామయ్యగారు మాత్రం తన గాత్రసాధకం విరమించలేదు, ఒకరోజున ఒక తోటలోకూర్చొండి నిత్యకృత్య

గాత్ర సాధకం చేస్తున్నారు. ఆ తోటలో రెండు సంపెంగచెట్లు రెండు పెద్ద పొదల వలె పెరిగి, పండిన సంపంగి పూలతో ఘుమ ఘుమ లాడుతున్నాయి. అక్కడకు యిద్దరు ఆడపడుచులువచ్చి సంపంగిపూలుకోసి ఒక చెండువలె కట్టి, యింకా మరికొన్ని పూలు కోస్తూఉండగా ఎందుచేతనో ఆ యువతు లిద్దరు పెద్దపెట్టున "అమ్మో!" అని కేక వేశారు. అది విని రామయ్యగారు ఆ చెట్ల వద్దకు వెళ్లి చూచేసరికి రెండు కోడె త్రాచు పాములు పొదలవంటి ఆ రెండు సంపంగి చెట్ల కొమ్మలనుంచి పడగలువిప్పి బుస కొట్టుతూ ఉన్నాయి. వెంటనే రామయ్య గారు అక్కడే కూర్చుండి పున్నాగరాగం ఆలాపన చేయడం ప్రారంభించారు. ఆ సర్పములు రెండున్నూ ఆ రాగం ఆలకిస్తూ ఆయన సన్నిధిలోనే తలలూపుతూ తన్మయత్వం పొంది తటస్థంగా ఉన్నాయి. అరగంటసేపు ఆ[illegible]న ఆలాపన చేసిన పిమ్మట షడ్జమశ్రుతిలో రామయ్యగారు మరొక ఆలాపన చేయగానే ఆ సర్పములు సరసర దూరముగా పారిపోయినాయి. ఇదంతా అక్కడనే ఉండి చూచిన ఆడ పడుచులు ఆ తాతగారి అద్భుత సంగీతకళా ప్రభావమునకు సాష్టాంగ నమస్కారంచేసి సంపంగిపూల చెండును ఆయనకు సమర్పించి వెళ్ళిపోయినారు. రామయ్యగారు మర్నాడుమరొకసారి రాజుగారిని సందర్శించడానికి వెళ్ళితే, రాజాగారు ఎవ్వరితోనో ఏవో వ్యవహారాలు మాట్లాడుతున్నందువల్ల, అప్పుడు తన చేతిలో ఉన్న ఆ సంపంగి పూలచెండును మాత్రం ఆయనకు సమర్పించి వెళ్లిపోయినాడు. రాజాగారు దానిని యింటిలోనికి తీసికొనివెళ్ళి తన కుమార్తెల కిచ్చారు. వారిద్దరు అది చూచి ఆశ్చర్యపడి ఆ పండితునకు తామిచ్చిన చెండు ఇది యని చెప్పి, ఆ మహావిద్వాంసుని పిలిపించి సత్కరించవలసినదని తండ్రిని ప్రార్థించారు. నిజదారకుతో దరపోషణార్థమై వచ్చిన రామయ్యగారికి రాజాగారి వితరణ లభించలేదు సరిగదా ఆదరణకూడా అలభ్యమైంది. ఆదిగులుతోనే రామయ్యగారు దివంగతులైనారు. ఆఖరుక్షణంలో రాజాగారి ఆజ్ఞానుసారం రాజాగారి ఉద్యోగి ఆయనకు యివ్వవలెనని రెండువందల రూపాయీలు తెచ్చాడు. ఆ పైకంవచ్చే సరికి ఆయన ప్రాణం పైలోకానికివెళ్ళింది. ఆయన ఉత్తరక్రియలకు ఆపైకం ఉపయోగపడింది. రామయ్యగారి గానరసం విని విషసర్పములు ఆనందించాయి. "వేత్తి గానరసం ఫణిః" అనేమాట నిజమైంది. కాని ఆయన గానరసం నాటకసమాజాలవారు గ్రహించలేక గర్హించారు. ఆయనను పోషించగల ప్రభువు తెలిసికొనలేకపోయినాడు. "వేత్తిగానరసం ఫణిః" (సర్పమునకు గానరసం వేద్యముగను) అనేది నిజమే కాని, "వేత్తి గానరసంప్రభుః" అనేది నిజంకాలేదు. అటువంటి మహా విద్వాంసుని ఆత్మ ఆనాదబ్రహ్మానందంలో పరిపక్వమై తరించిఉంటుంది. ఆయనభుక్తి ప్రభువులు లోటుచేసినా, లోకం లోటు చేసినా, ఆయన ముక్తికి లోటులేదు. అటువంటి జీవన్ముక్తుడైన రామయ్యగారు ఏనాడో సుమారు 44 ఏండ్ల క్రిందట మారి అన్నారు. ఆయనే మారి రామయ్యగారు. (జననము 1860 సం॥ ప్రాంతం)

"అంధక జనదూషితంబులు ఘనంబులు గావె యమూల్య రత్నముల్" ★

ఖండిత

పఠాభి

అన్యాంగన సంభోగము
సల్పగ, కుంకుమ రాగము
వక్షమ్మున వ్యాపింపఁగ
మదుట లాక్ష దీపింపఁగ

ప్రియుడు రాగ నుదయమ్మున
సాధారణమగు వీక్షణ
ములఁజూచును, తన తీక్షణ
రుష నణంచి హృదయమ్మున,

పరాయి పురుషుండిత
డన్నట్టుల ఖండిత!
ముడుతపడని తన పక్కను,
చెదరని కస్తురి చుక్కను,
విడిపోవని తన వేణిని,
మాయనట్టి పారాణిని,

రాలిపడని గంధమ్మును
నలగని మల్లీమాలను,
వదలనట్టి వస్త్రాలను,
వ్యర్థమయిన అందమ్మును
తలఁచి, అశ్రుమోచన
నలుపు కరుణలోచన!

కంఠాశ్లేష సుఖాలను
కలుగనట్టి తన కరాలను,
కాంతుని చిక్కని మొత్తుల
అదుమబడని చనుగుత్తుల,

అతఁడు కనని పద్మనమును
బూడిద యందున పోసిన
పన్నీరటు, వని కాసిన
జ్యోత్స్నటు చక్కదనమ్మును
తలఁచి దుఃఖ సించిత
మనస్క, ప్రియవంచిత!

"ఇపుడు వల్లభుఁడు వచ్చుట
ద్విగుణీకృతముగ రెచ్చుట
తప్ప మదీయ వియోగము
అత్యంత నిరుపయోగము
మన్మనోహరుని రూపము

మరణమ్ము తాధరించుక
రాకూడద! నాకించుక
లేకుండు విరహతాపము"
అని ఖ్రమించు ఖండిత,
మన్మథశర దండిత!

"రఘ్జాం గోడ"

"ఇటు 'రఘ్జాం'గోడ అటు 'జైలు' గోడ దాటి గోదావరి రాదని కాబోలు రెండుగోడల మధ్యను 'హాట్ మెంటుపురం' నిర్మించారు" అన్నాను, ఓపొద్దు సంచారంచేస్తూ, కూడా వున్న స్నేహితునితో. స్నేహితుడు తదేక ధ్యానంగా "హాట్ మెంట్ పురం" యొక్క కుటీరాల్ని, పుట్టకీటు నుండి వట్టిగడ్డి కప్పులదాకా పరికిస్తూ, నా మాట వినిపించుకోనివాడిలా కొంతసేపు ప్రవర్తించాడు. ఆ కొంతసేపు నేను ఏదో కూనరాగం తీసుకుంటూ, నా మానాన్ని నేను, చుట్టూ చూడసాగాను, ఇతని ప్రమేయం ఏమిటన్నట్టు!

ఆ కుసింత వ్యవధి ఎటువంటి కాలం అంటే, అటువంటి కాలం అనుకోండి! మంచి శరత్కాలం మంచుపడే దీర్ఘనిశీధిని యొక్క తెల్లవారఝాం! ఏదో తోచక యిద్దరం ఒయలుదేరేం ఉషఃకాల విహారంగా! ఏదో తోచక అనేకన్న ఆ వెన్నెలనే చూచి అంటే ప్రకృతికి ఒప్పేనేమో?

తెల్లగా పడమటినుంచి చంద్రుడు చలగా ప్రసరిస్తూ వున్నాడింకా తన శుభ్రజ్యోత్స్న! క్రుంకవచ్చు అతగాడు మరో గంట గంటన్నరలో! పూరాబింబంగా తోచలే మళ్ళీ చూస్తే! ఒక కళో రెండు కళలో అప్పుడే దేవతలు ఫలహారంచేసినట్లే క్షీణత చూపేడు. కాని చిక్కగానే వుంది కాంతి! కన సొంపుగానే వుంది. మరిన్నీ "హాట్ మెంట్లు" అన్నింటికీ కొత్తగా వెల్లవేసి, వినోదరూపం ఇచ్చారేమో, సౌధాలు కాకపోయినా సౌధామాకు లంత సౌఖ్యంగా కానిపించాయి సుధాకర తేజంలో!

మా మూకీభావం మళ్ళా ఎప్పుడు సమాప్తమైందంటే, మిత్రుడు మాట్లాడినప్పుడే! "ఇది "హాట్ మెంట్ పురం"లా లేదు. "నెహ్రూ నగర"మేనోయి" అన్నాడు నా స్నేహితుడు. "బల్ల కట్టివున్నంతసేపూ కాదనడానికెవరి తరం?—అవితే ఇలాగే ఆర్యాపురానికి 'లిస్టర్ పేట' అని పేరున్నట్లు హిస్టరీ చెప్పేని, ఇప్పుడెవడైనా ఆపేరెట్టి పిలుస్తూ వున్నాడా? అందరూ ఆర్యాపురమనే అంటున్నారు!" అన్నాను. "అవితే 'హిస్టరియా'కు పూర్వం ఇన్నీసుపేట నేమనేవారు?" అని అడిగాడు నేస్తుడెటకారంగా!

"అది స్వతహాగా ప్లీడర్లు అంతా వుండే పేట కాబట్టి, ఇంగ్లండులో "ఇన్స" అన్నది బ్యారిష్టర్లను తయారుచేసేది కాబట్టి, ఆ బ్యారిష్టర్లలాంటి ప్లీడర్లే హీళ్ళు కాబట్టి, ఆ పేట ఇన్నీసుపేట అనేరు" అన్నాను అతి సీరియస్ గా.

"కాదు. "ఇన్" అంటే సత్రవు, నాళం వారి సత్రవుచేరువనుండబట్టే ఆపేరొచ్చింది" అన్నాడు మిత్రుడు, నిఘంటువు పెట్టి నన్నొంటిపాటున కొట్టినట్టు. ఇలా పేర్ల మీద పేటలమీద కొంతవఱకు మేమిద్దఱం తర్జనభర్జనంచేసుకు మళ్ళీ మౌనందాల్చాం! ఈ మధ్యమధ్య మా మౌనాని క్కారణం, చుట్టూవున్న ప్రకృతియొక్క పరమాత్మస్వరూపమే అని నమ్మండి!

"హాట్ మెంట్లు" నిర్మాణం అయినా ఇంకా పదిగెట్లు వల్లమాల్నంత ఖాళీస్థలం వుంది. కాపురం వుండేవాళ్ళుంటే అక్కడ కాళీఘట్ తెచ్చి యిక్కడ పెట్టొచ్చు. అదంతా ఎఱ్ఱమట్టి ఇసుక కలిసిన మెఱక ప్రదేశం. సూర్యోదయం అయితే, ఆ జేగురుమటి పూసకు ఉదయం కసరత్తు చేసి ఆంజనేయులో మండేహాలో ఉయించి, ఆవెంటనే విజయవంతంగా పిలువడతూ వున్నాడా ఓ గుండాభాయి అని అనకోవలసిందే! అంత నిర్మానుష్యంగాను, నిర్మలంగాను, నిశ్చింతగాను వున్న జాగా!

ఎక్కడైనా పెద్దపుట కనిపిస్తే అందులో ఏ వాల్మీకి మహామునో ఇంకా వున్నాడనేటంత పురాతనంగా కనిపిస్తుంది. మఱి ఆ చుట్టుప్రక్కల చింతలు, తాళ్లు, రేగుపొదలు, జీడిమామిడిమొక్కలు, వేపలు ఇవన్నీ కూడా శతవృద్ధులవల్ల పోల్చబడవలసిందే! ఏనాడు నాటబడ్డాయో? "కోట'కు ముందు అనాదినుంచీ వెలిసినవంటారు. మనుష్యులువేస్తే లేచినవి కావుట! కడచిన కల్పాంత ప్రళయమప్పుడు గింజపెటిల్లి పల్లటిల్లి బయలుదేఱిన వనాంతరాలై యుండాలి తదాదీ అవన్నీ సందులేనివై, స్వాధీనం కానివై, ఒలిసి, కలగలసి, నిలిచివుండాలి. భగవాన్ ఆ సర్వేశ్వరునియొక్క అవ్యాజ కరుణా కటాక్ష వీక్షణాలవల్ల!

ఆలా ఒక నిమేషం దేవుణ్ణి స్మరిస్తూ, ఒకనిమేషం ప్రకృతిని వరిస్తూ, నడిచాం కొంతమేఱ. అంతా ఇంకా రాత్రిలాగే కనిపించింది. "అరెరె! మన మేమైనా అనుకొన్న వేళకు చాలా ముందుగా మేలుకొన్నామా?" అని నాలుక్క అచుకున్న వాళ్ళమై మళ్ళేం! నిజమే కూడాను! ఒకొక్కప్పుడు, వెన్నెల రాత్రుళ్ళు అర్ధరాత్రే కూస్తాయి కాకులు కావుకావుమని, కోళ్ళు కొక్కరోకో మని!

వెనక్కు మళ్ళీ మళ్ళేటంలో, స్ఫుటతరంగా "జైలు" గోడ, గోడలోపలి ఉరిస్తంభాలు కానవచ్చాయి మాకు ఉత్తరపు దెస. మఱి దక్షిణపు దెస "రంజాం" గోడ యొక్క సుమారు రెండుగజాల యెత్తు మూడుగజాల పొడుగు, అరగజం మందం, పైనీతట్టు ఆతట్టు రెండు గుమ్మటాలు పొడుగుపాటివి రెండు పొట్టివి, ఇలా సమస్తం సర్వాంగసుందరంగా, అతి గుట్టుగా పుట్టగొడుగుల్లో లేచివున్నట్టుంది.

ఈ జైలుగోడదూకి ఆ రంజాం గోడకేసి నడుస్తూవున్న ఒకానొక వ్యక్తియొక్క నీడ, నీడతోపాటు వాడు, వాడు అనగా ఆ నీడకు హక్కుదారుడు, అసలు దారుడు అయిన మగవాడు కాపడ్డాడు. అతణ్ణి అడ్డు తగిలా లేకపోయినాం! 'ఎవరవు?' అని అడగలేకపోయినాం! కాని అరసి ఆశ్చర్యపోయాం! ఆశ్చర్యపోయి ఆపాళంగా

నిశ్చేష్ఠులం గాక, సర్వసాధారణులకు మల్లే! —ధైర్యంగా అనుసరించాం! అనుసరించిన కొద్దీ, చురుకుగా అంజలు వేసినవాడై ఆ వ్యక్తి వెనక్కు చూడకుండానే 'రంజాం' గోడముందు మోకరించాడు. ఎప్పుడైతే మోకరించాడో మేమల్లంత దూరాన్ని అతగాడికి తెలియకుండా ఆగిపోయాం!

అతడు తన తెల్లని గడ్డాన్ని, పిడప చలి గాల్లో, తుదివన్నెల్లో తెల్లుపురలా అల్లల్లాడిం మకుంటూ, నమాజు చేసేడు ఆ రంజాం గోడ కెదురుగా! అలా అతగాడు నమాజు చేస్తూనే వున్నాడు - జైలుగోడమీదనుండి జోడుగుళ్ళ బారుతుపాకి ధాంమని పేలింది! రెండు గుళ్ళు రెండు గుళ్ళు మా బుజాలు రాసుకుంటూ పోయాయా అన్నంత "విజ్జు"మంటూ దాటి ఆ నమాజు చేస్తూ వున్న మనిషియొక్క వీపున తగిలాయి. అతగాడు రిమ్మతిరిగి పడ్డట్టుపడిపోయినాడు మాట లేకుండా! మఱి వాటం అంతా తాలుమాలైంది. ఏమైపోయినాడో ఆవలకూ కనబడిచిన చుఱుకూ, వరికీ గొఱకని దుముకూ దూరమూ!

జైలుగోడమీదనుండి తుపాకులు పేల్చిన జవానులు ఇద్దఱూ ఉరుం పట్టున దిగారో ఏమో, ఈవల తట్టుకు అనగా, మాతట్టుకు, దిగి, పడివున్న ముసిలి ఖైదీవంకకు నడుస్తూ వచ్చారు - బ్రతికివున్నాడో చనిపోయినవాడో అని చూడ్డానికి లాగుంది.

మేము వాళ్లను వాళ్ళ తుపాకులను చూస్తూ చూస్తూ, మెల్లిగా "రంజాం" గోడ ఆవలితట్టుకు అనగా రెండో వెంపుకు తప్పుకున్నాం. —గోడకు రెండువైపు లుంటాయిగా?—

ఉండుండి పొట్టిదుమ్మటాల సందునున్న ఒంటి దిమ్మ మీదుగా తలలెత్తి కనుగొనే వాళ్ళం! గోడావలితట్టు మఱే మాటెగాని దృశ్యం కానరాలేదు. మాటన్నా 'బుడా' 'దాడే' జలజలా రాలిపోతున్న మాత్రంగా ధ్వనించింది "జైలు గోడ దాటడం నేర్చానుగాని, యీ రంజాంగోడ దూకడం నేర్వలేకపోయాను!-ఇక్కడ చచ్చానుభే! ఇక్కడ చచ్చానుభే!" అన్నట్టయింది

అతడనుకొనే స్వగతం జగత్తుకు వినబడకుండా, జైలుజవానులు జోళ్ళ సమేతంగా కాళ్లు చప్పుడు గావించుకుంటూ, "జైలుగోడ దూకినవాడు ఈ పొట్టిగోడ దూకలేకపోయాడా? మతం వాని నల్లా చేసింది! అల్లా బిసిమిల్లా!" అనుకుంటూ వానిని మోసుకుపోయేరు!—

నేను నా స్నేహితుడు తలలెత్తి ఈ తట్టునుండి ఆతట్టు మాపులా నృసరికి అంతా ఆ మహాదృశ్యం హారతి కర్పూరం హరించి పోయిలు హరించిపోయింది.

గోడ్డుమీదవచ్చి తెల్లారితే పునరావృత్తంగా పై వృత్తాంతం మేం స్నేహితులం బిగ్గరగా చెప్పుకొంటూంటే, బాటసార్లు అనేరు "అంత విడ్డూరం జరిగి, ఫిరంగులే పేలివుంటే, ఆకొండున్న గుడిసెల్లో వాళ్ళింకా తమ అరచేతులు గుండెలమీద పెట్టుకు వెచ్చెచ్చగా నిదరోతూ వుండగలరా? మీదంతా కవనం కరణం కవితె!" అన్నారు. "ఆ పురంలో కాపురం వున్న వాళ్లందరూ సొంత యిళ్ళుమధ్య పడిపోయిన బాపతువారి వాళ్లు. మీకేం తెలుసు? సాదూ నిప్పడే జేరమోసుకు బడలి నిద్రించేరు!". అన్నాను బాటసారులు నవ్వేరు. నా మిత్రుడుకూడా ఎప్పుడూ నవ్వనివాడు నవ్వేడు.

కాని క్షీణచంద్రుడొక్కడూ మాత్రం నాతో ఈడూ జోడూ గావుండి, తాను వెలవెలబోతూవున్నా నామాట నమ్మేడు. ఏంచేతా? ఇస్లామ్ చిహ్నం చంద్రవంక కాబట్టి!

జైలు నాలుగుగోడల మధ్య? ఏ మతం లేదు! ఏ కులం లేదు!—అక్కడ ఏ లేది అంధకార మొక్కటే! సూర్యభగవానుడా? ఉండడు! చుక్కలు మొదట్నే కనబడవు! అవన్నీ యీవలి స్వేచ్ఛావాతావరణంలోనివే

ఈలా ఈలా మళ్ళీ మానంలో పడ్డాం! నేనూ నా మిత్రుడూను; ఈమాటు బాటు, బాటసార్లు కూడా పరిహరింపబడ్డారు! ★



స్నానఘట్టం ఫొటో: యల్. యమ్. యన్. బాబు, మద్రాసు.

విడిజోడు

ఆ వాడు అలంపురానికి 'హైదరాబాదు ఆంధ్ర సారస్వత పరిషత్తు వారి సప్తమ వార్షికోత్సవాలకు వెళ్ళేనాడు గూడా అంతా సర్దినాకా ఒక చేసంచి ఎక్స్ట్రాని ఇవ్వమన్నాను మా యింట్లో. "మూటాముల్లె అంతా అయింది ఇంకే మున్నయ్ పెట్టడానికి" అంది మా ఆవిడ.

"ఆఁ చెప్పులు..."అన్నాను ప్రయాణం తొందరలో కోపంగా.

"అవునేమో ఆ స్థిరాస్తి రక్షణ ఒకటుందిగదా! ప్రొద్దస్తమానమూ పుస్తకాలు తిప్పి వేయడమే, మాపంతా చదువే, ఇంతకూ మఱుపును విరిచే విజ్ఞానమంటూ అంటక పోయె మీకు. చీటికి మాటికి చెప్పులు పోవడమున్నా తప్పేది" అని వంట ఇంట్లోంచి వస్తూంది జవాబు.

"ఆఁ అది అవసరమనిపించేసరికి నీకు రాసిపాలూ పెట్టి ఎఱుక మఱుపుల కరిగించే ఏ వేదాంతితో శిష్యుణ్ణి కావలసిందే" అంటూ అవలబడి వెళ్ళిపోయాను.

అలంపురంలో జరిగిన సమావేశాలలో కథక సమ్మేళనం ఒకటి. ఆ కథకులలో ఒకరు వ్యక్తిపరిచయం లేదుకాని, ఒకరు కాలుకురాని పాత చెప్పులకథ ఒకటి చదివారు. పాదరక్షల ఇతిహాసంగదా! పర్వాలేదురా! నా మతిమరుపుకు ఏదో మార్గం దొరుకుతుంది. అని సావధానంగా విన్నాను సారాంశమేమంటే ఒకదానికి కప్పూ, రెండవదానికి ఉంగరమూ, తెగిన జోడుతో పరిచిత వ్యక్తుల మధ్య ఎంత చలాకీగా మెలగుతూ వచ్చినా అవమానం తప్పింది కాదని తేలింది. కాని, నా మతిమరుపుకు మార్గం దొరకలా, ఏమిట్రా! కొత్తకొత్త జోళ్లు కొనే అలవాటు నాది. పాతవికూడా పారేయని ఉద్దేశం ఈయనది; అనే అభిప్రాయ భేదంతో అన్నసత్రంలో కలిసినపుడు

మంప రామారెడ్డి

"కావ్యప్రయోజనము ఆనందమూ, ఉపయోగమూ, అంటు రెండువిధాలు కావున మీకథ ఆనందావేశంలో రెండవదాన్ని గోలుపోయిం"దని ఆయనతో ముగమాటము లేకుండా నలుగురిలో అనేశాను.

నా చిన్ననాటి మాట. భజనఅంటే పెద్ద సరదాగా ఉండేది. చుట్టపు చూపుగా వెళ్ళిన ఒక గ్రామంలో ప్రొద్దుపోక హనుమద్దేవాలయం వద్ద జరిగే ఆకుపూజ చూడడానికై పోయాను, అడుగుల భజన జోరుగా సాగుతూంది. మద్దెలకాడు ఎవరో మామంచి రేటుకాడు, మూలనున్న ముసలాతనికి గూడా ముద్ది రేగికే అంత హుషారుగా వాయిస్తున్నాడు. కుప్పలుగా విడిసిన చెప్పులల్లో నా జోడూ వదలి, ఎగురుదామను ఉత్సాహంతో అందరిలో కలిశాను. అంతా ముగిసినాక గోవిందలు పెట్టి ప్రసాదం పంచారు, నేనుగూడా "గోవింద యనుకుంటు కొబ్బరను తినుకుంటు నారాయణనుకుంటునములుకుంటూ" ముద్ద పిడుకల కుప్పలా పడియున్న చెప్పుల కుప్పదగ్గితికి వచ్చాను. కాళ్లకు కన్నులేక వంగిచూచాను. అన్నీ గూడలూడిన బోడచెప్పులూ, కప్పులు తెగిన దొప్ప చెప్పులూ, మడమలరిగిన చెప్పులూ, ముంజెమ్మలు ముడిచిన చెప్పులూ, పక్కలన్నా మురికి చూడనొల్లని ముక్కచెప్పులూ, దిగదుడుపులకు గూడాపనికిరాని పాతచెప్పులూ, చిన్నచిన్న చెప్పులూ, పెద్దపెద్ద చెప్పులూ, ముద్దముద్ద చెప్పులూ, మొద్దు, మొద్దు చెప్పులే పడియున్నవి కాని, నా ముద్దుముద్దు చెన్నపట్నం చెప్పులు లేవు.

"ఏమలా తడుములాడుతున్నావు?" అని వెనుకాల ఒకరు. అపుడు నేను—

"అప్పావిమని చెప్పేను
ఇప్పరిదేవళముపద్ద హీనుండెవడో
లప్పలటువంటి చెప్పులు
గప్పననే లేపె.............."

అని తికమకపడి తిట్టుకవిత్వధోరణిలో పడ్డాను. కానీ అగుపడ్డ అందానికి ఆసపడడం మానవస్వభావాల్లో ఒకటిగదా! ఆకర్షణీయమైన ఆ నా జోడు ఏ అమాయిక హృదయానికి అపహరణ విద్య నేర్పిందో! అని నామట్టుకు ఈనాడు భావిస్తాను.

నాటినుండి మావాళ్ళకు నేను చెప్పులు మరచివస్తాననే నమ్మకమూ, కొనే అధికారముగాని అర్థముగాని నాచేతిలో లేకపోవడమూ, కారణంగా నాగతి అంతగానే ఉండింది.

"గోధుమరంగు మనిషివి; తెల్లగ కొంగ రెక్కల్లాంటి పంచెలు, ఈరకాను రుద్దిన నల్లటి జోడావులు (పలుచని చెప్పులు) వేయించుతో బావా నీకాళ్ళకు ముద్దొస్తవి" అన్నది మా మరదలు ఆమధ్యన ఒకసారి సౌందర్యోపాసనోత్సుకమైన ఆ లలితహృదయంలోనుంచి వెలువడిన మృదువాక్యం కమ్మని కవిత్వంలా నన్నాకరించింది. ఆ వర్ణనకు పొంగిపోయి నిజంగా నేనెంత సోగ్గా తయారౌతానో అప్పటికి అనుకొని పరీక్షలకు వెళ్ళిన సందర్భంలో పట్నంలో బ్లాక్ పాలిష్మయమైన జోడొకటి కొని తెచ్చాను. షికారు చేస్తూ పంచె సింగులకింది పాదరక్షల సొగసూ, మా మరదలి మధురవాక్యమూ, స్మృతిపథంలో ఐక్యంచేసుకొని అప్పుడప్పుడు సంతోషించే వాణ్ణి.

"కొత్తగా మతంలో చేరినవాళ్లకు పంగనామాలు మహావిస్తారం" అన్నట్లు పోలీసు యాక్షను తరువాత ప్రజలు మా ప్రాంతంలో

చాలా కాలానికి కన్పించిన స్నేహితునితో:
"అరేభాయీ! యింకా సుశీల మీద విరహగీతాలు వ్రాస్తున్నావురా?"
"అబ్బే లేదురా_మానేశా"
"ఏం? ఏమన్నా పేచీ వచ్చిందా?"
"పేచీ ఎందుకురా! పెళ్ళి చేసుకుంటే!"
—వి. లక్ష్మణశాస్త్రి, విజయవాడ.

నా వెంట ఉపకేశువ బాంధవులు కొందరు.

మున్నూరు రూపాయిలు పోయి, మూతిమీది మీసము పోయి, సోమయాజులు అనే పేరురాని నంబి నర్సయ్యలాగా తయారయ్యాను.

"లోల్లలో నీవొకనివి సదరవోయ్" అని ఒక ఉపదేశం అందింది.

శీఘ్రబుద్దిలో నైచ్యమని భావించక ఒక క్యాన్వాజు బూట్లజోడు లావారసుగా ఉంటే తగిలించుకొని వెళుతున్నాను. బహుశా అవి మత్పూర్వ గృహీత చోరాగ్రేసర చక్రవర్తివే అయుండాలి.

మూడడుగు లేశానో లేదో నా బూటు కాళ్ళను భూదేవి ముద్దాడుతూంది ఏమిరా! అని చూచాను. అడుగుభాగంలో ఐ జి. రూపాయి అంత అరిగిన తూట్లు. తోడి వాళ్ళు గొల్లున నవ్వారు.

ఇదేమిరా పుడిదిపోయి ఎడమది ఉండడ మేమిటి? అనుకున్నాను. కాని, తంత్రం మొదలు తండ్లాటవరకూ దానితో మనకు నిత్య సాన్నిహిత్యం. దానికిచ్చిన ప్రత్యేకం గౌరవానికి కృతజ్ఞతా సూచకంగా నిలిచిందేమో! కాని, రామాయణ రచనకు కారణభూతమైన క్రౌంచంవలె, జోడు చెడసిన స్థితిలో నాలో ఎంతో భావ వైశ్లవ్యాన్ని కలిగించింది దాని ఔదాసీన్యం.

తిరిగి బరిగాళ్ళ భాగ్యం బట్టింది.

నిప్పులమీది బూడిదను గూడా నీడెంతో అనే గ్రీష్మాతపంలో భీష్మించిన భూరజంతో ఎంత కాలమంటూ ఏగుతాం.

"చెప్పులన్నా గుట్టకపోతివి మనిగా!" అని ఒక మేతరి నడిగాను.

"తోలు దొరికేది తిప్పలయింది దొరా

★ విడిజోడు ★

గాంధేయులను గౌరవించడం ఎక్కువైంది. ఆ రోజుల్లోనే మా జిల్లా కాంగ్రెసు అధ్యక్షునికి జరిపిన ఘన సన్మాన సభ యొకటి.

మాలో కొందఱితోపాటు నేనూ సభలో చదువాలనే ఆదుర్దాతో రెండు పద్యాలు అల్లుకొని, కార్యదర్శిని బ్రతిమిలాడి బామిలాడి నా పేరు ప్రోగ్రాములో వ్రాయించుకొని, పరిశుభ్రంగా పరిచిన వేదికగదా అని, పాదరక్షలు దిగవిడి పైకి వెళ్ళాను.

సభా కార్యక్రమము సాగింది నా వెంబరు కూడా దాటింది. ఆ కార్యకర్త ఎవరో నాకు సమయమివ్వడు నేనెవ్వరో! ఎక్కడ కమ్యూనిష్టు ఉపన్యాసం కొడతానో! అన్న భయమట ఆతనికి. ఇక నాకా భక్తి సభ మీద, చిత్తము చెప్పులమీద. తీరా కృతజ్ఞత లర్పించేవరకువచ్చి చిన్నపుచ్చే తోలాడు ఆ కార్యకర్త నన్ను. నలుగురితోపాటు నేను లేచి సభలో గౌరవం సంపాదించుకోపోతిమిగదా! అనే పిచ్చిభ్రమతో నిరాశగా వేదిక దిగి చూశాను. ఏమి చెప్పాలి, చెప్పులజాడ మీరూహించుకో నేఉంటారు.

ఛాన్సు దొరకనందుకు చింతించకు "కర్మణ్యే వాధికారస్తే మాఫలేషు కదాచన" అని శాంతివచనంగా గీతావాక్యం చెప్పాడు మా శర్మ. "అద్దెకు వద్ద ఆశకు పోతే తూమెడువడ్లు దూడ మేసినట్లు" ఉంది.

"జరుగుతుంటవోయ్ మస్తుగ "పండిట్‌జీకే చప్పల్ పార్" అనే విషయం గూడా ఎ. ఐ. సి. సి. వార్తలలో ఒకటిగా చదివాను అనీ

"పోతే చెప్పంబాయెపారా" అనీ

"బాగుంటయి పావోయ్ ఎండాకాలం ఉమ్మరం వేయకుండా" అని ఒక విచిత్ర సమాధానం

"చెప్పులదొంగ వద్దకునిలాగా ఎక్కడ సంగ్రహించావురా? ఈ పిట్టగూళ్ళలాంటి పాత జాతాలు" అని ఒక వెక్కిరింపు

అప్పటికి వైరాగ్యం కలిగి ఆ మహా త్యాగం అక్కడే చేసి ప్రస్థానించాను.

మళ్ళీ బుద్ధి. సభలూ, సమావేశాలూ, నాటకాలూ, బూటకాలూ, పెళ్ళిళ్ళూ, పేరంటాలూ, అంటే హోళీ పండుగలో తిరిగినట్లు పాతసరుకుతో బయలుదేరాల్సిందే.

రసము సామాజిక నిష్ఠమా? నాట్య నిష్ఠమా? అని మాలో కొందరికి వాదోపవాదాలు. అటు కొంతా ఇటు కొంతా నేర్చిన అర్థవిజ్ఞానంతో నేనూ కొంత కల్పించుకొని మాటలాడేవాణ్ణి. ఈ పిచ్చి ముదిరింది. వీలైతే డ్రామాలలో ఆడి ఈ సమస్యను రంగస్థల పరిచయంతో తేల్చుకోవాలనీ, సినిమాలు తరుచూ చూడాలనీ, జిజ్ఞాస అంకురించింది.

ఇది కారణంగా మాజట్టితో ఒక నాటక సమాజానికి ప్రేక్షకులమై ఎద్దుబండిలో వెళ్ళి తిరిగివస్తూ మేము పూర్వము విన్నంత ఘనప్రదర్శనంగా అది లేకపోవడమూ, తత్సమాజ చర్చకు సంబంధించిన గప్పాలలో చెప్పాలను మరచిపోవడమూ, అందులో ఒకటి ఆగ్రహించి అంతర్ధానము కావడమూ, అన్వేషించగా ఎడమ రత్నమాత్రము నిద్రమబ్బులో తలగడగా ఉపయోగించిన మా మిత్రుని తలక్రింద దొరకడమూ

★ ఏడిజోడు ★

యీసంగిలోండాలకే యీసారుకున్నాం" అన్నాడు.
"అల్లైందు కయ్యిందిరా?"
"పసులకు ఏం నొప్పులున్నంగ చస్తుండవయ్యా! నూస్తలేవూ!"
ఒరీ నీ దుంపదెగా! పసులకు రోగాలు వద్దూ, నాకు నీకొత్తచెప్పులువద్దూ, అనుకొని ఈనిన బఱ్ఱెకు దిష్టికొట్టకుండా కట్టి విడిచిన పాతచెప్పు ఒకటి మా యింట్లో దొరి

"డాక్టర్ గారు! నేను పావలా కాసు మింగేశానండి"

"ఎప్పుడు మింగావు?"

"నాలుగురోజులౌతుందండి"

"అప్పుడెందుకు రాలేదు?"

"అప్పుడు డబ్బు వుందండి. ఇప్పుడు లేదండి"...

—కె. కోటి, గుంటూరు.

* * *

సైన్సుమాస్టారు: సోమూ! నీరు మంచుగడ్డగా మారేటప్పుడు జరిగే మార్పు ఏమిటి?

సోమూ: ధరసార్, ధర.

(సాంబశివరావు—తెనాలి.)

కించుకొని, ఇంతవరకూ ఏకాంత సమాధిలో ఉన్న రఘాదత్తునికి పోలికగా కట్టించుకొని ఏదో దినాలు దొర్లేస్తున్నాను.

కుండ మూస్తాం, చాట మూస్తాం, నోరు మూస్తామా? నన్నూ, నా చెప్పులనూ చూశి నలుగురూ నానామాటలు. ఏమంటే నాది "విడిజోడట" వీళ్ళ మొహం జోడు ఎక్కడ కుదిరిందని, మరి ఇక్కడ కుదురలేదని, వీరి విమర్శనో! నిజానికివస్తే వాళ్ళకూ, వాళ్ళ పెళ్ళాలకూ జోడు కుదిరిందటనా? కుదిరితే దక్కిందటనా? పోనీ ఆ సృష్టికర్తనే అడుగండి రెండు కంఠస్వరాలూ, రెండు ఆకారాలూ ఎక్కడన్నా మరచైనా కలిపినాడేమో. కొద్దిపోలికలో దిగ్భ్రమజెంది యెవరినో మన పరిచితులని భావించి తటాలున సంబంధం కలిగించుకొని పృచ్ఛకు దిగడమూ, తర్వాత తిక్కాబిక్కా కావడమూ, జరిగీ రాపడినిలిచే రంభాంశ సంభూతలనూ, మాటాడుటకు తోచని మాయానలకూబరులనూ, అప్పుడప్పుడు చూస్తూవుంటాము. ఈ సత్యాన్ని గ్రహించిననాటినుండే కావచ్చు "ఘోడా, జోడా, నహీమిల్తా" అనే సామెత సంభూతమైంది.

బహుముఖ పాండిత్యమూ, విశాలవిజ్ఞానమూ, గల అయ్యలరాజు నారాయణామాత్యుడే జతల పిచ్చిలోబడి తన హంసవింశతిలో:

"కలికి నీసిబ్బెంపు గబ్బిగుబ్బలువాని
గడుసు చేతులబట్టి కలచనగునె,
కాంతరో నీ తావికావి మోవిటువాని
కొక్కుదంతంబుల నొక్కదగునె,
చెలువ నీ జిగిమోము గలమోము మరివాని
తొట్టనోరున ముద్దువెట్టదగునె,
కుదతి నీ కనకంపు సొంపుదేహము వాని
కరకు మేనున జేర్చి కలయనగునె,
కులుకు శృంగార రసములు చిలుకు కీలు
బొమ్మవలె నీటుగల దానవమ్మ నీవు
మర్కటము వంటివాడు నీ మగడు తలప
వానితోగూడి రతికేళి బూనుటెట్లు?"

అని, ఆడిపోసుకున్నాడు. ఈలాంటి వాళ్ళ సంఘానికి చేసే అన్యాయాన్ని సహించకనే "ఓరుపులేనట్టిడు లెప్పుడున్ గలరు ధూర్తుల్ సర్వవర్ణంబులన్" అని, నవ్యకవ్యగ్రణి జాషువా జాడించినాడు.

తిన్నయింటి వాసాలు లెక్కించే తీట గుణాలుగూడా ఉంటాయి కొన్ని. "జోడు మాంచి సొగసుగా కుట్టించుకున్నావోయ్" అన్నాడు నిన్న మా యింటికి వచ్చిన పాత చుట్ట మొకాయన.

"ముండలూ, ముచ్చెలూ, ముద్దుగా కనిపిస్తే మంది కళ్ళు మండుతయి బావా! అని యుక్తిగా ఉక్తికి ప్రత్యుక్తి చెప్పి తప్పుకున్నాను.

మళ్ళీ ప్రొద్దున మా హెడ్మాష్టారు "కోరి కోరి కొన్నట్టుంది రెడ్డిగారు ఈ కోడెల జతను" అన్నాడు నా వెనుకాలాబడి గడపదాటుకుంటూ.

ప్రార్థనా సమయం కావున పరధ్యాన్నంలో నుండి అప్పుడే తేరుకొంటూన్న నేను ఆ వాక్యంలోని ఆంతర్యం గ్రహించక ఏమి! అని ఆయనకు అడ్డుతిరిగి నిలిచాను.

అదో దృగ్వ్యంభిత ముసుచున్న ఆతని ముఖమండలం అదోరకమైన హాసన ప్రదర్శనం గావించి నాతట్టు చూసింది.

"కోడెలూ, కొనటం, ఎవరూ?" అని అడుగుతున్నాడు మా సహోపాధ్యాయుడు మఱొకడు.

విధిగా ఉభయులకూ ఉత్తరం చెపాల్సి వచ్చింది.

"ఆఁ నేనే యేదో చెవ్వూ, కొమ్మూ, వాటంగా చూస్తాను బ్యారం చేస్తాను వలపులా దాపులా తారాతమ్యం తక్కువగా పొటిస్తాను లెండి" అన్నాను ధ్వని ప్రధానమైన ఆతని వాక్యాన్ని వివరిస్తూ.

"అంటూ ఎన్నిరోజులనుండి సాగిస్తున్నారు; ఈ విడిజోడు వ్యాపారం" ఇది మా మాష్టారు దుబారా సవాల్.

"జోడు విడిపోయినప్పుడల్లా ఇట్లే చేస్తుంటాను" అని జవాబిచ్చాను. ఆ శబ్దాల జతనే వలపలిదాన్ని దాపటికి త్రిప్పి.

అందరం నవ్వుకుంటూ ఆయా క్లాసుల్లోకి వెళ్ళి హాజరీ పుకార్ చేసి నిత్య కార్యక్రమంలో పడ్డాము. ★



"శ్రీరస్తు శుభమస్తు కళ్యాణమస్తు; సర్వ సద్గుణ సహిత సౌభాగ్యమస్తు" అంటూ, ఉప్పొంగే ఆప్రేమని ఆశీర్వచన రూపేణా ఉచ్చారణచేశారు సుబ్రహ్మణ్యంగారు, పద్మావతి నమస్కారం స్వీకరిస్తూ.

"రాజంటి మొగుణ్ణి పెళ్ళాడి పండంటి పిల్లల్ని కని వర్ధిల్లు తల్లీ!" అన్నది కామేశ్వరమ్మగారు.

"పార్వతీ పరమేశ్వరులవంటి వృద్ధదంపతులు-మీ నోటి మాట చలవని ఏదో.." అంటూ ఊహూఁ మురిసిపోయింది సూర్యకాంతమ్మగారు; ఆవిడ తమ్ముడు రాజు వేపు చూస్తూ.

తాళ్ళప్రమాణాన లేచారు సుబ్రహ్మణ్యంగారు - "చూశావే పిల్లా! నీతోపాటు నన్నూ ముసిలాణ్ణిచేసి పారేసింది ఒదినగారు!...కిమ్మనవేం?...చెప్పు!" అంటూ భార్య కామేశ్వరమ్మగార్ని మోచేత్తో పొడిచారు.

కామేశ్వరమ్మగారు విసుక్కుంది "బావుంది. సరసం.—మరీ రోజురోజుకీ వెర్రి చేష్టలు ఎక్కువయిపోతున్నాయి. ఇదెక్కడి అల్లరమ్మా!. చిన్నా పెద్దా, సమయం సందర్భం లేకండా! ఏదో శాస్త్రం చెప్పినట్టుంది......పెళ్ళికి పిల్ల ముందర ఏమిటా మాటలు? మరీ ఇది కాపోతే..."

చిలిపిగా నెలిగాయి సుబ్రహ్మణ్యంగారి కళ్లు. "చూశారూ వదినా.. .. మా కాముడుందే - స్వతహాగా చాలా మంచిదే సుమండీ - ఏదో అప్పుడప్పుడు కొంచెం తిక్క—అస్తమానూ నన్ను ఇలా రాసి రంపాన పెడుతుందనుకునేరు!" అన్నారు సూర్యకాంతమ్మగారితో. ముసిముసి నవ్వులతో అటు తిరిగి తన భర్తవేపు చూసింది, సూర్యకాంతమ్మగారు. ఈ గొడవలతో సంబంధం లేనివాడల్లే ఆయన సావకాశంగా చుట్ట కాల్చుకుంటూ, గబగబా పేపరు చదువుకుంటున్నాడు.

మళ్ళా ఇటు తిరిగింది.

"ఏదో బాబూ! మీనోటి చలవన మా పద్మకి మా రాజిగాడు మూడు ముళ్ళూ పడేస్తే.. ఏమనుకున్నారో గానీ వాడికి పద్మంటే పంచప్రాణాలూను. ఇది చూస్తే సవాలక్ష గ్రంథం చదువుతుంది వాడిమీద" అంది - దూరంగా బంగారు తండ్రిల్లే బాచాల కొంపెల్లె కూర్చున్న రాజును చూస్తూ.

ముళ్ళపూడి వెంకట రమణ

సుబ్రహ్మణ్యంగారి సతీమణి కామేశ్వరమ్మగార్ని అందుకుంది "ఆఁ! మీకు పిచ్చి గాని, దాని కిష్టమే ఉంటుంది - బావని కాదని ఇంకెవడ్నీ చేసుకుంటానంటుందే—కాపోతే సిగ్గు - పిచ్చితల్లికి"

"ఆఁ! చాలెద్దూ! కబుర్లకెక్కడికిలే - ఈకాలం పిల్లలు మీకన్నా నాలుగాకులు ఎక్కువ చదివారు. 'ఫలానా మొగుడే' కావాలని ఢంకామీద దెబ్బకొట్టి చెప్ప గలరు తెలుసా! సిగ్గూ బొగ్గూ కుదరదు నిన్ను నాకిచ్చి కట్టేసినట్టనుకున్నావా ఏం?" అంటూ పద్మవంక చూశారు సుబ్రహ్మణ్యంగారు.

సరిగ్గా అదే సమయానికి పేపరు చదువుతున్న పెద్దమనిషి - పద్మ తండ్రి - మందహాసం చేశారు. తిరిగి చుట్ట నోట్లో పెట్టుకుని పేపరు తినడం మొదలెట్టారు

'పద్మ పేట్రేగిపోయింది' అనే వాళ్లు;- ఆక్షణాన పద్మ అన్నమాట ఎవరేనా పరాయివాళ్ళు వినివుంటే. నిజమే! పద్మ అన్నదిది—

"రాజుగాణ్ణీ, గీజుగాణ్ణీ నేను చచ్చినా పెళ్ళాడను. నేను అప్పారావుని పెళ్ళాడుతా. నాన్నగారు కూడా సరే అన్నారు" అని.

"అవ్వ హవ్వ!" అన్నది సూర్యకాంతమ్మగారు

తుళ్ళిపడ్డాడు పద్మతండ్రి.

కామేశ్వరమ్మగారు విస్తుపోయింది.

సుబ్రహ్మణ్యంగారు హాహాకారాలతో నవ్వటం ప్రారంభించారు.

ఆయన అంత హృదయపూర్వకంగా నవ్వి చాలా కాలం అయింది. ఆనవ్వుకి పచ్చగా దోసకాయవలె, పండిమీసాలతో నిండుగా వున్న ఆయనముఖం ఎఱ్ఱగా అయిపోయింది. ఫాలభాగాన, కణతలమీదా రక్తనాళాలు ప్రస్ఫుటంగా కనబడ్డాయి. కంటనీరు తిరిగింది

కామేశ్వరమ్మగారు కంగారు పడిపోయింది. బెంబేలెత్తిపోయింది. "ఏం ఒమాయిత్వరుమనిషమ్మా! - ఏ మొచ్చినా చిక్కే-" అంటూ సుబ్రహ్మణ్యంగారికి గాలి విసరటం ప్రారంభించింది.

నవ్వునించి సుబ్రహ్మణ్యంగారు త్వరగానే తేరుకున్నారు. అందరి మనస్సులూ తేలికపడ్డాయి.

"కంగారు పడ్డావుటే కాముడూ!" అన్నారు సుబ్రహ్మణ్యంగారు "మాపెంకి వదినా - మా కోమలికి నేనంటే ఎంతో



ప్రాణమో! సీతాసావిత్రీ - సువర్చలా - సుబ్బారావుగారిఎంకీ - మా కాముడుముందు తీసికట్టే - ”

ఈ కొత్తధోరణి ఎన్నడూ కనీవిని ఎరుగని సూర్యకాంతమ్మగారు కొద్ది కంగారు పడింది.

పండు తమలపాకువంటి కామేశ్వరమ్మగారి శరీరం ఆపాదమస్తకం జలదరించింది. సంధ్యాసమయాన, ఎర్రని కాంతులతో వెలిగే ఆకాశఫలకాన సూర్యబింబంవలె, సిగ్గుతో కందిపోయి ఎర్రబారిన ఆమె విశాలమైన నుదురుపైన వెండిరూపాయంతటి కుంకుమ తిలకం ప్రకాశించింది పండిబారిన ఆమె శిరోజాలు ఆ అరుణరాగం ముందు పాలిపోయాయి పాతికసంవత్సరాల్రకితం తొలిసారి సిగ్గుతో వాలిన ఆమె సుందర, సువిశాల నేత్రాలు, ఆనాడు ఆమెలో తను చూచిన కవితల అందం, తిరిగి, ఈక్షణాన, ఒకే ఒక ముహూర్తకాలంపాటు సుబ్రహ్మణ్యంగారికి గోచరించాయి.

క్షణకాలం ముగ్ధుడైపోయాడాయన - తన భార్య సౌందర్యంచూసి

“చాలెండి - ఎవరన్నా నవ్విపోయేరు” అన్నది కామేశ్వరమ్మగారు - చెంపకి చారెడున్న కళ్లని సొగసుగా వాల్చుకుంటూ.

పకపకనవ్వారు సుబ్రహ్మణ్యంగారు - నోరు తెరచుకుని ఆశ్చర్యంగా తనవంక చూస్తున్న పద్మవంక చూసి.

“ఏంపద్మతల్లీ - రేపు నీ మొగుణ్ణి ఇలాగే గసిరిపారేస్తావే నువ్వునూ?”

పెంకెఘటం పద్మ.

“లేదు తాతా ... మంచివాడు మొగుడు దొరకుతే గసరనులే...రాజిబావలాటివాడు దాపరించాడా - గసరడంకాదుగదా, తంతానుకూడా” అంది.

“సిసలయిన ఆడదానివేనవ్వూ.. నీమాట నెగ్గించుకోవాలిగాని...” అన్నారు సుబ్రహ్మణ్యంగారు.

పద్మతల్లి కొంచెం చిరాకు పడింది ఈ ధోరణిచూసి. ఇక లాభంలేదు. “ఏమేపిల్లా! ఓ నీళ్ళుపోసుకేడుద్దాం - ఓ జడ ఏడుద్దాం ...లేపోతే కాఫీచెంబులు తోల్చి లోపల పడేద్దాం అని లేదుగదా ... ఊహు పెద్దావేరక్కలాగ తయారూ! తగుదునమ్మా అంటూ - చిన్నా పెద్దాలేకుండా - ఊఁ! కదలవేం?”

పద్మ కదిలే సూచనలేం కనబడలేదు. వాళ్ళనాన్న కేవలం ధూమానందస్వామివలె చుట్ట కాలుస్తూ తనలో తనే నవ్వుకుంటున్నాడు.

సుబ్రహ్మణ్యంగారు చిన్నచిన్న కలహాలు పుట్టించడంలో అందేవేసిన చెయ్యి. సమయంచూసి చిట్కా వేశారు చమత్కారంగా. “ఏవమ్మోయ్ వదినా! కుర్రకుంక - దాన్నంటావేం! అదుగో వెనుకనుంచి భాగవతం ఆడించేది మీ ఆయన. అతగాణ్ణి అడుగు నిలేసి...ఏమయ్యా ధూమానంద స్వామీ!...ఏంకథ?...”

“అలా గట్టిగా అడగండి బాబూ... అలా అడగండి.. ”

ధూమానందస్వామి చిరునవ్వు ప్రచురించాడు.

ఛర్రునలేచి వంటింట్లోకి పోయింది సూర్యకాంతమ్మగారు బాష్పవేదం పఠిస్తూ.

పద్మ కిలకిల నవ్వింది.

సుబ్రహ్మణ్యంగారికి గుర్తొచ్చింది.

“ఔనే కాముడూ.. మన సుబ్బులు పోలికలేదే పద్మకి?...లేకపోవడ మేమిటి! ...అంతా అదేనాయె! కనుముక్కుతీరూ కట్టూ బొట్టూ మాట తీరూ—ఎటొచ్చీ పేరు తేడా అంతే.. !”

కథకి ఉపక్రమించే సూచనలు కనపడ్డాయి సుబ్రహ్మణ్యంగారిలో, కామేశ్వరమ్మగారికి.

“పనీపాటూ లేదా ఏమిటి మీకు - రైలు దిగి కథ మొదలెట్టారపుడే కబుర్లు కట్టిపెట్టి స్నానానికి లేవండి. కొంటెగా భార్యవేపు చూసి కన్నుమీటి ఏం ఎరగనట్టే రామదాసువేపు తిరిగారు. “ఏమోయ్! ఓ! రామదాసు పంతులూ! ఓ! ధూమానంద స్వాములూ! ఇంకోచుట్ట పట్టుకునిక్కడకు రావయ్యా - కథ చెప్తానూ. మా సుబ్బలక్ష్మి అచ్చ నీకూతురులాగే వుంటుంది. చిత్రంగా అయిందిలే దాని పెళ్ళి ”

రామదాసుగారు దగ్గరకు జరిగారు ఉషారుగా. పద్మ బాసింపెట్టి వేసుక్కూర్చింది శ్రద్ధగా.

“నేను లోపలకెడతా - మీరు కథలు చెబుతారో కచేరీలు చేస్తారో కానీయండి బాబూ” అని సాగదీసుకుంటూ లోపలకి

★ ప్రయోజకుడు ★

సాగిపోయింది కామేశ్వరమ్మగారు.

మంచినీళ్ళబిందె భుజాన పెట్టుకుని లోపలికొస్తున్న రామదాసుగారి తల్లి, కథ అన్నమాట వినబడగానే నిలబడిపోయింది.

"ఎప్పుడు రాక బాబూ! అంతా కులాసేనా? ఉత్తరం రాశారుగాదు...అవును గానీ పట్టపగలు కథ చెప్పాకుంటే పట్టపు రాజు దచ్చిపోతాడు. ఒక్కక్షణం ఉండు బాబూ" అంటూనే బిందె దింపి పట్టపు రాజుని భద్రంగా కొంగులో ముడేసుకుని బిందె పట్టుకు చక్కాపోయిం దావిడ, 'ఓ సూరీడూ ఏంచేస్తున్నావే' అంటూ.

ముసిముసి నవ్వుల్తో చుట్ట అంటించి పడక్కుర్చీలో సాగిలబడ్డారు సుబ్రహ్మణ్యం గారు. ఇటు రామదాసుగారూ అటు పద్మా కూర్చున్నారు శ్రోతలుగా.

"అవ లతగాడు రావడమే ఒక పెద్దగాలి వావతంతుగా వచ్చాడు వూళ్ళోకి" అంటూ కథ మొదలెట్టారు అర్థ నిమీలిత నేత్రులై పొగను చూస్తూ.

"వా డెవడూ? ఎక్కడకొచ్చాడూ? ఎందుకొచ్చాడు? సరిగ్గా చెప్పవయ్యా" అన్నారు రామదాసుగారు.

"అదే ఏముందీ. నీ కూతురి పెళ్ళిసంగతి కదయ్యా మనం ఇప్పుడు గొడవ పడుతున్నదీ! నీ పెళ్లాం - రాజు కిస్తానంటుంది. నీ కూతురు టెయిలరు అప్పారావంటుంది. నువ్వు మానేన కలహాం శాస్త్రి అంటావు - ప్రయోజకుడని నువ్వనుకున్నవాడు దొరికే వరకూ. ఇంతకీ అంత ప్రయోజకుడైనవాడొస్తే నువ్విచ్చే దేమిటయ్యా? వాడే ఎగరేసుకుపోతాడు. నీ కూతురు వెంటపడుతుంది. అంచేత నేనచె దేమిటంటే ఆ రాజూ కాడు ఈ అప్పారావూ కాడు. బ్రహ్మ నిర్దేశించిన ఇంకో శోభనాద్రి ఊడిపడతాడు; డేగలా ఎగరేసుకుపోతాడు నీ కూతుర్ని."

"ఆ శోభనాద్రి బావుంటాడా?" అంది పద్మ.

"దేవుడు కలగచేసుకుంటే నీ ఆట లేమీ సాగవురే" అన్నారు సుబ్రహ్మణ్యంగారు.

"ఆ వచ్చినవాడు బాగుండకపోతే తన్ని తగిలేస్తా వాణ్ణి" అంది పద్మ.

"అదుగో అదుగో! సరిగ్గా సుబ్బలక్ష్మి అంతే. సుబ్బలక్ష్మి తెలీదయ్యా, జగన్నాథం కూతురూ? ఇలాగే వాగేది కుండ పగల గొట్టినట్టు. చిలకలాటి మొగుడు దొరికాడు దానికి బతక నేర్చినవాడులే! బహు శాక్యవు.....అదే. ఆకుర్రాడున్నాడే, వాడురావడం రావడం గాలివాన గంతుగా వచ్చాడూళ్ళోకి. నేను పొలంపన్లమీద అప్పటికి వారంరోజుల క్రితమే ఆ వూరెళ్ళాను. రెండునెల్లు బిచాణా వేశానులే.

మరి కథ విను చెప్తా...

(సుబ్రహ్మణ్యేన ఉవాచః ఇతికథా ప్రారంభః)

"ఆ ఊళ్ళో-ప్రతి తెలుగు ఊళ్ళోలాగే— మేడమీద తలఉన్న ప్రతి ఆసామీకీ, వాడికి ఉండుకునే ఆ యొక్క భార్యకీ, కొడుక్కీ కూతురికీ, ప్రతి రెండోమనిషి జీవితచరిత్రా కంఠతా పట్టేవల్లె వేస్తూంటే నే గానీ తోచదు. అందరూ కవులే! పోతన్న గారిని తల దన్నిన ఆసాములే కవిత్వంలో. తెలిసిన కబురికి నగిషీలు చెక్కి రంగులు వేసి మరీ ఇస్తారు పక్కవాడికి. నేను రెండునెలలు పూర్తిగా బిచాణా వేశానక్కడ...అదే-నేను దిగిన వారంరోజుల్లో కామోనూ—రంగధాము డొకడు ఊళ్లో దిగాడని వదంతులు లేచాయి.

"అతిథి మర్యాదలు చేసే నిమిత్తం బయలుదేరాం ఒకతండా. బెహరా హొటేలుపక్కన ఇంట్లో దిగాడన్నారు వార్తాహరులు. పోయి చూదుంకదా, కృష్ణమూర్తిగారి కొడుకు సుందరావు పదేళ్ళ కిందటే కృష్ణమూర్తిపోయాడు. అతగాడు ఆస్తికన్న అప్పులు మిగిల్చి వెళ్ళాడు. అప్పటికి పన్నెండేళ్ళుంటాయి సుందరావుకి పట్నం పోయాడు మేనమామతో...

"నే నమంచిదైతే ఊరుమంచిదన్నారు-వాళ్ళ ఏ వీళ్ళనీ మంచిచేసుకుని చదువూ సంధ్యా నేర్చుకుని నాలుగురాళ్లు తేవడం మొదలెట్టాడు పద్దెనిమిదో ఏటికే."

"ప్రయోజకు డైనాడందూ... స్వయం శక్తితో" అన్నారు రామదాసు పంతులు గారు శ్రద్ధగా.

"నాలుగు రాళ్ళంటే ఎన్ని రూపాయిలు తాతా...మరి ఇంటికి చాలేవీ?" అంది పద్మ కళ్లు పెద్దవి చేసి.

సుబ్రహ్మణ్యంగారు సాగిపోయారు.

"ఇల్లేముందీ ఒంటిపక్షి అయిపోయాడుగా...ఇదుగో ఎంత ప్రయోజకుడైనాడయ్యాఅంటే, రెండేళ్ళ కిందట తిరిగి స్వగ్రామంవచ్చి అప్పులూ తీర్చగలిగేశాడు పోయిన భూములు తిరిగి కొన్నాడయ్యా... ఆఁ! ప్రయోజకత్వం అంటే అదీ!...సరే ...మేమంతా వెళ్ళాంగా—పలకరించాం

—మళ్ళా ఆ భూముల్ని కౌలుకిచ్చి ఓనెల ఇక్కడ కాలక్షేపంచేసి పోదామని ఒచ్చాట్టా—పట్నం విసుగేసి "ఆవకాయ, మాగాయ, మామిడిపండు తినాలని మనసు పోయిందండీ పోతే—నా అన్నవాళ్ళు మీవంటివారిమధ్య నాలుగురోజులు గడిపి పోవాలనుంది అంటూ అన్నాడు. కుర్రాడు చూస్తే దీపంలా వున్నాడు. ఆ యొక్క వినయం, ఆ వందనం, ఆ మాట ఒద్దిక—ఓహో! ఎన్నికైన కుర్రాడయ్యా"

"ఏం చదివాడేం" అన్నారు రామదాసు గారు.

"ఎలా వుంటాడేం "అంది పద్మ.

"చామనచాయ. కొంత పొడుగనే చెప్పాలి. బక్కపలచగా వుంటాడు. అందాలరాసి అననుగానీ మొగతనంలో వుండే ఆకర్షణవుంది ఆ కుర్రాడిలో... కళ్లన్నాయే కళ్లు కళ్ళజోడు వెనకనుంచి చూసే ఆ కళ్ళలో ఆర్ద్రత గోచరిస్తుంది కొద్దిగా. విశాలమైన నుదురు నూగుమీసం సరే పట్టవాసపు క్రాఫు జుత్తు, కళ్ళజోడూ రిస్టువాచీ కమామీషూ ఉన్నాయనుకో ......ఆడదాని కేడువారాల నగలన్నారు ...ఇతగాడు ఏడువారాలకి ఏడురెళ్ళు పధ్నాలుగు జతలచొప్పున మారుస్తాడు ఓ! పరిమళాలు గుబాళించిపోతాయి జోళ్ళే ఓ చిన్నదుకాణం ఏర్పాటులో ఉన్నాయి భట్టాజనుకు నేవు సుమా నన్ను !...రామదాసూ—ఒక్కటి చెపుతా విను...నీవంటి సంసారి ఆ సమయంలో అతిగాడిని చూశాడా—దుబారా దివాణంలా వుందా వ్యవహారం...అనేవాడు"

"పోన్లే ఇప్పుడు వింటున్నానుగా. ఇప్పుడంటా—శుద్ధదుబారా వ్యవహారమే..." అన్నారు రామదాసుగారు చుట్ట ఆర్పేస్తూ.

"నువ్వుఅనే డేమిటోయ్! అనాల్సినవాళ్ళంతా అదివరకే అనేశారు. ఆ కుర్రాణ్ణి స్నానానికి వదిలేసి మేం బయటికొచ్చేసరికి గొల్లుమన్నారు—నాతోండా వాళ్ళు ఏకగ్రీవంగా.

"జోరుగా వుండే వ్యవహారం కుర్రాడిది" అన్నాడు అవధాన్లు కళ్లుమిటకరిస్తూ.

"జోరా జోరున్నరా! కాపోయినా అదేమిటోయ్ మరీ ఇదిగా పోతే—ఆ ట్రంకు చూశావూ—ఓ పాతిక జతలుండవూ గుడ్డలూ?" అన్నాడు జోగినాధం.

"జోళ్లోయ్! జోళ్ళు! జోళ్ల మాట మర్చిపోయారు! రామరామ! అదోకబూటూ —అదోక కాబూలీజోడా—అదోక స్లిప్పానా—అదోక స్లిప్పరా..' అంటూ దండకం ప్రారంభించాడు—జోళ్ళ వివరాలు తెలిసి కొన్న కోదండరావు.


"అవన్నీ సరేకానీ—నాకు చిత్రం దెక్కడయ్యా అంటే—వంటవాణ్ణి తెచ్చాడయ్యా, వంటవాణ్ణి ! ఇదేమేనా సంసారి లక్షణమేనా అని?— వాళ్ళనాన్న బతికున్నప్పుడు ఎంతపొదుపూ! ఎంతపొదుపూ! ...గుట్టుగా వెళ్లబుచ్చాడు కాలం. అన్నారు జగన్నాధంగారు"

"రామదాసూ! ఇదీ ధోరణి! నాకు జాలేసింది సుమా రాకరాక కుర్రవాడు సొంత ఇంటికొస్తే—పరోక్షాన్నే అనుకోక—ఇలా దుయ్యబట్టటం నచ్చలేదు నాకు.

"ఏమయ్యా వాడికి వంటరాబోతే నువ్వు వండి పెడతావా?" అన్నాను నేను.

"మహారాజులా ! సోలెడు బియ్యం పడేసే సాధుడేలేడా ఇక్కడ!" అన్నాడు. జోగినాధం.

"అవధాని తగులుకున్నాడు. చాల్లేవయ్యా—దక్షతకి నిన్నే చెప్పుకోవాలి ముందర. కబుర్లకేం తియ్యగా చెప్పా



★ ప్రయోజకుడు ★

ర్యాక్...! అంటూ.

"జోగినాథం మండిపడ్డాడు. పోవయ్యా! మనోవ్యాధు సవ్యంగా మాట్లాడేవూ "...పోస్లే— నేను మా లేనా అన్నాను......నువ్వేదీ లేదుగా. ఇంతకీ ఎవ రెడ్చినా కుఱ్ఱవాడు. డబ్బు దుబారా చేసుకుంటే చిప్ప చేతికొస్తుందనీ, వీడు మహ కిఫమూర్తి కుఱ్ఱాడనేనా ఇది.'

'అందరి ఇదీ అంతేనయ్యా! ముందు ముందు పెళ్ళి గ్రటా చేసుకుంటే, కొంపా గోడూ కట్టుకేడిస్తే ఈ ఎత్తున తూగగలడా అని' అన్నాడు జగన్నాథంగారు.

'ఏమయ్యోయ్! జగన్నాథం! పిల్లని గానీ ఇవ్వాలనుకుంటున్నా వేమిటి ఈ కుఱ్ఱాడికి?—ఎఱ్ఱగా బుఱ్ఱగాఉన్నాడని మురిసిపోర్లాకు శేవు!' అన్నాడు జోగినాథం.

'అబ్బో! జగన్నాథం కూతురు - సుబ్బులయ్యా అది! అది మొగుణ్ణి అమ్మేస్తుంది తెలుసా!' అన్నాడవధాన్లు."

కామేశ్వరమ్మగారు లోపల్నించి ధనియాల కాఫీ తెచ్చింది. సుబ్రహ్మణ్యంగారు కథ ఆపారు.

"సుబ్బులు పెళ్ళి సంగతా?" అందావిడ.

"చిత్తం...ఏం కలవండి..." అన్నారు సుబ్రహ్మణ్యంగారు.

"బావుంది! నోరత్తడం భయంగా ఉంది బాబూ ఈ మనిషిదగ్గర. ఆ కాఫీ తాగి గ్లాసిలా పారేయండి. తొరగా తెములే నీళ్లు తోలుపుతాను." అన్నదావిడ.

గ్లాసిచ్చి కథసాగించారు సుబ్రహ్మణ్యంగారు:

"వింటున్నావే పద్మా!......ఆ సుబ్బులుందే...అది నీలాటిదే. శుద్ధమొండిఘటం. లాకాయి లూకాయి మనిషి దానికి పనికిరాడు...ఉభయ గోదావరి జిల్లాలలోని మన్మథులందరిలో ఒక్కడు కూడా నచ్చలేదు తెలుసా దానికి? ప్రతివాడికీ ఒంకపెట్టేది...అంత ఆడది అది...సరేనయ్యా రామదాసూ!...ఏమిటి చెప్తున్నానూ... ఆ...అదే. మా గుంపు నలుగురూ ఆ సుందర్రావుని పట్టుకు ఏకి పారేశారు. సరే, మెల్లిగా అందరం బెహారా హోటలుకి చేరాం......బెహారా హోటలు ఇడ్లీనకి ప్రసిద్ధి. పెసరట్లకి పెట్టింది పేరు...కాఫీ నాటురకం అనుకో...వరండాలోకి చేరాం అయిదుగురం......ఒక్కడికీ పనీ పాటూ లేదాయె. తిని తిరగటం మినహా. ఉద్యోగం పురుషలక్షణం అన్నారు గాబటి చదరంగం ఆడతారు వాళ్లు. నాకు రాదనుకో. చూడ్డం బాగా వచ్చు...సరే ఇద్దరు చదరంగానికి కూర్చున్నారు. మిగతా ఇద్దరూ సుందర్రావు ఆస్తి, ఆదాయవ్యయాల అంచనాలు వెయ్యటం ప్రారంభించారు. నేను ఇడ్లీనుల ఆరగింపు మొదలెట్టాను. ఐదో ఇడ్లీను మొదలెట్టబోతున్నాను. అయ్యరు ఊళ్ళో గోల వీకరువు పెడుతున్నాడు.

"తెల్లని సిలుకు చొక్కా వేసుకుని, గ్లాస్కో పంచ గూడకట్టు కట్టుకుని, చక్కగా తల దువ్వుకుని, సిగరెట్టుపెట్టి, అగ్గిపెట్టీ పట్టుకుని వచ్చాడు సుందర్రావు. స్నానం గీనం చేశాడేమో - నవనవలాడిపోతున్నాడు జేగురుపాడు వంకాయలాగ. హోటలుకి పాలేరు కుఱ్ఱాడు దారిచూపించాడు కాబోలు; వాడికి వో అణాకాసు ఇచ్చాడయ్యా. అంతే, ఇటు తిరిగి చిరునవ్వుతో పాకలోకి రాబోయినవాడల్లా— కొయ్యబారిపోయాడు. కారణం ఏమిటని అడగవేం?...వినూ...బురద రోడ్డుమీద పరుగెత్తే పాత లారీకి సడన్ బ్రేకు వేసినప్పుడు సంభవించే శబ్దంతో పరితూగగలిగినంత గట్టిగా కేరుతూ ఆశ్చర్యం ప్రకటించారు—అవధానులూ జోగినాథమూ జమిలిగా. ఆయొక్క శబ్దం విని జగన్నాథం, ఆయొక్క దృశ్యం చూసి సుందర్రావూ - అతన్ని చూసి నేనూ వరుసక్రమంలో ఆశ్చర్యపోయాం. అర నిముషం తరవాత జోగినాథం బొయ్యిమన్నాడు! "ఆ పాలేరు వెధవకి నువ్వు అణా ఎందు కిచ్చినట్టయ్యా పంతులూ..." అన్నాడు కనిస్టేపు గొంతుకతో. సుందరం గ్రహించాడు కథ. నవ్వాడు.

"'ఆఁ, పనిమల్లే నా కూడా వచ్చి దారి చూపించాడని ఏం తప్పా?" అన్నాడు అమాయకంగా. పాక అదిరేటట్టు నవ్వారు అందరూ. జోగినాథం జోరు హెచ్చింది.

'పాలేరాళ్ళందరికీ ఇలా అణాలు పారేస్తూ - 'తప్పా' అని అడుగుతావూ? - తప్పూ ఒప్పూ ఎవడిగ్గావాలయ్యా! రేపు చేతికొచ్చేది -"

"ఛప్ నోరుముయ్యి" అంటూ జగన్నాథంగారు చేతిలోఉన్న శగటుని జోగినాథం నోట్లో పెట్టేశారు ... సుందరం మనస్సు చివుక్కుమంది అనుకున్నాను,. చిన్నబోయిన అతని మొహంచూసి.

"రావోయ్! రా! ఇదంతా మామూలే... పరవాలేదురా" అన్నాను నేను మహా పాతకాపయినట్టు. జోళ్లు గుమ్మంలోవదిలి లోపలికివచ్చి కూర్చున్నాడు సుందరం. మావాళ్ళకి రెండుకళ్లు చాలటంలేదు - అతన్ని చూడ్డానికి. అంచేత వాళ్ళదిపీటూ, పీక్లది వాటూ ఎరువుచ్చుకుని మరీ చూసేస్తున్నారు చొంగలు కారుస్తూ.

"అయ్యరు ఇడ్లీ తెచ్చిపెట్టాడు సుందరం ముందు. 'వారికికూడా తెండి' అన్నాడు సుందరం; ఇడ్లీలు ముట్టుకోకుండా... మా చతుష్టయంలో చలనం కలిగింది. చిరునవ్వులుకూడా ఒలికాయి.

"'అక్కేఁ ఎందుకు సుందరంబాబూ! డబ్బు దండుగా' అన్నాడు జోగినాథం"

'వృథా వ్యయం కాదుటోయ్!'

‘మేం పుచ్చుకున్నాం.’

‘అదీకాక మేం ఎలాగాభోంచేస్తాంగా’ “మేము భోంచేస్తామండి - ఎలాగా” అన్నాడు సుందరం మహావినయంగా. ఆ తరువాత అందరూ కలిసి బ్రహ్మాండంగా నవ్వేరు.. నవ్వు పూర్తిఅయేసరికి అయ్యారు ఇడ్లీలు వడ్డించడం, అందరూ ప్రోక్షించి మొదటిముక్క నమలడం జరిగిపోయింది.

“‘పెసరట్టు కాల్చనాబాబూ!’ అన్నాడు అయ్యరు చేరంతగిలిన ఉషారుతో.

‘నాకు ఉల్లిపాయవద్దు. కాని, అల్లం, పచ్చిమిరపా బాగా దట్టించండి’ అన్నాడు అవధాని తక్షణం.

‘నాకు మిరప వద్దయ్యోయ్! కారం పడదు. ఉల్లిపాయ బాగా తగిలించు’

“చూడయ్యరూ! నాకు పెసరట్టొద్దు గానీ, మళ్లా ఇడ్డీయేపట్రా దానిబదులు”...

“అయ్యా! రామదాసు పంతులుగారూ! .. ఇత్యాదయః” అంటూ పకపక నవ్వడం ప్రారంభించారు; సుబ్రహ్మణ్యంగారు.

పద్మమాత్రం రపీమని నిర్మొహమాటంగా ప్రశ్న వేసింది “మరి మీరు నవ్వేస్తున్నారు గాదా - ఆ సుందరం అనేవాడు రావడానికి ముందు మీ ఇడ్లీలు తినేస్తూ వాళ్లకిప్పించ లేకం?” అంది.

రామదాసుగారు కళ్ళెర్రచేసి చూశారు పద్మవైపు సుబ్రహ్మణ్యం గారు నవ్వుతూ జవాబిచ్చారు. “బాగా అడిగావమ్మా. చెబుతా విను. నే నావూరొచ్చిన రోజునే అయ్యారుదగ్గర ఖాతా పెట్టడం - వీళ్ళని మేపడం జరిగింది. ఆ తరువాత మాటల్లో చెప్పేశాను.; ‘మొహమాటంకి మన్నాస్తిః సుబ్రహ్మణ్యేన సన్నిధా’ అంవటా అని. ‘ఏమయ్యోయ్! నేను వూరికే బతిమాలలేనూ, మీకు కావల్సిందల్లా నిస్సందేహంగా పుచ్చుకోండి’ అన్నాను. నాల్రోజులు కామోసు మామూలుగానే పుచ్చుకున్నారు.

“‘ఏమిటో! మీచేత ఇలా బోలెడు వ్యయం పెట్టించడం మాకేం బావులేదు’ అన్నారొకరోజుని బ్రేవున తేనుస్తూ.

‘దానికేముందయ్యా! నాకు లేనిరోజున మీరు పెడుదురుగాని. అంటే ఇపుడు మీకు లేదనికాదు...పోనీ మీకంత ‘మకీ’ యిదిగా వుంటే రేప్పొద్దుటినించీ మీరు నాకు పెట్టండి! మనలో మనకేమిటయ్యా! అన్నదమ్ములంటివాళ్ళం—’ అన్నాను మర్నాడు వాళ్ళు రాలేదు. తరవాత వచ్చినా పుచ్చుకోడం మానేశారు. రేప్పొద్దున్న నిజంగానే నాకు పెట్టాల్సొస్తుందేమో నని వాళ్ళ భయం. అంతే - నేను మళ్ళా బతిమాల్లేదు సుమా...’”

“అయ్యా సుబ్రహ్మణ్యంగారూ. మీరు మరోలా అనుకోవద్దు. పుర దేదో అంది.” అని సద్దియ్యబోయారు రామదాసుగారు.

“బావుందయ్యోయ్! అంటే మాత్రం తప్పేముంది! మనిద్దరికంటే అదే నయం. ఉన్నమాటంది. కానీలే. కథవిను.—సరే కాఫీలయ్యాక చదరంగం మీద పరదా పడ్డాడు సుందరం. ఆటమీద కబుర్లలో మా వాళ్ళ విషయం కనుక్కున్నారు. సుందరం

★ ప్రయోజకుడు ★

చెయ్యేదాకా చదువుకున్నాట్ట. ఏదో చిన్న వర్తకం పెట్టి బాగుపడ్డాడు. కష్టపడి పైకొచ్చాడు కాబట్టే యిప్పుడు - వీలైనంత సుఖపడ్డానికి ప్రయత్నిస్తున్నాడేమోనని పించింది నాకు. 'నా' అన్నవాళ్ళు లేరు. ఏదో వున్న వూరుచూసి, సాంతకొంపలో నాలుగురోజు లుండిపోదా మనొచ్చాడట. ఆఁ!... ఇదీ కథ. ఈ కథ చెప్పేలోగా అతని సిగరెట్టుడబ్బాలో ఇరవై సిగరెట్లు





ఉఫ్‌మన్నాయి. 'ముత్తంమీద ఏలాగేనా గోల్డుఫ్లేకు బహు పరిమళమయింది సుమండీ' అన్నాడు అవధాన్లు డబ్బాలోంచి మరొకటి తీసి నోట్లోనూ మరో రెండు జేబులోనూ పెట్టుకుంటూ.' సాయంత్రానికి చెరువు గట్టునా, రచ్చబండదగ్గిరా, కరణంగారి అరుగుమీదా, ఈ రంగధాముడి విషయమై అత్యున్నత స్థాయిలో వాగ్వివాదాలు జరిగాయి. జోగినాథం, జగన్నాథం, అవధాన్లు, కోదండంతో కూడుకున్న చతుష్టయం కూడా ఈ చర్చల్లో పాల్గొంది. తీవ్రంగా నిరసించారు సుందరం పోకిళ్ళని. ఇలా తమందరికీ యిడ్లీలూ కాఫీలూ యిప్పించడం, తమచేత సిగరెట్లు తగలేయించడం-ప్రయోజకత్వం కాదన్నారు. బాగుపడి పైకొచ్చే లక్షణం సుతరామూ కాదన్నారు.

తమాషా ఏమిటంటే మర్నాడు పొద్దున్న నేను శివరాహోటలుదగ్గర కెళ్ళేసరికి జోగినాథం, సుందరాన్ని - యింటికెళ్ళి పిల్చుకొచ్చాడు స్వయంగా. అందరం చేరాం. తిరిగీ యిడ్లీ - వ్యవహారం - కథాకమామీషూ ప్రారంభం అయింది. సరే ఆపైన చదరంగం. రెండాటల తరువాత డబ్బులమీద ఆట ప్రారంభం అయింది. చతుష్టయం నలుగురూ వరసగా ఆడారు సుందరంతో, ఆటకి పావలా చొప్పున. కాఫీలకి రూపాయి, పందేలకి రూపాయి ధారపోసుకున్న సుందరం, నవ్వుతూనే యింటికెళ్ళడం చూసి చతుష్టయానికి చిర్రెత్తుకొచ్చింది.

"చూశావోయ్ వాడికి! ఎంత నిర్లక్ష్యం! ఎంత నిర్లక్ష్యం!!" అన్నాడు అవధాని.

'నిర్లక్ష్యం అంటావేమిటోయ్! పొగరు - పొగరు!'

'ఇంకా మెల్లిగా అంటావేమిటి!'

"అయిన కొడికి డబ్బుగల్చి వాణ్ణిలా తిట్టుకున్నారు. నాకు నవ్వు మండింది సుమా!

'మెల్లిగా అనకపోతే గట్టిగా అంటావయ్యా! ఒకవేళ వింటే ఆ కుర్రాడు రేపు రాడేమో!' అన్నాను. ఛర్రుమని లేచాడు జగన్నాథం 'మేమన్నదాంట్లో తప్పేముందండీ? తనసత్తా ఎదరువాత తెలిసి ఆడద్దూ? డబ్బులున్నాయని ఊహూ ఎగబడ్డమే!' అని.

జోగినాథం అందుకున్నాడు చూశాను చూశాను. మూడు పావలాలు పోయాకయినా కళ్లు తెరుస్తాడేమో! ఆట మానేస్తాడేమోనని. అబ్బే!

'అవి పావలాలనుకున్నాడో చింతపిక్కలనుకున్నాడో' అన్నాడవధాని.

"ఏమనుకుంటేనేం! మర్నాడు ఇడ్లీలకి కాఫీలకి అంతా తయారయ్యారు. పైగా జోగినాథం బావమరదీ అవధాని మేనల్లుడూ కూడా వచ్చారు.

'అబ్బే! వాళ్లెందుకండీ—చద్దిఅన్నం తిన్నారు' అన్నారు యుగళంగా. సుందరం నవ్వాడు—

'అబ్బే పిల్లలుగదండీ'అని.

'వెర్రివెధవ—'అనుకున్నారు పెద్దలు.

మళ్ళా చదరంగం ఆడారు. సిగరెట్లు విరివిగా వెలిగాయి జోగినాథం, డక్కను పెట్టె పక్షీకున పెట్టేశాడు—ఎవడూ ముట్టుకోడనే ధీమాతో. సుందరం చిత్తుగా ఓడిపోయాడు నాలుగు పావలాలూ.

ఊరుగగ్గోలెత్తిపోతోంది—రోజూ అలా రెండురూపాయలు తగలవేసే రంగధాముణ్ణి గురించి. ఇంతేకాదు సుందరంగురించి ఘోరాతి ఘోరమైన పుకార్లు ప్రచారంలో కొచ్చాయి. ముష్టివాళ్ళకి అణా బేడా యిచ్చెయ్యడం, యాయవారం అయన్ని సుష్టుగా మేపి పైగా ఇంటికి పప్పులూ ఉప్పులూ ఇచ్చిపంపడం, పాలేరాళ్ళకీ బడిపంతుళ్ళకీ చొక్కాలూ కంచెలూ ఇచ్చెయ్యడం వంటివి.

'నాకు ఆవకాయ చాలా యిష్టం' అన్నాడు సుందరం ఓనాడు. జగన్నాథంగారు ముందు కరికి చవకలో, మాగాయి, ఆవకాయి, మెంతికాయి నిమ్మకాయి వారి ఆడవాళ్ళచేత పెట్టించి యిచ్చేశారు. ఈ హడావుడిలో, రాకపోకలలో, సుందరం సుబ్బలక్ష్మిని చూడ్డం, పలకరించడం, జరిగిపోయింది.

గొల్లుమంది యావత్ప్రజానీకం ఈ వార్త విని. జగన్నాథంగారి సుబ్బులు సుందరాన్ని పెళ్ళాడుతుందని వార్తలు బయలుదేరాయి. నీలాటిరేవుదగ్గరా, నూతి చప్టాలచుట్టూ, సోమయాజులుగారి చావిట్లో, బహిరంగ సభలు జరిగాయి. పడకగదుల్లో దంపతులు కష్టసుఖాల బదులు సుబ్బలక్ష్మి సుందరీయం ప్రబంధపఠనం చేసుకునేవారు. సుబ్బులుని తమ తమ కొడుకులకి చేసుకుందామని ఆశలు పెట్టుకున్నవాళ్లు మండిపడ్డారు. 'ఈ పెళ్ళెలా జరుగుతుందో చూస్తాంగా' అన్నారు పెద్దలు.

'కులం గోత్రం సరిపోతేమాత్రం, మనవాడికన్నా వాడేం పొడిచేశాడంట?" అన్నారు.

'డబ్బు స్వామీ డబ్బు! ధనమూలమిదం జగత్' అన్నారు.

'ఆఁ! ఏం డబ్బులెద్దూ! బెధవడబ్బు డబ్బుటయ్యా శాశ్వతం? కుక్కని తంతే



వసజ్యోత్స్న —రమేశచంద్ర, హైదరాబాద్.

ప్రయోజకుడు

రాల్తుంది డబ్బు అన్నాడు ఉమ్మాయి

"అంతే అంతే! మాటశాశ్వతం. హరిశ్చంద్రుడి కంత పేరెందుకొచ్చిందీ? మాట—డబ్బు కూడాపట్టకెళ్ళాడా ఏం!" అన్నాడు తుమ్మాయి.

'తగ్గవోయ్! అమాటకొస్తే హరిశ్చంద్రుడు పేరుమాత్రం మాటకటుకుపోయాడా? డబ్బు ఇక్కడేవుండిపోయింది—పేరూ ఇక్కడే వుండిపోయింది' అన్నాడు రణపెంకి జగ్గాయ్.

'రాలుగాయి వెధవా! ఎంతమాటన్నావ్!' అన్నారు ఉమ్మాయీ తుమ్మాయీ. మర్నాడు జగ్గాయి పట్నంలో పెద్దాసుపత్రి కెళ్ళాడు.—విన్నావా రామదాసూ!

ఇంక ఇటు చూస్తే పెంకి భడవా, సత్యభామా, దొరసానీ, గయ్యాళిగంపా అనే నామాంతరాలు గల సుబ్బలక్ష్మి - అదేం చిత్రమోగానీ - సుందరాన్ని చూస్తే సిగ్గుపడ్డం మొదలెట్టింది! అమ్మన్న బావున్నవాళ్ళే - ఇద్దరు ముగ్గురు హృదయాలూ అవీ సమర్పించబోతే నడి. తుప్పెక్కి ఆడిపోయింది 'అప్రయోజక వెధవా' అని మొదలుపెట్టి యిటు మూడు తరాలూ అటు మూడుతరాలూ ఆడిపోసింది. సుబ్బుల్ని చేసుకోడానికి ప్రద్యుమ్నుడో వాడి బాబు అర్జునుడో లేక మెత్తగా తిన్ని నెగ్గుకురా గల ప్రవేజకుడు ఏ మారీచుడో శిశుపాలుడో దిగిరావాలి అనుకునేవారంతా. వాళ్ళమ్మానాన్నా బోర్లు వెంగపడేవారు. అంతేగాదయ్యా మరీ! పెళ్ళీడుపిల్లాక గుండెల్లో కుంపటే అన్నారు. ఇటు దానికి చూస్తే ఉభయ గోదావరి జిల్లాల్లోని ఆంధ్ర వీరయువకుల్లో ఒక్కడూ నచ్చడాయె. ఆ! అదుగో - అలాటి సుబ్బులు కొస్తా పట్టంనుంచి ఊడిపడ్డ సుందర్రావుని చూసి సిగ్గుపడ్డం మొదలెట్టిందంటే చిత్రంగాదూ. ఇతగాడిలో ఏంప్రవేజకత్వం కనబడిందో ఆవిడకి! పైగా అక్కడితో అక్కుండా వాళ్ళింటో వంకాయకూరో, మామిడికాయ పప్పో ఏదో వొటిచేసి రోజూ సుందరం ఇంట్లో ఇచ్చొచ్చేది.

రానురాను జనం ఈవిషయంలో రెండు పార్టీలయిపోయారు. అయితే గియితే ఈ వివాహం ఆమోదించేవాళ్ళొకపార్టీ కూడదనేవాళ్ళు రెండోపార్టి - ఏదీ ఓ చుట్టందుకో రామదాసూ - చేబ్రోలు పొగాకొ ఏమిటి - "

    చుట్టంటించి ఒక్క నిమిషం ఆగి ద్యాసతో
    తృప్తితో ఉత్సాహంతో కథ సాగించారు సుబ్ర
    హ్మణ్యంగారు.

"చివరకి పరిస్థితు లెలా పరిణమించాయంటే - ఆ పార్టీలవాళ్లు ఒకళ్ళనొకళ్ళు తిన్నుకునేందుకు సిద్ధమయారు రహస్యంగా. గూఢచారిణులుకూడా బయల్దేరారు కామాక్షమ్మ సుబ్బులూ సుందరం మాట్లాడుకోవడం చాలామాట్లు వింది. ఆవిడని చాలా నిరుత్సాహపరిచాయవి. ఆవకాయ, జగన్నాథం, నిద్రా, లేసులల్లిక, ఆనపకాయహల్వా గురించే వాళ్లు మాట్లాడుకునేవారు - ఇవివిరివింటావిడ నీలాటిరేవులో.

హఠాత్తుగా పిడుగువంటి వార్త వచ్చిపడింది దాంతో జనం నిద్రాహారాలు వర్జించారు అందరికీ మతులు పోయాయి. దీన్ని గురించిన కబురతోటే ఏకొహాలూ సప్తాహాలూ జరిగాయి కొట్టుకోడానికి సిద్ధమైన రెండుపార్టీలవాళ్లూ ఈ దెబ్బతోటి ఏకాభ్రాయానికొచ్చేసి స్నేహితులైపోయారు. ఎవరో కవి అన్నట్టూ, 'వెయ్యేల?' - ఆ వూళ్ళో పిల్లా మేక, తాతా అవ్వా, రాయీ రప్పా కూడా ఏకమై, జాతిమత, ధనిక దరిద్ర, స్త్రీ పురుష, సత్ అసత్ విచక్షణ ఎంతమాత్రం లేకండా ఏకగ్రీవంగా ఒక తీర్మానం చేశారు.

'సుందరం వ్రతిదానా, నిష్ఠాగరిష్ఠుడూ కాబట్టి చిప్ప చేతికొచ్చి తీర్తుంది; అంచేత సుబ్బుల్ని వాడికివ్వకూడదూ' అని. రామదాసూ! - ఇంతకూ అంతటి ఘోరమైన ఆవార్త ఏమిటని అడగవేం? చెప్తా విను ఆవార్త ఇది. 'సుందరం తుమ్మయికి ముప్పావలా అప్పిచ్చాడు' నవ్వకు నవ్వకు. తుమ్మయంటే ఎవరో నీకేం తెలుసు. ఊళ్లోవాళ్లనడుగు చెబుతారు

వార్తవినగానే, 'అవ్వాహవ్వా' అన్నారంతా సుందరంమీద జాలి పడారు. అతన్ని అసహ్యించుకున్నారు వేళాకోళం చేశారు. జోగినాథం, అవధానీ, కోదండం, సుబ్బులక్ష్మి తండ్రి జగన్నాథం, తాంపెవగాడిపోయారు వార్త వినగానే. 'నాపరువు మంటకలిసిం' దన్నారు జగన్నాథం హుటాహుటిని సుందరం యింటికెళ్ళి మండిపడ్డా తనిమీద.

'ఏమండీ అంత తప్పా ఇవ్వడం!' అన్నాడు సుందరం అమాయకంగా.

'తప్పా' తప్పన్నరా! రామ రామ!— దగాస్తో మాస్తో వాడికెలా యిచ్చావయ్యా! తిరిగి యిస్తాడనే?' అన్నాడు వెనకే వచ్చిన జోగినాథం.

'ఎంతో కష్టంలో వుండి అడిగాడు - ఎందుకివ్వకేం?'

'ఆమాత్రం మాకు తెలీదయ్యా? ఈ వూళ్ళో ఒక్క పిట - ఒక్క గింజ, వాడికి అప్పివ్వరు తెలుసా? తుమ్మయ అప్పలెగ్గొడతాడనే విషయం ఈ వూరి పాపాయిలకూడా తెలుసు.'

'ఇవ్వరూ అప్పివ్వలేరుకదా! వాడు తిరిగి తీర్చడని మీకెలా తెలుసు?' అంటూ అప్రశ్న వేశాడు సుందరం.

'తిమ్మన్న పేరు వేరే చెప్పాలా ఏమిటయ్యా! మొహం చూస్తే తెలీదూ! హవ్వ! వాడు నీకు అప్పు తీరుస్తాడూ! వేశాడులే టోపీ. తిరోడకా తిమ్మకో సబ్బా(?)హ్మడిని పిలిచి.'

సుందరానికి పౌరుషం రేకెత్తుకొచ్చింది:

'సరేలెండి. అందరూ ఇవ్వకపోయినా నేను యిచ్చానన్న విశ్వాసంతో నాది నాకిచ్చేస్తాడు' అన్నాడు.



"ఏటికెదురీదు"

చిత్రకారుడు: అ. పైడిరాజు (విజయనగరం)

★ ప్రయోజకుడు ★

'ఆఁ! ఇస్తాడిస్తాడు' అని వెక్కిరించాడు కోదండం.

'సుందర్రావు పంతులూ! వాడు నీకు తిరిగి ఆ ముప్పావలా అప్పు తీర్చేస్తే నా కుడిచెవి కోసిస్తా' అన్నాడు జోగినాథం.

'నీ కుడిచెవి నా కెందుకు?' అన్నాడు సుందరం.

ఈలోగా అవధాని వెక్కిరించాడు. 'ఒస్సే! చెవి కోసిచ్చేవాడివి నువ్వేనయ్యా! చేవంటే డబ్బుకాయి పందెం.....ఏమ య్యోయ్! సుందరం!—కబుర్లు కాదు. నువ్వుగాని వాడిదగ్గర ఆ అప్పు వసూలు చేస్తే నేను రెండు రూపాయలు పందెం ఓడిపోతా. ఇందుకు సాక్షి సుబ్రహ్మణ్యం గారే.' అంటూనే రెండు రూపాయిలు నాచేతిలో పెట్టాడు. సుందరం పకపక నవ్వి 'సరే కానీండి' అన్నాడు.

ఈమాటు జోగినాథం బెదిరించాడు. 'ఓడిపోతావు సుందరం. మానుకో నీ పందెం. లేకపోతే నేను కూడా కాస్తా' అంటూ.

'కాయండి. ధైర్యమైన వాళ్ళంతా కాయండి. చేతనైనంత కాయండి' అన్నాడు సుందరం.

'అప్పు వసూలు చెయ్యడాని కాఖరు రోజు పౌర్ణమయ్యోయ్! ఇవాళ సప్తమి. జ్ఞాపకముంచుకో.' అంటూ జోగినాథం మూడు రూపాయిలూ, కోదండం మూడు రూపాయిలూ కాశారు.

'చూడు సుందరం! నువ్వు కుర్రాడివి. ఏదో నిన్ను వెర్రివాణ్ణిచేసి డబ్బు దోచుకోడం నాకు సుతలామూ ఇష్టం లేదు. కానీ నీకు నీతిపాఠం చెప్పడానికి నేను కూడా కాస్తున్నా. అయిదు రూపాయిలు. సుబ్రహ్మణ్యంగారూ!—ఇంటికెళ్ళి డబ్బు తెచ్చిస్తా' అన్నాడు జగన్నాథం. ఈలోగా కబురందుకున్న కరణంగారు రెండూ, మునసబుగారు మూడూ, జగ్గయ్య పాపలా తెచ్చారు పందేనికి."

చుట్ట కొంచెం ఘాటుగా పీల్చి అవతల పారేశారు సుబ్రహ్మణ్యంగారు. గొంతు సరి చేసుకున్నారు.

"రామదాసూ! చేసిన పాపం చెబితే పోతుందంటారు. అణా డబ్బులకి గొల్లుమనే పల్లెటూర్లో రూపాయిలకి రూపాయిలు ఇంతమంది పందెం కాసేస్తూంటే నాకూ మనసుపుట్టింది సుమా! 'నేనో రూపాయి కాశాను సుందరం' అన్నా జంకుతూ. పందాలు మొత్తం పదహారుంబావలా చేరింది నా దగ్గరకి. సుందరం వెంటనే లోపలకెళ్ళి, పదహారుంబావలా తెచ్చి, నా దగ్గర ముడుపుంచాడు - ఆనక పేచీలు రాకండా.

"ఊళ్ళో ఊసుపోని వాళ్ళందరికీ ఉషారు హెచ్చింది. తుమ్మాయి బహు జాగ్రత్తగా తిరుగుతున్నాడు, సుందరానికి మొహం చాటేస్తూ. సుందరం మాత్రం నిర్వి చారంగా పూలరంగడల్లే నిశ్చలంగా తిరిగే వాడు. మామూలుగానే బేహారా హూటలు, చదరంగం, తతంగం సాగిపోతోంది. అంత కన్న మామూలుగా సుబ్బులొస్తూ పోతూ వుంది సుందరం ఇంటికి...


అంతా బావుందిగానీ, యీ చివరిది ఎవరికీ నచ్చలేదు. ఏది-ఈ సుబ్బులుకి సుందరం మీద మోజు. 'ఇదంతా అసలు జగన్నాథం దగ్గరుండి సాగిస్తున్నాడు.' అన్నారు పెద్దలు. ఓనాటి సాయంత్రం కరణంగారి అరుగుమీద పేకాట సందర్భంలో జగన్నాథాన్ని నిలేసి అడిగేశారంతా. 'ఏమయ్యోయ్ నీ కూతుర్ని ఆ పూలరంగడి కిస్తావనుకుంటున్నారు ఊళ్ళో. నిజమా ఏమిటి కొంపతీసి!' అని.

తారాజువ్వలా లేచాడు జగన్నాథం:- 'ఎవడన్నాడయ్యా! అసలు అన్న దెవడూ అంట. వాడిది గుండా చెరువా! ఏమయ్యోయ్! ఒకటే లెక్క. నా కూతుర్ని పాలేరాడికిస్తే ఇంకా సుఖపడ్తుంది. చూసి చూసి ఈ మిడిమిడి రంగడికా యిచ్చేది నేను! నిష్ప్రయోజకుడు. కానీ దాచుకోడం చాతకాదూ; పైగా ఆట రాకపోయినా పెద్దాళ్ళతో చదరంగం ఆడి పందేలుకూడానూ! పోన్లేవయ్యా. అవన్నీ వదిలెయ్. ఆ తుమ్మాయిని - ఆ దగుల్బాజీ తుమ్మాయిని, నమ్మి ముప్పావలా అప్పిచ్చిన వెంగళాయిని నా అల్లుడుగా చేసుకుంటానూ! చూసి చూసి!-పాపలా! అర్ధా! ముప్పావలా ఆయె!' అంటూ చిన్న కథాకళీ నృత్యం చేశాడు.

అంతవరకూ నిరాహారంతో పరితపిస్తున్న ఆ వూరిప్రజలు పథ్యం పుచ్చుకోడం ప్రారంభించారు ఆ రోజునుంచి - సుబ్బలక్ష్మిని సుందరాని కివ్వడం కల్ల అనే ధీమాతో, ఇంక తుమ్మాయి కథకూడా తేలిపోతే నిద్రకూడా పోవచ్చు. ఆయొక్క వానచినుకోసం నోరు తెరుచుకూచున్న ముత్తెపు చిప్పలాగా, గడువురోజు పౌర్ణమి కోసం జనం ఎదురుమాడ సాగేరు.

'వేయికళ్ళతో కనిపెట్టి చూశేవారు తుమ్మాయి రాకపోకల్ని. సుందరం తుమ్మాయి ఇంటికెళ్ళనే వెళ్ళడు. ఓరోజు సుందరం షికారు బయల్దేరాడు. ఓ సందుమలుపు తిరిగేసరికి ఆ సందులోనే ఒక ఇంట్లోనుంచి బైటికొస్తున్నాడు తుమ్మాయి. సుందరాన్ని అల్లంత దూరంలో చూడగానే పులిని చూసిన లేడల్లే ఛెంగున పరిగెత్తాడు. సుందరం తరిమాడు. ఇద్దరూ కలిసి బోల్డు సందులంబట పరిగెత్తారు శివాలయం దగ్గర కొచ్చేసరికి సుందరం అలిసిపోయి ఇంటిదారి పట్టాడు; తరమడం మానేసి.

కళ్ళుమూసుకు పరిగెత్తుతున్న తుమ్మాయి మాత్రం శివాలయం చుట్టేశాన్ని అనుకోకండా, హఠాత్తుగా ఆ సందు మొనలో సుందరాన్ని ఢీకొన్నాడు. ఇంక పరిగెత్తడానికి వీల్లేదాయె. [illegible] మీది కెక్కిపోయి చూస్తున్నారు దొమ్మర



సాని గారడీ చూసినట్టు. జగన్నాథంగారు శివాలయం గోడమీద కూచుని గుడ్లు మిటకరిస్తున్నారు.

'ఏవండోయ్ సుందరంగారు! నమస్కారం! ఎక్కడికి బయల్దేరారు? షికారు కాబోలు - హ హ్హ......!' అన్నాడు తుమ్మాయి - అప్పుడే సుందరాన్ని చూసి నట్టు

'నమస్తే' అన్నాడు సుందరం నిశ్చలంగా.

'ఖులాసేనా?' అన్నాడు తుమ్మాయి యాదాలాపంగా

'ఆ! ఖులాసాయే మీరు ఖులాసాయేనా?'

ఏడుపు మొహం పెట్టాడు తుమ్మాయి 'ఏదిలెండి ఏం ఖులాసా! వంట్లో చూస్తే బాగులేదు శీతవాతం! అడుగుతీసి అడుగెయ్యలేకపోతున్నా ఇంట్లో చూస్తే ఆవిడకి జ్వరం. పిల్లలకి కురుపులు బియ్యపుగింజ లేదు. అయ్యా! ఏం చెప్పమన్నారూ! ఇంకో అటు చూస్తే మామిడి తోట అప్పుడే పండు మొఖం పట్టింది. దొంగ భయం పక్షి భయం అయ్యా! ఆ పండు మిగల ముగ్గిలోగా దింపాలి— అమ్మాలి ఇంట్లో పొయ్యిమీద కుండ ఎక్కాలి,'

'అయ్యోపాపం!' అన్నాడు సుందరం

'ఎంత మాటెంతమాట! హిహిహ్హి— సుందరం బాబూ! వయసుకి చిన్నయినా ఘనమైన మనసు బాబూ నీది ఎంతదయ! ఎంతదయా! అచ్చం మూర్తిలా మీ తండ్రి కిష్టమూర్తిగారిని పోలావు. దచ్చి స్వర్గాన్నున్నాడు మహారాజా. ఏమిటో! ...ఆఁ! అన్నట్లు చూడు బాబూ! నీకు గుర్తుందో లేదో గానీ నా కుంది సుమీ! అహర్నిశలూ నిద్రపోను నేనూ మా ఆవిడా వూహూ ఒకటే ఇదైపోతూవుంటాం మీ ఇది తల్చుకుని ఆఁ! చూడు బాబూ! తెలుసునా సంగతి? మరేం లేదు; కూలీల్ని మాట్లాడాను, ఒక్క మూడురూపాయలిప్పిస్తివా—అది వాళ్ళఎదాన్న పారేసి పండు దింపించేస్తే, పట్నం పంపిస్తా అమ్మకానికి. చేతికొచ్చిన కూడు చెడిపోతూంటే మనసొప్పుతుందా బాబూ మరి? మరోటి పట్నంనుంచి డబ్బొచ్చేదాకా నువ్వాగక్కర్లేదు. బాగా పండబారిన పళ్లు ఒకవంద ఏరి, ఈ ఊళ్ళో, నీకళ్లెదురుగుండా అమ్మి పారేస్తా. నీడబ్బు నీకు పువ్వుల్లో ముడిచి యిచ్చేస్తా. బాబ్బాబు. ఈసారి కాదుకో! నాతండ్రి నాతండ్రి" అంటూ ప్రాధేయపడ్డాడు తుమ్మాయి.

ఒక్కక్షణం ఆలోచించాడు సుందరం. ఇటుచూస్తే దీనావస్థలోవున్న తుమ్మాయి అటుచూస్తే తనవంక ఆత్రుతగా - తన జవాబుకోసం - ఎదురు చూస్తున్న అశేష ప్రజానీకం.. బుద్ధుడు గుర్తుకొచ్చాడు హామ్లెట్ కనపడ్డాడు...అటా ఇటా? ఇటా అటా...

"గబుక్కున జేబులో చెయ్యిపెట్టి మూడు రూపాయలూ తీసి తుమ్మాయి చేతిలో పెట్టేశాడు. చూస్తున్న జనానికి 'హా' అనడానికి కూడా ఓపిక లేకపోయింది.

తుమ్మాయి అందరికన్నా ఎక్కువ ఆశ్చర్యపోయాడు. తక్షణం స్తుతివాక్యాలు ప్రారంభించాడు 'సరే మీరు ఇంక వెళ్ళండి పళ్లు దింపగానే నాకు డబ్బుమాత్రం ఇచ్చెయ్యండి' అంటూ చక్కా పోయాడు సుందరం. ఆరోజు ఆవూరిచరిత్రలో చెప్పుకోదగినరోజు. జనం విరగబడి నవ్వారు విమర్శించారు వెయ్యిందాల తిట్టుకున్నారు ...ఏదో సామెత చెబుతారు చూడూ - ముప్పావలా కోడి పిల్లకి దిష్టితగిలిందని, మూడున్నర ఖరచేసే పందిపిల్లని దిగదుడిచాడట ఎవడో, సుందరాన్ని శుద్ధ వెఱ్ఱివెంగళాయగా జమకట్టేశారు జనం. ఇది జరిగింది నవమినాడు...

దశమి ఉదయాన చదరంగం బల్లదగ్గిర తమాషా జరిగింది. అంతవరకూ రోజూ ఓడిపోతున్న సుందరం ఆవేళ జగన్నాథం దగ్గిర పావలా గెలిచాడు. మళ్లీ ఆడి ఇంకో పావలా ఓడిపోయాడు జగన్నాథం. తరవాత మిగతా ముగ్గురూ తలో మూడేసి ఆటలూ ఆడి మూడేసి పావలాలు ఓడిపోయారు సుందరం చదరంగంలో తమని గెలవడం ఏమిటని బోలెడు కోప్పడిపోయారు వాళ్ళు. పట్టుదలకి మళ్ళీ మధ్యాహ్నం వేశారు ఆట.

సాయంత్రం చీకటిపడేసరికి నాలుగు రూపాయలు గెలుచుకున్నాడు సుందరం.

జగన్నాథాది చతుష్టయం ధోరణి మారింది. వాళ్ల చిరునవ్వు హరించిపోయింది ఊళ్లోకూడా సద్దుమణిగింది. జనం చిరాగ్గా ఉన్నారు

ఏకాదశినాటి ఉదయం మధ్యాహ్నం కూడా ఒక్క ఆటపోకుండా నలుగురినీ గెలిచాడు సుందరం. సుందరం ఆవాళ సంపాయించింది ఏడున్నర.

జోగినాథానికి వేడెక్కింది అవధానికి ఏడుపొచ్చింది. జగన్నాథం జోరుతగ్గింది. కోదండం కంగారుపడ్డాడు.

ద్విగుణీకృతమైన పట్టుదలతో ద్వాదశినాడు కూర్చున్నారు ఆటకి. ఊరిపెద్దలంతా ప్రేక్షకులుగా వచ్చారు. తాగిన కోతుల్లా తందనాలాడిపోతున్న చతుష్టయాన్ని టకటకలాడించి పారేశాడు సుందరం ఇదే ఆట కొట్టేశాడు సాయంత్రానికి మరో ఎనిమిది రూపాయలు ఒడేసి పుచ్చుకున్నాడు.

జనానికి ఏం చెయ్యాలో తోచలేదు. చూసి చూసి చప్పట్లు కొట్టడానికి మనసు రాలేదెవ్వరికీ.

'అసలీ సుందరం ఎవడు?'

'ఇంత ఆట ఎక్కడిదయ్యా వీడికి!'

'గత ఎనిమిది రోజులుగా, ఆట పేరు చెప్పి రూపాయీ, కాఫీ సిగరెట్లకి ఇంకో రూపాయీ—మొత్తం రోజుకి రెండు రూపాయిల చొప్పున, ఎనిమిది రెళ్లు పదహారు రూపాయిలు వాడికి నష్టం అయిందనుకో. అయితే మొన్న, నిన్న, ఇవాళ, కలిసివాడు మనదగ్గిర గెలిచిన మొత్తం పందొమ్మిదిన్నరా. వీడిదుంపదెగా! నిముషాలమీద ఆటకట్టి పారేస్తుంటే నే! మతిపోగొట్టేస్తున్నాడాయె!'

'ఉద్దండుడిలాగే ఉన్నాడే చూస్తే!' అన్నాడు జోగినాథం

'ఎలాగేనా గడుసు బుఱ్ఱ సుమా!...' అంటూ సాగదీసుకున్నాడు కోదండం.

"నాకు మతిపోయింది"అని బాహాటంగా ప్రకటించాడు అవధాని.

అదేముక్క అందరూ విడివిడిగా అనుకున్నారు.

త్రయోదశి తెల్లవారింది కాలవకి నీళ్లకెళ్ళిన వంటవాడు, తుమ్మాయి మామిడిపళ్లు బళ్లకెత్తించి పట్నం పంపిచబోతున్నాడని చెప్పాడు—పరుగునవచ్చి సుందరంతో.

పొద్దున్నే పనికట్టుకుని పదిమందినీ పిలిచి వచ్చింది సుబ్బలక్ష్మి తల్లి—"మా యింటికి పసుపుకుంకానికి రండి"అని.

నాకు అంతుచిక్కలేదు. ఆశ్చర్యం వేసి-జగన్నాథంకోసం బయలుదేరాను. అతగాడు, పొలంనించి ఇంటికొస్తున్నాడు. ఇద్దరం కలిసి కాలవవద్దకి వచ్చేసరికి తుమ్మాయి మామిడిపళ్ళబండి పట్నం బయలుదేరుతోంది. పెద్దకొడుకుని బండికూడా పంపుతున్నాడు.

మేం నవ్వుకున్నాం తుమ్మాయి తెలివికి.

ఇంతలో హుటాహుటిని సుందరం వచ్చేశాడు - సిగరెట్టు కాలుస్తూ. తుమ్మాయి కంగారుపడ్డాడు. మేం దగ్గిరికి వెళ్ళాం.

'దింపవయ్యా! పళ్లుదింపు వందపళ్లు ఇక్కడే అమ్మి నా డబ్బు నాకిస్తానన్నావుగా' అన్నాడు సుందరం. తుమ్మాయి వసిగాడు.

'తొందరపడకు సుందరంబాబూ! బహు కుటుంబీకుడిని. కొంచెం జాలి చూపించు. పళ్లు పట్నంలో అమ్ముకుంటే నాలుగు డబ్బులు ఎక్కువ ముడతాయి. ఈ పల్లెలో ఏంగిడుతుంది చెప్పు, ధరకనిఅమ్ముకుంటేకి నానాటి చినుబాబూ ఒక్కరవ్వ ఆగు.

★ ప్రయోజకుడు ★

సాయంత్రానికి నీ డబ్బు పువ్వుల్లో పెట్టి ఇస్తా.

'తుమ్మాయిగారు ఇంక మనం ఇందు గురించి వాదించుకోవద్దు...మొదట అనుకున్న ప్రకారం పండపళ్లూ దింపండి; అనకే బండి వదుల్తాను.' అన్నాడు సుందరం.

తుమ్మాయి మళ్ళీ ప్రయత్నించాడు; కాని ఆటసాగలేదు. గోవిందా! అంటూ పండపళ్లు - బాగా ముగ్గినవి - తీసి ఓగంప కెత్తి కూలాడి నెత్తిన పెట్టించాడు.

'పద నేనూకూడా వుంటా. అమ్మించు' అన్నాడు సుందరం.

'చాలా చిత్రంగా ఉందే కుఱ్ఱడి వ్యవహారం! మొత్తంమీద వ్యవహారతా దక్షుడల్లేనే ఉన్నాడే'...అన్నాడు జగన్నాథం కొంచెం ఆశ్చర్యంతో.

ఊళ్లో ప్రవేశించాం మెల్లిగా.

'మావిడి పళ్లు మావిడిపళ్లు. 'రసాలు... అరముగ్గినవండి ఆరగించండి' అంటూ కేక వేశాడు కూలీవాడు. వాడి వెనక తుమ్మాయీ, సుందరం, ఆవెనక నేనూ జగన్నాథం నడుస్తున్నాం. ఊరు నడిబొడ్డుకి వెళేటప్పటికు ఓ చిన్నగుంపు తయారయింది-మాకూడా.

పళ్లు కొనటానికి ఎవడూ ముందుకు రావటంలేదు. అందరూ వింత చూస్తున్నారు - ఆత్రుతగా. జగన్నాథంగారిల్లు సమీపించేసరికి 'ఏయ్, మామిడిపళ్ళూ!' అంటూ గావుకేక పెట్టింది సుబ్బులక్ష్మి గుమ్మంలో నుంచుని

"బావుంటుందా సుబ్బలక్ష్మి?" అంది కథ వింటున్న పద్మ, సుబ్రహ్మణ్యంగారి వేపు కళ్ళు సన్నంగా చేసిచూస్తూ.

"అడగాల్సినచోట అడగాల్సిన ప్రశ్న వేశావు తల్లీ!" అంటూ విరగబడి నవ్వారు సుబ్రహ్మణ్యంగారు. "సన్నగా పొడుగ్గా ఉంటుంది సుబ్బలక్ష్మి. గుండ్రని మొహం' కొట్టొచ్చే ముక్కుకి ఎడాపెడా పకాపకా నవ్వే పెద్దకళ్లు కళ్ళనిండానూ, చుట్టూనూ, అలుక్కుపోయిన కాటుక. ఆపైన దీపముంటిబొట్టు, సన్నని, చక్కని పెదిమలు. సైజువారీగా గుచ్చిన ముత్యాల సరమల్లే పొందికగా అమరి తళతళలాడేపలువరుస... ఆఁ ... నవ్వినప్పుడేం, - నవ్వినప్పుడూ ఆ యొక్క గులాబీరంగు లేతచిగుళ్ళూ వాటి కింద ధవళదంతాలూ, చిదిపితే పాలుగారే చెంపలమీద, కనీ కనపడనట్లు రెండు సొట్టలూ, వంపుతిరిగిన సన్నని పెదిమలూ, ఈ మొదలైన యావత్తూ సరంజామా వాటి వాటిపనులను అరక్షణం చేసేస్తాయి. ఆడది విసుక్కోతుంది అనవ్వమాని మొగాడు పిచ్చెత్తిపోతాడు. అన్నట్టు మర్చిపోయాను. అవేళ తలంటిపోసుకుంది. ఆ పిల్ల తాలూకు ఉంగరాలజుట్టు మహాపొగరుగా అల్లరిచేసేస్తోంది గాలిలో ఎగురుతూ. పొడుగ్గా ఆజుత్తు పిఱ్ఱలవరకూ దిగిపోయింది. అయిందా .. ఇంక కంఠందగ్గరికొద్దాం ... కంఠం ఎలా ఉంటం టే..."

రామదాసుగారు కొంచెం గట్టిగా గొంతు సవరించుకున్నారు పొడిదగ్గుతో. "హిహిహి...పంతులుగారు కవిత్వంలో పడిపోతున్నారు...కథ చెబుదురూ...హిహిహి" అన్నారు.

రామదాసుగారిమనసులో అసలు సంగతి గ్రహించారు సుబ్రహ్మణ్యంగారు. కొంటెగా నవ్వి కథ ప్రారంభించారు:

"ఆ. ఏంచెబుతున్నాను?...అదేఅదే... ఆ జగన్నాథంకూతురు సుబ్బలక్ష్మి గుమ్మంలో నుంచుని మామిడిపళ్లు కేకేసింది.

కొయ్యబారిపోయారు జగన్నాథంగారితోపాటు యావన్మందినీ. తుమ్మాయి నివ్వెరబోయాడు. నోట మాటరాలేదు ఎవరికీ ఈ అనుకోని సంఘటనవల్ల.

'ఎలాగ వంద?' అంది సుబ్బలక్ష్మి ధైర్యంగా.

'నాలుగు రూపాయల పావలా అండి. ఒక శేఖర.'అన్నాడు సుందరం అందుకుని. సుబ్బలక్ష్మి సిగ్గుతో తలవంచింది. లోపలికి వెళ్ళింది'అమ్మా!నాలుగుంబావలాయే నటే' అంటూ.

అందరం ఊపిరి బిగబట్టి చూస్తున్నాం. సుబ్బలక్ష్మి బయటికివచ్చింది అందర్నీ ఓమాటు కలియచూసింది. నిర్లక్ష్యంగా తల తాటిస్తూ 'ఏయ్ అబ్బీ! గంపలో ఉన్నవి వందేనా?...అయితే తెచ్చి లోపలపొయ్.' అంది. క్షణాలమీద జరిగిపోయింది అంతా.

మెస్మరైజు అయినవాడివలె జగన్నాథంగారు స్వంతఇంటి గుమ్మం ఎక్కారు. ఈలోగా తుమ్మాయి డబ్బుకోసం చెయ్యి చాచాడు. కాని సుందరం ముందుకిదూకి, తన చెయ్యి ముందుకుజాచాడు. సుబ్బలక్ష్మి మూడు విచ్చురూపాయలూ, అయిదు పావలాలూ సుందరంచేతిలో పోసింది; సిగ్గపడుతో.


'తుమ్మాయిగారు! మీరు నాకు బాకీ ఉన్న మూడుమ్ముప్పావలా ఇదిగో తీసుకుంటున్నాను. ఇదిగో ఓ పావలా వీడికి కూలీ ఇస్తున్నాను మిగతా పావలా ఇదిగో మీది ' అన్నాడు సుందరం

కోపంతో, ఏడుపుతో తుమ్మాయి ఆ పాదమస్తకం కంపించిపోయాడు. 'క్రూరుడివి సుందరం! ద్రోహివి సుందరం!...' అంటూ బోలెడు తిట్టుకుంటూ పెద్దపెద్ద అంగలువేస్తూ వెళ్ళిపోయాడు - సుందరం చేతిలోంచి లాక్కున్న పావలాని, నేలనేసి కొట్టేనంత విసురుగా జేబులో వేసుకుంటూ.

గుప్పిటలో డబ్బుని గుంపుకి చూపాడు సుందరం 'ఇదిగో తుమ్మాయి తీర్చిన అప్పు. దీనిమీద మీరందరూ పందెం కాసిన పదహారుంపావలా ఇలాఇవ్వండి సుబ్రహ్మణ్యం గారూ అన్నాడు సుందరం.

హాహాకారాలు చెలరేగాయి గాలి దుమ్ములా లేచాడు జగన్నాథం కూతురిమీద: 'నువ్వూ - నువ్వూ.. నీకు...నీకేమన్నా...ఈపళ్లు ఎందుకొన్నావూ? ఆ?...' అంటూ నాలిక బయటబెట్టి గుప్పిళ్లు బిగించాడు...తలుపుచాటునించి ఆయన భార్య అందుకుంది 'చాల్లెండి భాగోతం ...దానిమీది కలా ఒంటికాలిమీద లేచి

(56-వ. పేజీ చూడండి)



28

కాలం గడుస్తోంది. క్రమక్రమంగా ఎమరాల్డా మనస్సులో శాంతి నెలకొంటున్నది. అమిత ఆనందంవలెనే అమిత దుఃఖంకూడా ఒక్కపెట్టున వచ్చి అంతలోనే అంతరించడం సహజం. మితిలేనిది దేనినీ మానవహృదయం భరించలేదు. జిప్సీ యువతి ఇటీవల అనుభవించిన అపారదుఃఖంవల్ల, ఆమె మనస్సులో అన్ని భావాలూ నశించాయి; ఆశ్చర్యం ఒక్కటిమాత్రం మిగిలిపోయింది.

ఆశ్రయం, సంరక్షణ లభించగానే క్రమంగా ఆమెలో తిరిగి ఆశ మొలకెత్తింది. ఆమె ఇప్పుడు సమాజానికీ, నగరజీవితానికీ దూరమైపోయినా, తిరిగి ప్రవేశించడం అసాధ్యం కాదని ఆమెకు తోచనారంభించింది గోరీలో బంధించబడినా తప్పించుకోగల సాధనం చేతిలోనే ఉన్నట్లుంది.

పీడకలలవలె ఆమెను పట్టుకుని పీడిస్తున్న గత సంఘటనలు మెల్లిమెల్లిగా విస్మృతిపథంలో పడిపోతున్నాయి చివరకు క్లాడ్ ఫ్రాలోనికూడా మరిచిపోయింది. కాని ఫీబస్‌నిమాత్రం ఆమె మరిచిపోలేదు ఫీబస్ బ్రతికిఉన్నాడని ఆమెకు దృఢమైన నమ్మకం కలిగింది ఆమె అతన్ని స్వయంగా చూసింది. ఆ యువకుడే ఆమె జీవితానికి సర్వస్వం. జరిగినదుర్ఘటనలవల్ల ఆమెలో అన్ని భావాలూ నశించినా ఫీబస్‌పట్ల ప్రేమమాత్రం వసివాడలేదు. ప్రేమ అనేది చెట్టువంటిది. దానికదే బీజమై మొలిచి పెద్దదౌతుంది. మనలో లోతుగా వ్రేళ్లు పాతుకుంటుంది. శిథిల హృదయంలో కూడా ఆ పచ్చదనం వాడదు. మోహం ఎంత గుడ్డిగా వృద్ధియైతే అంత బలంగా పాతుకుంటుంది. ఔచిత్యమెరగని మోహం మరింత బలీయమై కన్నుమిన్నూ కాననిదౌతుంది; అటువంటిది సమసిపోవడం అరుదు.

ఫీబస్‌ని గురించి తలుచుకున్నప్పుడు ఎమరాల్డాకి బాధ కలగకపోదు. అతడుకూడా అనుమానించడం ఆమెకు హృదయశల్యంగా ఉంది. అతనికోసమై ప్రాణాలనైనా బలియివ్వడానికి వెనుదియ్యని యువతి అతన్ని కత్తితో పొడుస్తుందని అనుమానించడం ఘోరమే. అయినా ఆమె కతనిపైన కోపంరాలేదు. ఆమె మాత్రం నేరం ఒప్పుకోలేదా? అధికారులు హింసిస్తే లొంగిపోలేదా? దోషమంతా తనదే ననుకుందామె. అటువంటి నేరానికి అంగీకరించడం కంటె అధికారుల హింసలు సహించి ప్రాణత్యాగం చేసిఉండవలసింది. ఒక్కసారి, ఒక్కక్షణంపాటు మాట్లాడ్డానికి వీలుచిక్కితే చాలు, ఫీబస్ అనుమానాలన్నీ పటాపంచలౌతాయని ఆమె నమ్మకం.

అయితే ఆమెకింకా అర్థంకాని సంగతులు కొన్ని ఉన్నాయి. చర్చిముందు ప్రాయశ్చిత్తం జరిపే సమయంలో ఫీబస్ ఒక యువతితో కలిసి మేడపైనుంచి చూస్తూ నిలబడ్డాడు. అతని ప్రక్కనున్న ఆ యువతి ఎవరో? అతని చెల్లెలై ఉండవచ్చు. ఏమో! అలా అనుకోడానికి మనస్సు సరిపడదు. అయినా అలా సరిపెట్టుకోకపోతే, ఫీబస్ ఇంకా తననే ప్రేమిస్తున్నాడని భావించకపోతే ఎమరాల్డా బ్రతకడం కష్టం. తనను తప్ప ఇంకెవరినీ ప్రేమించలేదని ఫీబస్ ప్రమాణం చేసి చెప్పాడు! ఇంకంతకంటె ఆమె కేమి కావాలి? తరవాత జరిగిన దానికి అతని దోషంలేదు. అతని అనుమానానికి సరిపడినట్లే అంతా జరిగింది. అతను అనుమానించడంలో తప్పులేదు అందువల్ల ఎమరాల్డా ఇంకా ఆశ నిలుపుకుంది.

అంతేకాదు. ఆమెను రక్షించి ఆశ్రయమిచ్చిన చర్చి ఆమెకు కొంత బాధ నివారించింది. అక్కడి శిల్పాకృతులు, బ్రహ్మాండమైన ఆ నిర్మాణం, మతంపట్ల దైవంపట్ల భక్తిని ఇనుమడింపచేసే ఆ వాతావరణం ఆమెకు తెలియకుండానే ఆమెకు చిత్తస్థైర్యాన్నిచ్చాయి. గోపురంలో ఎత్తుగా నివసిస్తున్న ఆమెకు నగరం నలుమూలలనుండి వినవచ్చే ఘంటల నినాదాలు, అప్పుడప్పుడు

మూలం :
విక్టర్ హ్యూగో

అనువాదం :
సూరంపూడి సీతారామ్

★ ఘంటారావం ★

దూరంనుంచి వినవచ్చే ప్రార్థనాగీతాలు గాయపడిన ఆమె హృదయానికి చికిత్సచేశాయి. పగటి నగరఘోష, రాత్రి ప్రశాంతత ఆమె బాధల నపనయించి, స్మృతిని జోకొట్టాయి. ప్రతి ఉదయం నాటర్ డామ్ చర్చి గంటలధ్వనులకు ఆమె మనశ్శాంతి సుస్థిరమౌతోంది. హృదయంలోని గాయాలు మానుతున్న కొద్దీ ఆమె సహజసౌందర్యం ఆమెకు తిరిగిరా నారంభించింది. ఈమారు ఆ సౌందర్యములో హర్షోల్లాసాలకంటె శాంతి మూర్తిభవిస్తోంది.

ఉదయమే తనగదిలో ఒక మూల దుస్తులు మార్చుకుంటుంది. నిత్యమూ ఫీబస్‌ను గురించి తలపోస్తూ కాలం గడుపుతుంది ఫీబస్‌ను గురించిన ఆలోచనలలో తెరిపియిచ్చినప్పుడు క్వాసిమోడోని గురించి ఆలోచిస్తుంది. మనుష్యులకూ ఆమెకూ మధ్య మిగిలిన సంబంధం అతడొక్కడే. ఈ వింతమిత్రుని గురించి ఏమి భావించాలో ఆమెకే తెలియలేదు. అతనికి తగిన కృతజ్ఞత చూపలేకపోతున్నందు కామె తనను తాను నిందించుకుంటుంది. అయినా అతని వికృతాకారానికి అలవడలేకపోతోంది.

క్వాసిమోడో ఇచ్చిన ఈల నేలపైనే ఉంటుంది. అతడు లోపలికి తొంగిచూస్తూ ఉంటాడు. అతడాహారం తీసుకువచ్చేటప్పుడు అతనిపట్ల ఎంతగా ప్రీతి కనపర్చాలని ప్రయత్నించినా ఆమెకు సాధ్యపడలేదు. అతడుమాత్రం తలవంచుకుని వెళ్లిపోయేవాడు.

ఒకనాడు క్వాసిమోడో వచ్చేసరికి ఎమరాల్డా డాలీని బుజ్జగిస్తోంది. క్షణంసేపు అతడు చూస్తూ నిలబడిపోయాడు' విచారంతో తలూపి అన్నాడు: "నేను మనిషినైపుట్టడం నా దురదృష్టం. ఆమేకనై పుట్టినా బాగుండును.

ఎమరాల్డా ఆశ్చర్యపడి అతనివంక చూసింది. అతడు తలవంచుకుని వెళ్ళిపోయాడు.

మరొకనాడు అతడు గుమ్మంవద్ద నిలిచి చూశాడు. ఆమె ఒక పాట సన్నగా పాడుకుంటోంది. జిప్సీలు ఆమె చిన్నతనంలో ఆమెను నిద్రపుచ్చడానికి పాడినపాట అది. అతన్ని చూసి ఉలిక్కిపడి ఆమె పాటఆపివేసింది. ఆమెఉలికిపాటు గమనించాడు. గుమ్మంవద్దనే అతడు మోకరించాడు రూపం చెడిన రెండుచేతులూ మోడ్చి ప్రార్థనాపూర్వకంగా అన్నాడు: "అయ్యయ్యో! ఆగిపోకండి. నన్ను తరిమి వెయ్యకండి" ఆమె మెల్లిగా వణుకుతున్న కంఠంతో తిరిగి పాట పాడింది. క్రమంగా అతని ఉనికికి ఆమె అలవాటు పడింది. వణుకుతగ్గి తనపాటలో మనస్సు లగ్నం చేసింది. క్వాసిమోడో ఆమె నేత్రపద్మాలపైనే చూడ్కులు నిగిడ్చి అలాగే మోకరిల్లి ఉండిపోయాడు. బధిరుడైన అతడామెపాటను కన్నులతో వింటున్నట్టున్నాడు.

ఇంకొకరోజున అతడు సిగ్గుపడుతూ వచ్చి తడబడుతున్న మాటలతో ఆమెతో ఇలా అన్నాడు: "మీతో ఒక సంగతి చెప్పాలి. వింటారా?"

ఎమరాల్డా చెప్పమన్నట్లు సంజ్ఞ చేసింది. క్వాసిమోడో గాఢంగా నిట్టూర్చాడు. మాట్లాడ్డాని కుపక్రమించి ఆమె ముఖంవంక చూశాడు. చూసి తల అడ్డంగా తిప్పాడు. తల వంచుకుని మాట్లాడకుండానే వెళ్ళిపోయాడు. ఎమరాల్డా చకితురాలైంది.

ఆమె గది కెదురుగా ఒక శిల్పం ఉంది. అదేదో మృగానికి చెందిన తల ఆకృతిలో చెక్కబడింది. ఆ శిల్పంవంక చూసి క్వాసిమోడో అప్పుడప్పుడు ఏదో గొణగడం ఎమరాల్డా చూసేది. "అయ్యో! నేనుకూడా నీమాదిరిగా రాయినైనా కాలేపోయాను!" అని ఒకరోజు అనుకుంటూ అతడు నిట్టూర్పు విడవడం గమనించింది.

ఒక రోజున ఎమరాల్డా గోపురం క్రింది మిద్దెమీదికివెళ్లి పిట్టగోడవద్ద నిలబడి వీధిలోకి చూసింది. క్వాసిమోడో ఆమె వెనకనే నిలబడ్డాడు. ఉన్నట్టుండి ఎమరాల్డా కంపించిపోయింది. ఆమె ముఖంలో ఆనందం వెల్లివిరిసింది. మోకాళ్లపై కూర్చుని ఎదురుగానున్న భవనంవైపు ప్రార్థనాపూర్వకంగా చేతులు చాపింది. "ఫీబస్! ఒక్కసారి రా! ఒక్కమాట చెప్పాలి నీకు. ఒక్కసారి రా ఫీబస్! ఫీబస్!" అని బిగ్గరగా పిలువ నారంభించింది. ఆమె కంఠం, ఆమె ముఖం, వైఖరి, శరీరవిన్యాసం గమనిస్తే ఓడవిరిగి సముద్రమధ్యంలోనుంచి ప్రాణరక్షణకోసం ప్రార్థిస్తున్నదా అన్నట్లుంది.

క్వాసిమోడో ముందుకువంగి ఆమెదృష్టి ఎక్కడున్నదో చూశాడు. వీధిలో భవనముందునుంచి గుర్రంపై స్వారిచేస్తూ భవనంపై బాల్కనీలో నిలబడిన ఒక యువతికి అభివాదం చేస్తున్న ఒక కెప్టెన్ కనపడ్డాడు కాని ఎమరాల్డా పిలుపు వినలేనంత దూరంలో ఉన్నాడు కెప్టెన్.

క్వాసిమోడోకి అది అర్థమయింది. గాఢనిశ్వాసం విడిచి వెనక్కు తిరిగాడు. అతని కన్నువెంట నీరు ధారగా కార నారంభించింది. రెండు చేతుల పిడికిళ్ళు బిగించి తల మోదుకున్నాడు. జుట్టు పీక్కున్నాడు. ఎమరాల్డా అతన్ని గమనించలేదు. "దరిద్రుడా! ఉంటే అలా ఉండాలి పై ఆకారం అంత అందంగా ఉంటే చాలు. ఇంకేమీ అక్కర్లేదు" అని తనను తాను నిందించుకున్నాడు క్వాసిమోడో.

ఎమరాల్డా దృష్టి ఫీబస్‌పైనే ఉంది "అదుగో! గుర్రం దిగుతున్నాడు. ఆ యింట్లోకి వెడుతున్నాడు. ఫీబస్! ఫీబస్! అయ్యో! నా పిలుపు వినిపించుకోడంలేదు నేను పిలుస్తున్నప్పుడే అది ఆయనతో మాట్లాడాలా! అయ్యో! ఫీబస్! ఫీబస్!" అంటూ ఆమె పొగిలిపడుతోంది.

క్వాసిమోడో ఆమెస్థితి గమనించాడు. కన్నుల నిండిన నీరు అణచుకుని ఆమెవద్దకు వచ్చాడు. మెల్లిగా ఆమె దుస్తులు పట్టుకులాగి పిలిచాడు. ఆమె వెనక్కు తిరిగిచూసింది. "నేను వెళ్లి అతన్ని తీసుకురానా?" అన్నాడు.

ఆమె ఆనందానికి అంతులేదు. "నిజం? వెళ్ళు వెళ్ళు! పరుగెత్తు! త్వరగా! ఆ కెప్టెన్! ఆయన్నిక్కడికి తీసుకురా! నీ మేలు ఎప్పుడూ మరిచిపోను. నిన్ను ఆదరిస్తాను. వెళ్లు" అంటూ ఉద్రేకంలో ఆమె అతని మోకాళ్ళను పట్టుకుంది. విచారంతో అతడు తలూపాడు.

"నేను వెళ్ళి అతన్ని తీసుకొస్తాను" అన్నాడు మెల్లిగా. తరవాత వెనక్కి తిరిగి పొంగివస్తున్న ఏడు పాపుకుంటూ గబగబా మెట్లు దిగాడు.

క్వాసిమోడో వీధిలోకి వెళ్లేసరికి అక్కడ భవనముందు గుర్రం తప్ప మరేమీ కనపడలేదు. అక్కడ నిలబడి అతడు చర్చివంక చూశాడు. అక్కడే అదేవిధంగా మోకాళ్ళపై వంగిచూస్తున్న ఎమరాల్డా కనపడింది. ఆమెవంక చూస్తూ క్వాసిమోడో తల అడ్డంగాతిప్పి "ప్రయోజనం లేద"న్నట్లు సంజ్ఞచేశాడు. అక్కడే ఒక స్తంభానికి చేరబడి నిలబడ్డాడు.

ఆ భవనంలో వివాహానికి ముందు జరిగే విందే అప్పుడు జరుగుతోంది. భవనంలోకి చాలామంది వెడుతున్నారే కాని ఎవరూ తిరిగి రావడం లేదు. భవనద్వారం వంకా చర్చి పైన ఎమరాల్డా వంకా చూస్తూ నిలబడ్డాడు క్వాసిమోడో. ఒక పరిచారకుడు వచ్చి గుర్రాన్ని విప్పి శాలకు తీసుకు పోయాడు. సంధ్యపడుతుంది

క్వాసిమోడో కదల్లేదు. చర్చిమిద్దెపై పిట్టగోడవద్దనుంచి ఎమరాల్డా కదల్లేదు. రోజంతా ఈవిధంగా గడిచింది.

రాత్రయింది వెన్నెలలేని చీకటిరాత్రి. క్వాసిమోడో ఎమరాల్డాపైనే దృష్టినిగిడ్చి స్తంభానికానుకుని నిలబడే ఉన్నాడు. చీకటిలో ఛాయామాత్రంగా ఆమె తెల్లని దుస్తులు కనపడుతున్నాయి. భవనంపై కిటికీలలో దీపాలు వెలిగాయి. రాత్రి చాలసేపు గడిచిన తరవాత ఆ దీపాలు క్రమంగా ఆరిపోయాయి. అయినా కెప్టెన్ రాలేదు. అంతటా చిమ్మచీకటి వ్యాపించింది. భవనంపై ఒక్క కిటికీలోమాత్రం దీపం అర్థరాత్రి దాటినా వెలుగుతూనే ఉంది. రంగురంగుల అద్దాల తలుపులవెనుక నాట్యమాడుతున్న నీడల్ని గమనిస్తున్నాడు క్వాసిమోడో. నగరం సద్దుమణిగిన కొద్దీ భవనంలోనుంచి విందుసంరంభం, హర్షధ్వానాలు వినవస్తూనే ఉన్నాయి. కాని అతడికవేవీ వినపడవు.

ఒంటిగంటవేళకు విందు ముగిసింది. క్వాసిమోడో చీకటిలో నిలబడి అతిథులందరూ వెళ్ళిపోవడం గమనించాడు. కాని కెప్టెన్ మాత్రం రాలేదు. క్వాసిమోడోకి చింత కలిగింది. ఆకసంవంక తరుచుమూడ నారంభించాడు. బూజులల్లినట్లు మబ్బులు అక్కడక్కడ నక్షత్రాలను మరుగుపరుస్తున్నాయి.

బాల్కనీపైన తలుపులు తెరుచుకొన్నాయి. ఇద్దరు వ్యక్తులు బాల్కనీలోకి వచ్చి వెనుక తలుపులు మూసివేశారు. చీకటిలో కన్నులు పొడుచుకుని చూశాడు క్వాసిమోడో. వచ్చిన ఇద్దరిలో ఒకరు కెప్టెన్ అనీ రెండవ వ్యక్తి యువతి అనీ పోల్చాడు ఉదయం ఫీబస్‌ని ఆహ్వానించిన యువతి ఈమేనని గ్రహించాడు. బాల్కనీలో వెలుగులేదు. వారేది మాట్లాడినా అతడికి వినపడదు. అయినా నీడలవలె మసలుతున్న ఆ యిద్దరినీ గమనించాడు. ఎంత వికృతాకారుడైనా ప్రకృతి సహజమైన భావాలు, ఉద్రేకాలు అతనిలో మృగ్యమైపోలేదు. అతనికీ దృశ్యం దుస్సహమైంది. తన దురదృష్టాన్ని గుర్తుకు తెచ్చుకున్నాడు. వనిత, మోహం, ప్రేమ అనే వస్తువు లతనికి ప్రాప్తించేవి కావు వానిని దూరంనుండి గమనించడం మాత్రమే అతనికి మిగిలింది. ఇంతేకాదు. దూరాన చర్చిపైనుండి గమనిస్తున్న ఎమరాల్డా కిక్కడి దృశ్యం ఎంత వ్యథ కలిగిస్తుందో ఊహించుకుని విచారించాడు.

ఉన్నట్టుండి బాల్కనీ తలుపులు తెరుచుకున్నాయి ప్రియులపైన వెలుగుపడింది. లోపలినుంచి వయసు మళ్లిన ఒక స్త్రీ వచ్చింది. యువతి కంగారుపడింది. ముగ్గురూ లోపలికి వెళ్లారు.

తరువాత క్షణంలో భవనద్వారంవద్ద గుర్రపు సకిలింపు వినవచ్చింది. కెప్టెన్ గబగబవచ్చి గుర్రం ఎక్కాడు. గుర్రం అడుగు వెయ్యకముందే క్వాసిమోడో వెంబడించాడు. "కెప్టెన్! కెప్టెన్!" అంటూ పిలిచాడు.

కెప్టెన్ గుర్రాన్ని ఆపి చీకటిలో వెనక్కు చూశాడు. క్వాసిమోడోని గుర్తుపట్టాడు! "నాతో నీకేంపనిరా!" అన్నాడు.

క్వాసిమోడో దగ్గరికి వచ్చి గుర్రం మెడపట్టీ పట్టుకున్నాడు: "నాతో రండి కెప్టెన్. ఒకరు మీతో మాట్లాడాలంటున్నారు. రండి."

"వొదులు. గుర్రాన్ని వొదులు ముందు." అన్నాడు కోపంతో "ఏమిటి నీ ఉద్దేశం? ఇదేం కొరత కొయ్యనుకుంటున్నావా? వొదులు"

క్వాసిమోడో గుర్రాన్ని వొదిలిపెట్టలేదుసరికదా పక్కకి తిప్పి నడిపించాలని చూశాడు. "రండి కెప్టెన్! ఆమె మీకోసం చూస్తోంది. మిమ్మల్ని ప్రేమించింది." అన్నాడు.

"అయితే! నన్ను ప్రేమించే ఆడవాళ్లందరిదగ్గిరకీ వెళ్ళాలనా నీ ఉద్దేశం? -ఆవిడెవరు? నీలాగే ఉంటుందా గుడ్లగూబలాగ? ఆవిడతో చెప్పు. నేను పెళ్ళిచేసుకుంటున్నాను, దిక్కున్నచోట చెప్పుకోమను."

"నామాట వినండి కెప్టెన్! ఆమె జిప్సీ. మీకామె తెలుసు."

"ఎవరు? జిప్సీ?" అంటూ ఫీబస్ తటాలున కత్తిపైన చెయ్యివేశాడు. ఫీబస్ భయంతో కంపించిపోయాడు. ఎమరాల్డాకు ప్రాయశ్చిత్తం చేస్తున్నసమయంలో ఆమెను చూడలేక ఫీబస్ బాల్కనీనుంచి లోపలికి వెళ్ళిపోయాడు. ఆమెను క్వాసిమోడో తప్పించినట్లు వఘువు చూసిందికాని ఆసంగతి ఫీబస్‌తో చెప్పడం అనవసరం అనుకుంది. అందువల్ల జిప్సీసుందరి చనిపోయిందనే ఫీబస్ భావించాడు. అప్పటినుంచీ చర్చి ప్రాంగణంవంక చూడ్డం అతనికి భయం. ఇప్పుడీ చీకటిలో వికృతరూపుడయినవాడు వచ్చి జిప్సీసంగతి చెప్పగానే ఫీబస్‌కి నిజంగానే భయం కలిగింది. భూతాన్ని చూస్తున్నట్లు జంకిపోయాడు.

"రండి! త్వరగా రండి" అన్నాడు క్వాసిమోడో. "ఈ దారిని రండి".

ఫీబస్ కొరడాతీసి అతని చేతిమీద ఛెళ్లున కొట్టాడు. క్వాసిమోడో కన్నులలో మంట లెగశాయి. కెప్టెన్ పైకి ఉరకడానికి సిద్ధమైనాడు. కాని అంతలోనే నిగ్రహించుకున్నాడు. మిమ్మల్ని ప్రేమించడానికి ఇంకొకరున్నారుకదా! అదృష్టవంతులు సరే వెళ్లండి." అంటూ గుర్రాన్ని విడిచిపెట్టాడు.

ఫీబస్ గుర్రాన్ని అదిలించి క్షణంలో మాయమైనాడు. క్వాసిమోడో నిలబడి అతనివంక విచారంతో చూశాడు. "ఆహా! ఈ చిన్నపనికూడా చెయ్యలేరు!" అనుకున్నాడు.

క్వాసిమోడో చర్చికి తిరిగి వచ్చాడు. తన దీపం వెలిగించి గోపురం ఎక్కాడు. ఎమరాల్డా అక్కడే పిట్టగోడవద్దనే ఉంది. అతన్ని చూడగానే ఒక్కపరుగున అతన్ని చేరుకుంది. చూసి నిరుత్సాహపడి "ఒంటరిగానే వచ్చావా?" అంది. ఆశాభంగం కలిగిందామెకు.

"అతన్ని కలుసుకోలేకపోయాను"అన్నాడు క్వాసిమోడో.

"రాత్రంతా అతనికోసం కాసుకుని ఉండవలసింది" అంది ఎమరాల్డా. ఆమె అసంతృప్తిని ఆమె ముఖంలో చూశాడు క్వాసిమోడో. ఆమె అభిప్రాయం గ్రహించాడు.

"ఈమాటు జాగ్రత్తగా కనిపెట్టి చూస్తాను" అంటూ తల వంచుకున్నాడు.

"పో! వెళ్ళిపో!" అని అరిచిందామె.


అతడు వెళ్ళిపోయాడు. ఆమెకు అసంతృప్తి కలిగిందని తెలుసుకున్నాడు. తన నామె అవమానించినా భరించగలడు కాని ఆమె బాధపడితే అతడు ఓర్చలేడు.

ఆరోజు మొదలు క్వాసిమోడో ఆమెను చూడ్డం మానివేశాడు. ఎక్కడో దూరంగా గోపురంపైన కూర్చుని తన గదివంక చూడ్డం మాత్రం ఎమరాల్డా గమనించేది. ఆమె తన ఉనికి కనిపెట్టిందని తెలియగానే అక్కడనుంచి తప్పుకునేవాడు.

క్వాసిమోడో తన దృష్టిని పడకుండా తప్పించుకుంటున్నందుకు ఆమెకు నిజానికి చింతకలగలేదు. లోలోపల ఆమెకు సంతోషమే కలిగింది. క్వాసిమోడో ఇది స్పష్టంగా గ్రహించాడు; ఈ విషయమై క్వాసిమోడో భ్రమపడలేదు.

ఆమె అతణ్ని చూడకపోయినా అతడి ఉనికి ఆమెకి తెలియవస్తూనే ఉంది. ఎవరో ఒక పుణ్యపురుషుడు అనునిత్యం తనను కాపాడుతున్నట్టు తోచిందామెకు. ఆమె నిద్రలేవకముందే ఆమె వద్దకు ఆహారం వచ్చిఉండేది. ఒకరోజు ఉదయం ఆమె కిటికీ కిటికీలో పక్షులున్న పంజరం ఒకటి కనబడింది. [illegible]

(43-వ పేజీ చూడండి)



సౌందర నందం



జీవన చైతన్యం

—నామగిరి అమ్మాళ్




యాత్రికుడు

దక్షిణ భారత చిత్రకారుల ప్రదర్శనం




—జి. వి. సుబ్బారావు.



ఒంటరి కుటీరం

—యం. కృష్ణమూర్తి.



—అచంట జానకిరామ్.

బొమ్మరిల్లు

బొమ్మల పెళ్లి

శ్రీనివాస కాశ్యప

వస్తారా మీ రొస్తారా?
బొమ్మల పెళ్ళికి వస్తారా?!

రంగురంగులా బొమ్మలు దెచ్చీ
చక్కచక్కనీ దుస్తులు దొడిగీ
బొమ్మరింటిలో బొమ్మలపెళ్ళీ
ఎంతో చక్కగ చేస్తాము!

వస్తారా మీరొస్తారా?
బొమ్మల పెళ్లికి వస్తారా?!

రంగులపల్లకి తయారుచేసీ
వధూవరులనూ కూర్చోబెట్టీ
రంగరంగ వైభోగంగా
వీధివీధినా వూరేగిస్తాం!

వస్తారా మీ రొస్తారా?
బొమ్మల పెళ్లికి వస్తారా?!

పేరంటానికి సాయంకాలం
పాపలందరూ వస్తారా?
తియ్యతియ్యనీ మిఠాయి లెన్నో
తెచ్చామూ మీ కిస్తామూ!!

వస్తారా మీ రొస్తారా?
బొమ్మలపెళ్లికి వస్తారా?!

పెళ్లికూతురిని పెళ్లికొడుకునీ
బంతులాటలూ ఆడిస్తాం!–
వేడుకలెన్నో చేస్తామూ
పాటకచేరీ పెట్టిస్తాం!!

వస్తారా మీరొస్తారా?.
బొమ్మల పెళ్ళికి వస్తారా?!

పెత్తనం

'ఆర్థర్'రాజు పరిపాలిస్తూవుండే రోజుల్లో యక్షిణీదేవతలు అతని రాజ్యమునందు సంచరిస్తూండేవారు. ఆ యక్షిణీదేవతలు వాళ్ల 'రాణి'తోకలిసి నృత్యములు చేస్తూ పచ్చని మైదానాలలో విహరిస్తూ వుండేవారు.

'ఆర్థర్'రాజు ఆస్థానంలో ఒక యోధుడుండేవాడు. అతడు శాసనోల్లంఘన చేయటంచేత అతనికి చట్టప్రకారం ఉరిశిక్షవిధింపబడింది. ఆ నిర్ణయం ప్రకారం ఆయోధుడు ఉరి తీయబడవలసినవాడే! కాని రాజుగారి భార్య "అతనియందు దయచూపి క్షమించి విడిచిపెట్టవలసినద"ని రాజుగారిని ప్రార్థించింది. ఆమె సఖిజనంకూడ రాజుగారిని బ్రతిమిలాడారు. రాజుగారు వారి ప్రార్థనలను అంగీకరించి ఆ శిక్ష తప్పించాడు కాని ఆయోధుడి ప్రాణాన్ని రక్షించటమో లేక భక్షించటమో రాణీగారి అనుగ్రహానికి వదిలేశాడు అందుకు రాణి రాజును అభినందించింది. తరువాత ఆయోధుడికోసం రాణి కబురు పంపింది.

రాణి ఆజ్ఞప్రకారం యోధుడు వచ్చాడు. యోధుణ్ని చూచి రాణి "నీప్రాణాలు యింకా అపాయస్థితిలోనే వున్నాయి. కాని నేను వేసిన ప్రశ్నకు నీవు సరియయిన జవాబు యిచ్చినట్లయితే, నీకు ప్రాణభిక్ష పెట్టాను" అని చెప్పింది. యోధుడు దానికి సమ్మతించాడు.

"అయితే నాప్రశ్న విను"అంది రాణి.

"సెలవియ్యండి" అన్నాడు యోధుడు వినయంగా.

"స్త్రీలకు అత్యంత ప్రియమైనదేమిటి?" ఇది నాప్రశ్న నీవు ఇప్పుడు జవాబు ఇవ్వలేకపోతే, నీకు ఒక సంవత్సరం, ఒకరోజు గడువు ఇస్తున్నాను. ఆ గడువు

మూలం :

ఛాసర్

అనువాదం:

ఎం. వెంకట్రావు

లోగా నీవు నాప్రశ్నకు సరియైన సమాధానం యివ్వాలి. సమాధానం ఇవ్వలేకపోతే నీకు శిరచ్ఛేదం తప్పదు."గడువునాటికి తిరిగి వస్తానని వాగ్దానంచేయి"అని రాణీ అడిగింది. పాపం! రాణిమాటలు వినేసరికి యోధుడికి ముచ్చెమటలు పోశాయి. అతడు తన దురదృష్టానికి లోలోన దుఃఖించాడు. కాని ప్రాణాన్ని రక్షించుకోటానికి వేరొకమార్గం లేదు గనక, రాణి చెప్పినట్లు వాగ్దానం చేసి తన అదృష్టదేవతను వెదకటానికి బయలుదేరి వెళ్లాడు.

ఈ విధంగా బయలుదేరివెళ్ళిన ఆయోధుడు పల్లెనక, పట్టణమనక దేశమెల్లా తిరిగాడు. కనిపించిన ఆడవారినందరిని మీకత్యంతప్రియమైనదేమిటి ? అని అడిగేవాడు. కాని అందరూతలొక విధంగా పొసగని జవాబులు ఇచ్చేవారు. కొంతమంది"ధనం" అన్నారు. కొందరు "గౌరవం" అన్నారు. ఇలాగే "ఉల్లాసం"అనీ, 'ముఖస్తుతి' అనీ, 'స్వేచ్ఛ'అనీ, 'విలువైన వస్త్రాలు' అనీ చెప్పారు. కాని ఒక్కరిజవాబూ సరిగాలేదని అతడు చింతించాడు. గడువు దగ్గరపడినా అతనికి సమాధానం దొరకలేదు. సరైన సమాధానం చెప్పలేకపోయినా, అన్నమాట పాలించాలని యింటిదారి పట్టాడు అతడు అరణ్యమార్గాన పోవలసివచ్చింది అరణ్యమధ్యంలో ఒకచోట యక్షిణీదేవతలు నృత్యం చేస్తున్నారు. దారినే పోతున్న యోధుడు వాళ్ళను చూచాడు. వాళ్ళయినా తన ప్రశ్నకు ప్రత్యుత్తర మివ్వగలరేమో అనే ఆశ అంకురించింది అతనికి. వెంటనే అశ్వాన్ని వడిగా అదిలించాడు. కాని అతడు అక్కడికి చేరేసరికి అతని ఆశాకుసుమం అంతరించి పోయింది. అతన్నిచూచి యక్షిణీ దేవతలు అంతర్ధానమయ్యారు. నిరాశా నిస్పృహాలు పెనగొనగా తనకర్మను నిందించుకుంటూ ఉండగా అతనికి ఒక అనాకారిమైన ముసలిఅవ్వ కనిపించింది. ఆ అవ్వ యోధుడిదగ్గరకు వచ్చి "ఏంనాయనా! దారీ తెన్నూ

★ పెత్తనం ★

లేనిచోట దిగాలుపడి నిలుచు న్నావు? ఏదైనా పోయిందా? చెప్పునాయనా. ఫరవాలేదు. మా వంటి ముసలివారికి చాలా విషయాలు తెలిసివుంటవి." అని ఆదరంతో అడిగింది.

యోధుడు ఆనందించి "అవ్వా! నీవుచాలామంచిదానివిలావున్నావు. 'ఆడవాళ్ల కత్యంతప్రియమైన దేదో తెలుసుకొని రాణిగారికి చెప్పలేక పోతే నా తల ఎగిరిపోతుంది నీకు నాయందు ఏమాత్రం దయా దాక్షిణ్యాలున్నా నాకు సరైన సమాధానం చెప్పు. నాప్రాణాలు రక్షించావంటే నిన్ను గొప్పగా సత్కరిస్తాను. నీమేలు మరువను" అని ప్రాధేయపడ్డాడు.

అవ్వ చిరునవ్వుతో "దానికేం నాయనా! నీప్రాణాలు రక్షించే బాధ్యత నాది. కాని నాకొక చిన్న కోరిక వుంది. అది నీవు చేయగలవు. అట్లా చేస్తానని నీవు వాగ్దానం చేస్తే, సాయంత్రంలోగా నీ ప్రశ్నకు సరియైన సమాధానం చెప్పి నీప్రాణాల్ని కాపాడుతాను" అని అతనివంక చూచింది.

యోధుడు సంతోషంతో "భగవంతుని సాక్షిగా నీకు మాట ఇస్తున్నాను" అని వాగ్దానం చేశాడు.

"ఇంక నీ ప్రాణాలు కాపాడటం నావంతు. నేను నీకు చెప్పబోయే జవాబు రాణి, ఆమె సఖిజనాన్ని కూడా ఇదే సరియైన సమాధానం అని సమ్మతింపచేయగలదు. ఇంక ఆలస్య మెందుకు? వెళదాం పద" అని అవ్వ అతనితో పాటు గుర్రం మీద ఎక్కి పోనిమ్మంది. దారిలో ఆ అవ్వ యోధునకు సమాధానం చిన్నగా చెవిలో వూదింది. సహృదయంతో సంచరించాలని సలహా యిచ్చింది అతనికి.

రాణీగారి మందిరానికి వెళ్లాడు యోధుడు. రాణీకి నమస్కారం చేసి "మీరిచ్చిన గడువు నేటితో పూర్తయింది. వాగ్దానం చేసిన ప్రకారం తిరిగి వచ్చాను. సభ యేర్పాటు చేయించండి. ఆసభలో మీ ప్రశ్నకు సరియైన సమాధానం యిస్తాను" అని మనవిచేశాడు.

పెద్ద సభ ఏర్పాటు చేయబడింది రాణీ సభ మధ్యలో రత్నఖచిత సింహాసనంమీద ఆసీనురాలయింది. ఆమె సఖిజనం, అంతఃపుర స్త్రీలు, ఇంకా అనేకమంది మహిళలు ఆ సభకు వచ్చారు. యోధుడు రాణీ ప్రశ్నకు ఎటువంటి సమాధానం యివ్వనున్నాడో వినవలెనని వారెంతో కుతూహల పడుతున్నారు. అప్పుడు రాణి యోధుడ్ని పిలిపించింది. అతడు సభలో ప్రవేశించేసరికి సభ అంతా నిశ్శబ్దంగా ఉంది. నిశ్శబ్దాన్ని చీల్చుకొంటూ రాణీ "స్త్రీలకు అత్యంత ప్రియమైన దేది? సరియైన సమాధాన మియ్యి. లేకపోతే నీ తల తెగిపోతుంది" అని హెచ్చరించింది.

యోధుడు ఉత్సాహంతో "మహారాణీ! స్త్రీలు ఎక్కువగా ప్రేమించేది 'అధికారం'. ఎక్కువగా కాంక్షించేది అధికారం చలాయించటం. అది భర్తలమీద కావచ్చు లేక ప్రియులమీద కావచ్చు. మీరు నన్ను శిక్షించినా, రక్షించినా ఆ ప్రశ్నకు అదే సరియైన సమాధానం. ఇక మీ అనుజ్ఞకు బద్ధుడ్ని" అని జవాబిచ్చాడు.

సభ అంతా నిశ్శబ్దంగా వుంది. అతడి సమాధానం "తప్పు" అని చెప్పటానికి ఎవ్వరూ సాహసించలేదు. సరియైన సమాధానం చెప్పి ప్రాణాల్ని రక్షించుకొన్నాడని అక్కడ చేరిన ఆడవారంతా అతడ్ని అభినందించారు. ఇంతలో వెలుపల ఒక పచ్చికమైదానంలో కూర్చున్న అవ్వ మెల్లగా లేచి సభలోనికి ప్రవేశించింది.

అట్లా వచ్చి అవ్వ రాణీకి నమస్కారం చేసి ఇలాఅంది "మహారాణీ! అనుగ్రహించాలి. మీ ప్రశ్నకు సరియైన సమాధానం ఇతనికి చెప్పింది నేను. దానికి ప్రత్యుపకారంగా నేనడిగింది చేస్తానని యితడు వాగ్దానం చేశాడు నాకు. కనుక మీ అందరి సమక్షంలో అతడు చేయవలసిన పని చెప్తున్నా. అదేమంటే, అతడు నన్ను పెండ్లి చేసుకోవాలి. అతనికి భార్యనుకావటమే నేను కాంక్షించేది. ఇందుకు అతడు అంగీకరించకపోతే వాగ్దానం చేయలేదని చెప్పమనండి."

యోధునికి ఆశ్చర్యం కలిగింది. "అవ్వా! నీకు నేను మాట ఇచ్చిన విషయం నిజమే! కాదనను. కాని యీ కోరిక తప్ప మరేదైనా కోరుకో. లేకపోతే నా ఆస్తిపాస్తులను ఆక్రమించుకో. కాని నన్ను మాత్రం స్వేచ్ఛగా పోనియ్యి" అని ఎంతగానో ప్రార్థించాడు అవ్వను.

కాని ఆ మంత్రగత్తె అందుకు అంగీకరించలా. ఆ అవ్వ యోధుడితో "వయస్సుమీరిపోయి, బీదతనంతో క్రుంగిపోతూ, అనాకారినైన నేను నీ ప్రేమభిక్ష అర్థిస్తున్నాను. ఈ ప్రపంచమందున్న బంగారాన్నంతా తీసికొనివచ్చి నా కాళ్ళ ముందుంచినాసరే నాకు అక్కరలేదు. నేను కాంక్షించేది నీకు భార్యను కావటమే!" అని మునలిపట్టు పట్టింది.

అదృష్టవంతుడ్ని చెడగొట్టేవాడు లేడు, దురదృష్టవంతుడ్ని బాగుచేసేవాడు లేడు. అట్లానే యోధుడి పరిస్థితి. చివరికి అతడు ఆ ముసలిమంత్రగత్తెను "సీ మొఖానికి ప్రేమ కావలసి వచ్చిందా? నీ పేరాశకు పశ్చాత్తాపపడేటట్లు తగిన శాస్తి కావాలి. నీవల్ల నా వంశం పేరు ప్రతిష్టలూ, గౌరవ మర్యాదలూ మంటగలసిపోయేటట్లున్నాయి" అని అసహ్యించుకుంటూ ఆమెను దూషించాడు.

కాని ఫలితంమాత్రం శూన్యం. ఆ యోధుడు ముసలి మంత్రగత్తెను పెండ్లి చేసుకోవలసిందేనని సభవారంతాఏకగ్రీవంగా ఆమోదించారు. దాంతో 'మూలిగే నక్కపై తాటికాయ పడ్డ'ట్లయింది యోధునిపని.

వారి పెండ్లి సందర్భంలో విందులుగాని, వినోదాలుగాని లేవు. విచారం, ఏదో తెలియని బాధ అందరినీ ఆవహించినాయి. సాధ్యమైనంతవరకు ఎవ్వరికీ తెలియకుండనే పెండ్లి జరిగిపోయింది. పెండ్లి అయిపోయినతరువాత అతడు మాత్రం గుడ్లగూబవలె బయటికి రావటానికే భయపడుతుండేవాడు.

ఒక రాత్రి ఏకాంతసమయంలో ముసలి భార్య ముద్దులమగనిదగ్గరకు వెళ్ళింది. ఆమె రాక చూచి అతడు యింకోవైపుకు వెళ్ళసాగాడు. ఆమె ఎదురుగావచ్చి నిలబడి "ఆర్థర్ ఆస్థానంలో వుండే యోధులకు భార్యలను చూచి అసహ్యించుకోవటం ఆచారమా ఏమిటి? వారంత కఠిన హృదయులా? నేను మీ ప్రేయసిని, మీ

★ వైతస్త్రం ★

భార్యను. నేను మీకు ప్రాణభిక్ష పెట్టాను. మీరు నాకు ప్రేమభిక్ష ప్రసాదించారు. అంతే. నేను మీకెట్టి హాని కలుగజేయలేదే? మరి నేనంటే మీకింత అసహ్యం దేనికి? నేను చేసిన అపరాధం ఏమిటి? నేను చేసిన తప్పులను చెప్పితే సవరించుకుంటాను" అని ప్రార్థేయపడింది. కాని అతడు పరిహసించి ఇలా అన్నాడు : "తప్పులను సరిదిద్దుకుంటావా? అనామకురాలుగా జన్మించావు. బీదతనంలో బ్రతుకుతున్నావు. పైగా వయస్సు వుడిగిపోయింది. ఈ మూడు తప్పులు ఎలా సరిదిద్దుకుంటావు? ఇటువంటి లక్షణాలుగలదానిని అర్ధాంగిగా స్వీకరించిన నేను ఆవేదనతో అహర్నిశలు అలమటిస్తున్నానంటే ఆశ్చర్యమేముంది?"

దానికి ఆమె "మీ విచారానికి కారణం అదేనంటారా?" అని అడిగింది.

"అవును. అందులో ఆశ్చర్యమేముంది?"

"నేను తలచుకుంటే మీ ఆవేదనంతట్నీ అరనిమిషంలో అంతర్ధానం చేయగలను. మీరు నాతో మాత్రం గౌరవంతో సంచరించాలి" అని చెప్పి, తనకు భర్త అంటగట్టిన తప్పులను ఒప్పులుగా చూపి చెప్పటానికి మొదలుపెట్టింది. "మీరు నాకు మూడు తప్పులు అంటగట్టారు. నేను అనామకురాలనని అన్నారు. దానికి నేను కాదనను కాని శాంతము మొదలైన సత్వగుణాలు ఒక్క గొప్పవంశంలో పుట్టిన వారికే అలవడుతాయని మీరు అభిప్రాయపడుతున్నారు. అందువల్ల గొప్ప వంశంలో పుట్టిన వారంతా సాధుశీలురై వుంటారని మీ నమ్మక మనుకుంటాను. మీ అవివేకమ్మే అట్టి అహంభావానికి కారణం అయివుంటుంది. ఎవరు సుగుణసంపన్నులో, ఎవరు ధర్మకార్యాలను చేస్తారో వారే గౌరవమర్యాదలు పొందగలరు. మన పూర్వుల ఆస్తిపాస్తులు మనకు చెందవచ్చు; అంతమాత్రాన వారు చేసిన ధర్మకార్యాలు, వారు పొందిన గౌరవమర్యాదలు కూడా మనకు వస్తవి అనటం చెట్టు పేరు చెప్పుకొని కాయలు అమ్మటంలాగా వుంటుంది. మన పూర్వులు ఆస్తిని వ్రాసి యివ్వగలరేగాని వారి సద్గుణాల్ని మనకు సంక్రమింపజేయలేరు. పరువుగల వంశములో పుట్టిన వారు ఎంతమందో పాడైపోవటం మనం చూస్తూనేఉన్నాం.

"కనుక నేనెంత అనామకురాలనైనప్పటికిని భగవంతుడు నాకు అమూల్యమైన సద్గుణాలు అలవరిచాడు. నేను మంచిపనులు చేస్తే నాకు మంచి పేరుప్రతిష్ఠలు కలుగగలవు.

"ఇక రెండవతప్పు. బీదతనాన్ని తీరని తప్పుగా నిర్ణయించారు మీరు. భగవంతుడు దరిద్రనారాయణుడు. అతడు భోగి కాడు; యోగి. తన కున్న దానితో సంతృప్తి పడేవాడు అందరికంటె భాగ్యవం

'తడుముకోకుండా వెంటనే అబద్ధమాడితేఅర్ధరూపాయిస్తా' అన్నాడొకడు.

'నాకు అబద్ధాలు ఆడడం చేతగాదు' అన్నాడు రెండవ వాడు.

మొదటివాడు అర్ధరూపాయి యిచ్చేసి మాట్లాడకుండా వెళ్లిపోయాడు.

—బలివాడ వెంకటరామరాయ్.

తుడు. అతడికి తినటానికి తగినంత తిండి లేకపోవచ్చు, కట్టడానికి సరైన బట్టలు లేకపోవచ్చు, తల దాచుకోటానికి తగిన తావు లేకపోవచ్చు. అయినప్పటికిని అతడే భాగ్యవంతుడుగా ఎంచబడతాడు. కారణం అతనికి ఆత్మసంతృప్తి వుంది. దురాశాపరుడే దరిద్రుడు. అతనికి ఆత్మసంతృప్తి వుండదు! పేదరికం పరోక్షంగా పావనమైనట్టిది. అందువల్ల పేదదానినని చెప్పి నన్ను అగౌరవపరచడం అన్యాయం.

"నేను ముసలిదానినని చెప్పి మీరు అసహ్యించుకుంటున్నారు. మీవంటి యోధులంతా వయోవృద్ధులైన యోధుల్ని గౌరవిస్తారు; పూజిస్తారు. వాళ్ళను గౌరవించటమే మిమ్మల్ని మీరు గౌరవించుకోవటంగా ఎంచుకొంటారు. కాని నన్ను జూచి ఎందుకో అసహ్యించుకుంటున్నారు. ముసలిదానిని, అనాకారినైనప్పటికిని నేను చాల విశ్వాసపాత్రురాలను. నాకు క్షణికములగు సౌఖ్యములందు వినోదాలయందు అంత ఆసక్తి లేదు. అందువల్ల నీకు అన్ని విషయాలలో శాయశక్తుల సహాయం చేయగలను." అని చెప్పి ముగించింది.

ఇంతసేపు అతడు ఆమెవైపు చూడనైనా చూడలేదు. ఆమెకు విసుగు, ఆగ్రహం కలిగింది. చివరికి ఆమె "మీకు రెండు విషయాలు చెప్తాను. అనాకారిగానే వుండి మీరు చెప్పినట్లు సేవ చేస్తాను. లేదా అపరూప సౌందర్య విలాసినినై నా యిష్టం వచ్చినట్లు సంచరిస్తాను. కనుక యీ రెంటిలో మీకేది యిష్టమో చెప్పండి" అని రుసరుసలాడింది.

ఆ యోధుడు ఆలోచించాడు. కాని ఆ రెంటిలో అనువైన దొకటీ అగుపించలేదు. చివరికిలా అన్నాడు: "నా జీవితాన్ని నీ చేతుల్లో పెట్టాను! మన యిద్దరికీ గౌరవమైనటువంటి, ఆనందాన్ని కల్గించేటటువంటి జీవితాన్ని నీవే ఏర్పరచు. నీ యిష్టమే నా యిష్టం. నీవు ఏది చేసినా సరే!" అని ఆమెకు చెప్పాడు.

"అయితే స్వాది పైచేయిగా వుండాలి. నేను చెప్పినట్లు మీరు వినాలి"

"అదే మంచిదనుకుంటాను."

ఆ మాటకు ఆమె ఎంతో సంతోషించింది. "మన మిద్దరం పోట్లాడుకోవద్దు. నేను అపురూప సుందరిగా మారతాను, ఈ భూప్రపంచంలో అందరికంటె భర్తను వినయ విధేయతలతో సేవించడంలోను, అందరికంటె అందంగా వుండటంలోనూ నేనే మిన్నగా వుండగలను. నావైపు తిరగండి" అని చెప్పి ఆమె అదృశ్యమైంది.

అతడు తన భార్య చెప్పిన మాటలు ఎంతవరకు సత్యమో అని ఆమె ప్రక్కకు తిరిగాడు. అతడు తన కళ్ళను తానే నమ్మలేకపోయాడు. ఆమె అందానికి ఆశ్చర్యపడ్డాడు. అటువంటి అపురూప సుందరిని అర్ధాంగిగా బడసినందులకు అతడు ఎంతగానో ఆనందించాడు. ఆనాటినుంచి వారిద్దరు అష్టైశ్వర్యాలతో హాయిగా కాలం గడప మొదలెట్టారు. ★



గోటదీయ పనికి గొడ్డలేల?

ఒకానొక పల్లెటూళ్లో ఒక రైతు నివసించేవాడు. అతడి పేరు రుద్రయ్య. సాలీనా పదైదు పుట్లు పండే మాగాణి పొలాలు, ఏటి కటూ, ఇటూ రెండు కొబ్బరి తోటలూ, పెద్ద చుట్టుభవంతి ఇల్లు, రెండుజతల దుక్కి టెడ్లు, నాలుగు గంగగోవులు, ఒక గొర్రెల మంద, ఇవీ అతడి స్థిరచరాస్థులు. పైగా కొండల్ని పిండిజేయడానికైనా సిద్ధంకాగల ముగ్గురు కుమారులున్నారతనికి! పెద్దవాడికి పెళ్ళయింది. రెండోవాడు పెళ్ళికిసిద్ధంగా వున్నాడు. మూడోవాడికి పన్నెండేళ్లు. రుద్రయ్య భార్య మంగమ్మ ఇటు పొదుపరితనంలోనూ, అటు పదిమందికి పెట్టిపోయడంలోనూ ఆ ప్రాంతంలో పేరెన్నికగన్న ఉత్తమ ఇల్లాలు. కొంచెం నోటి దురుసుతనమే గనుక లేకుండా వున్నట్లయితే ఆమెను 'అన్నపూర్ణ' అన్నా తప్పులేదు. ఆ కుటుంబానికి తగ్గట్టే, కలుపుతీయడం, వడ్లకుప్పను తూర్పారబట్టడం, పదాలు పాడడం మొదలైన కర్షకుల కళల్లో ఆకలుతీరిన కాపుపడుచు కనకమ్మ కోడలుగా ఇంట్లో ప్రవేశించింది. ఆ ఇంట్లో పనిచేయలేనివాడు, ఏడేళ్లుగా క్షయరోగంతో బాధపడుతూ మంచాన్ని ఆశ్రయించుకునివున్న రుద్రయ్యతండ్రి ఒక్కడే. రుద్రయ్య ప్రపంచంలో తన కిక కోరదగిన సౌఖ్యమే లేదన్నట్టు నిశ్చింతగా కాలం వెళ్ళబుచ్చేవాడు. ఆ ఇంట్లో ఎప్పుడూ ధాన్యలక్ష్మి దరహాసం చేస్తూవుండేది. కొబ్బరి తోటలపైన వచ్చే మాసూలు సంవత్సరమంతా ఖర్చుబెట్టినా తరిగేదికాదు. వాస్తవానికి రుద్రయ్య తన బ్రతుకునంతా ఒక తీయటి కలలా, ఒక శ్రావ్యగానంలా ఒక దివ్యప్రబంధంలా హాయిగా గడిపేసివుండవచ్చు కానీ మానవజీవితం ఒక ప్రవాహం

మూలం :

లియో టాల్‌స్టాయ్

అనుసరణ :

మధురాంతకం రాజారాం

లాటిది. దానికి ఒడుదుడుకులు సహజం!

ఉన్నట్టుండి రుద్రయ్యకు, అతని పొరుగింటివాడైన భీమయ్యకు ఏదో వివాదంవచ్చిపడ్డది. ఈ ఇంటిపైన కాకి, ఆ ఇంటిపైన వ్రాలితే కర్రలు, కత్తులు తీసుకుని రుద్రయ్య పుత్రసమేతుడై, భీమయ్య సపరివారుడై నడివీధిని కురుక్షేత్రంగా మార్చేంతవరకూ ఆ వివాదం విషమించింది. రుద్రయ్య తండ్రి కుటుంబ యజమానిగా వుండిన కాలంలో ఆ రెండు కుటుంబాలు ఎంతో అన్యోన్యంగా వుండినట్టు గ్రామస్థులు చెప్పుకుంటారు. ఆ మాట అక్షరాలా యథార్థమే. అప్పట్లో ఒకరింటి గేదె తప్పిదారి మరొకరి చిక్కుడుపాదులో పడినప్పటికీ, వాళ్లు మరేం ఆగ్రహపరవశులైపోక, ఆ గేదెని నెమ్మదిగా కొట్టానికి తోలి 'దాన్ని కొంచెం జాగ్రత్తగా కట్టుకోండి' అని మందలించేవాళ్లు. అంతేగానీ, ఆ గేదెని పెద్ద బాణాకర్రతో చిదకగొట్టి, దాన్ని సరిగ్గా అదుపులో వుంచుకోనివాళ్లపైన శాపనార్థాలు గుమ్మరించి ఒక పెద్దకొట్లాటజరిగే వరకూ ఆ సంఘటనని సాగదీసే వాళ్లు కారు.

కాలం మారిపోయింది. అప్పుడు చిన్న పిల్లలుగావుండిన వాళ్ళు పెద్దవాళ్లై గృహ యజమానులు కాగానే ఆ రెండు కుటుంబాల మధ్య స్పర్థలు పుట్టి, పెరిగి శీఘ్ర కాలంలో శృతిమీరిపోయినాయ్.

ఇంతకూ ఇదంతా నిష్కారణముగా ప్రారంభమైన వివాదం!

ఒకరోజు రుద్రయ్య కుటుంబం తాలూకు కోడిపెట్టొకటి ఎక్కడికో పరారైపోయింది. అందరూ దానికోసం ఊరంతా వెదికారు. వాళ్లు వెదకీ వెదకి వేసారిన తర్వాత అది భీమయ్య ఇంటి పెరటి నుంచీ మెల్లగా ఇవలికి వచ్చింది. తక్షణం కనకమ్మ భీమయ్య ఇంటికి వెళ్ళి "మా కోడి పదిరోజులుగా గ్రుడ్లు పెడుతోంది. ఈరోజు మీ పెరట్లో ఎక్కడైనా పెట్టివుంటుంది. కాస్త దాన్నలా తెచ్చి ఇవ్వండి"


అన్నది. ఎందుకోగానీ ఆ మాటలు భీమయ్య భార్యకు ఆగ్రహాన్ని కలిగించాయి ఆమె ఒక్క విసురుతో లేచివచ్చి" మీ కోడి ఇక్కడెందుకు గ్రుడ్లు పెడ్తుంది? ఐనా నువ్వెందుకో వృథాగా మమ్మల్ని ఆడిపోసుకుంటున్నావమ్మా. అదేం కాలానికోగానీ! మాకూ కోళ్ళున్నాయి. అవి పెట్టే గ్రుడ్లే మాకు చాలు. మేము ఒకరి సొత్తుకు ఆశించేవాళ్ళం కాము" అన్నది.

"ఐతే మేమా మరొకరిసొత్తుకు ఆశించేవాళ్లం?" అని కనకమ్మ మాటను సాగదీసింది.

ఆ తర్వాత ఆ ఆడవాళ్ళిద్దరూ అంతకు పూర్వం జరిగిన సంఘటనలన్నిటినీ నెమరకు దెచ్చుకుని, 'నువ్వు దొంగవు' అని ఒకరంటే 'నువ్వు గజదొంగవు' అని మరొకరు, 'నువ్వు చుప్పనాతివి' అని ఒకరంటే 'నువ్వు ముసలాడికి తిండి పెట్టకుండ చిత్రహింస చేస్తున్న రాకాసివి' అని మరొకరు, ఇలా వ్యవహారాన్ని మాంచి రసకందాయంలోకి తీసుకొచ్చేశారు.

ఇంతలో పొలంనుంచీ తిరిగి వచ్చిన మగవాళ్లు తమతమ ఆడవాళ్లకు అంగరక్షకులుగా, సాయుధులై రణరంగంలో ప్రవేశించారు. రుద్రయ్య భీమయ్యనొక్క తోపుతో క్రిందికితోసి, అతని జుట్టును గట్టిగా పట్టకొని వీపుపైన దుడ్డుకర్రతో ఒక వ్రేటిచ్చాడు. క్రిందపడిన భీమయ్య రెండు కాళ్ళతో రుద్రయ్యను రెండు పొర్లికలు వేసేట్టు తన్నాడు ఆడవాళ్లుకూడా శక్తివంచన లేకుండా ఒకరిపైన మరొకరుపడి చీరల్ను చింపుకుంటూ ముఖాల్నిగీర్కుంటూ, కొప్పుల్ని ఊడబెరుక్కుంటూ, మొత్తంమీద ప్రేక్షకులుగా అక్కడచేరిన గ్రామస్థులకు ఆడవాళ్లు కూడా కుస్తీ పట్టవచ్చునని నిరూపించారు. ఇంకా ఆ కుస్తీలను చూస్తూ ఊరుకోవడానికి ఓపిక లేకనేమో, గ్రామస్థులు ఆ రెండు ముఠాలకు మధ్య రెఫ్రీలుగా నిలిచి, నాగరికమైన కొట్లాట పద్ధతుల్ని గూడా అతిక్రమించి మోటుగా ఒకరి తలవెంట్రుకల్ని మరొకరు ఊడబెరుక్కున్నందుకు మందలించి ఎవరెవరిళ్లకు వాళ్లని పంపించేశారు.

ఇలా ప్రారంభమైంది కలహం! భీమయ్య తన భార్యకొప్పులో



★ గోటదీరుపనికి గొడ్డలేల? ★

నుంచీ ఊడిపోయిన వెంట్రుకల్ని ఒక కాయితంలో చుట్టి, దానితో బాటు ఒక అర్జీని జతచేసి కోర్టులో వ్యాజ్యం వేశాడు.

అర్జీలో అత డిలా వేడుకున్నాడు: "న్యాయాధిపా! నాభార్య శ్రమపడి దీర్ఘ శిరోజాలను పెంచుకున్నది. మల్లెలు, మొల్లలు, చేమంతులు మొదలైన పువ్వుల్ని వుంచుకోవడానికే గానీ, రుద్రయ్య భార్య యొక్క కోపావేశానికి ఆహుతై క్రింద రాలిపోవడానికి కాదు. నాకు న్యాయం కలగ జెయ్యండి."

భీమయ్య భార్య అలిమేలు తన భర్త పట్నంనుంచి తిరిగివచ్చిననాటి నుంచి "ఊళ్లో కాదు దౌర్జన్యాలు జరపడానికి! అయ్యగారికి సరైన శాస్తి జరుగుతుంది. రెండు మూడేళ్ళయినా కఠినశిక్ష తప్పదు" అని ప్రచారం చేసింది.

రుద్రయ్యకుటుంబంలో మంచం పైని ముసలివాడు తప్ప, మిగిలిన వాళ్ళందరూ భీమయ్యను సర్వ నాశనంచేసేందుకు మార్గాలు వెదుకసాగారు. వృద్ధుడు మాత్రం కొడుకులతోనూ, కోడలుతోనూ ఏదో వదరుతూనే వుండేవాడు: "ఎన్నేళ్లు వస్తేనేమి, మీకింకా కుర్రతనం పోలేదు. ఎందుకిర్రా అందరూ ఇలా తెట్టతేరకు అల్లరిపాలైపోవడం? కొంచెం ఆలోచించి చూడండి. ఇంత వివాదమూ ప్రారంభమయింది ఒక కానీకైనా కొఱగాని కోడిగ్రుడ్డును గురించి! ఇలాగే మీరు ఒకరిమీద మరొకరు కారాలు, మిరియాలు నూరుకోవడం కలకాలం సాగించితే కోడిగ్రుడ్డుతో ప్రారంభమైన కలహం కొంపల్ని ముంచుతుంది."

ఆ వయోవృద్ధుడి మాటల్ని ఎవరూ చెవిలో వేసుకోలేదు. మతిభ్రమించడంవల్లవాస్తవపరిస్థితుల్ని గుర్తించలేక ఏదో వదురుకుంటున్నాడనుకున్నారు. రుద్రయ్య కూడా బస్తీకి వెళ్లి ఆడవాళ్ళ తల వెంట్రుకల్ని పెరికివేయడంలో భీమయ్య భార్యకూడా సిద్ధహస్తురాలేననీ, కేసుని విచారించి ప్రతివాదులమీద తగుచర్య తీసుకోవలసిందనీ కోర్టులో ఫిర్యాదుచేసి వచ్చాడు. ఈవ్యవహారం జరుగుతూ వుండగానే ఒక రోజు భీమయ్య వీధిలో నిలిపివుండిన బండి తాలూకు కాడిమానొకటి మాయమైపోయింది. అలిమేలు రుద్రయ్య కొడుకే ఆ దొంగతనం చేసివుంటాడని, అనేక కల్పనలతో ధ్రువపరచింది. మళ్ళీ భీమయ్య పట్నానికి వెళ్లి మొదటికేసుకు అనుబంధంగా రెండోకేసును జతచేసి వచ్చాడు.

2

వివాదంలో రెండో ఘట్టం ప్రారంభమైంది. ఒక కుటుంబానికి చెందినవాళ్లు మరో ఇంటివాళ్ళ వస్తువుల్ని దొంగలించడమే అనుదినకృత్యంగా ఏర్పరచుకున్నారు. రుద్రయ్య తన భార్యకూ, కొడుకులకూ భీమయ్యఆస్థిలో దేన్ని దేన్ని సులభంగా కాజేయవచ్చునో, కాజేయడానికి అవలంబించవలసిన విధానాలేమిటో వివరించి చెప్పేవాడు. భీమయ్య కూడా దొంగతన మనే కళను అనేక పాఠాలుగా విభజించి, ప్రతి పాఠాన్ని సవివరంగా తన వారికి బోధించాడు. ప్రతిరోజూ వీళ్ళవి, వాళ్లవి కొన్ని వస్తువులు మాయమైపోవడంరివాజైపోయింది. ప్రతి వస్తువు మాయమైనప్పుడూ కోర్టుకుతిరగడం పరిపాటైపోయింది. జడ్జీకి ఈవివాదంవల్ల తల దిమ్మెక్కిపోయింది. అతడు నిష్పక్షపాతంగా ఒకప్పుడు భీమయ్యను మరొకప్పుడు రుద్రయ్యను జరిమానాలు వేసి, కారాగారవాసం విధించి శిక్షించాడు. ఆశిక్షలు కలహానికి మరింత ఉపకరించాయి. ఇలా ఆరేళ్ల దీర్ఘకాలం పొడుగునా ఈ కలహం దినదినాభివృద్ధి చెందింది.

మంచాన్ని ఆశ్రయించుకుని వున్న ముసలివాడొక్కడుమాత్రం ఈ జగడాల్ని అరికట్టాలనుకున్నాడు. కాని అతడి సదోద్బోధ బూడిదలో పోసిన పన్నీరైంది.

ఏడవ సంవత్సర ప్రారంభంలో ఊళ్లో ఒకరింట్లో పెళ్ళి జరిగింది. బంధులోకంసమక్షాన కనకమ్మ భీమయ్య చేసిన దురాగతాల్ని వల్లించి, అతడు చోరవృత్తితోనే జీవిస్తున్నట్టు నేరం ఆరోపించింది. చాటుగావుండి ఆమె మాటల్ని

ఒకడు: ఏమోయ్, ఇవాళ నడిచివస్తున్నావ్? బ్రేకూ, బెల్లూ, లైటూ లేని నీ సైకిలేమయింది?

రెండోవాడు: దాన్ని మా యింటిపక్కనే వున్న పోలీసాయనకి అమ్మేశాను.

(జి. వి. జి. కృష్ణ—మద్రాసు)

గిన్న భీమయ్య కోపం పట్టలేక ఈవలకి వచ్చి ఆమె వీపుపైన గుద్దుల వర్షాన్ని కురిపించాడు. అప్పుడు కనకమ్మ నిండు గర్భంతో వుంది. ఆమె దెబ్బలకు తాళలేక స్మారకం తప్పి కుప్పకూరలా నేలపైన పడిపోయింది. ఆమె దురవస్థని చూచి రుద్రయ్య సంతోషపరవశుడైపోయాడు!! ఈ కేసునుంచీ భీమయ్య గడచి గట్టెక్క లేడనీ, ఈ దఫా అతనికి పదేళ్ళ కఠిన శిక్షయినా పడడం నిస్సందేహమనీ మురిసిపోయాడు! కాని, పాపం అతనికి కోర్టులో నిరాశే ఎదురైంది. మేజస్ట్రేటు ఆ కేసును పూర్తిగా విశ్వసించ లేకపోయాడు. రుద్రయ్య వకీళ్లకు ఎంత ఫీజు గుప్పించినా, గుమాస్తాలకు ఎంత లంచం ధారబోసినా అంతా వృధా అయింది. భీమయ్యను ఇరవై లాటీ దెబ్బలతో మాత్రం సత్కరించవలసిందిగా తీర్పు చెప్పబడింది!

కోర్టులోనుంచీ బయటకువచ్చిన భీమయ్య ఇలా గొణుక్కోవడం రుద్రయ్య చెవులు నిక్కించి విన్నాడు: "కానీ కానీ! ఇక్కడ ఇరవై దెబ్బలతో నా వీపు మండుతుంది. కానీ అక్కడ వాడికొంపే మండకపోతుందా?"

తక్షణం రుద్రయ్య కోర్టులోనికి పరుగెత్తి భీమయ్య తన ఇంటికి నిప్పంటించబోతున్నట్టు బెదిరిస్తున్నాడని మేజస్ట్రేటుతో మనవి చేశాడు.

మేజస్ట్రేటు మళ్ళీ భీమయ్యను పిలిపించి "నువ్విలా అన్నావా?" అని ప్రశ్నించాడు.

"అచ్చో, నేను నోరే తెరువలేదు! నన్ను కొట్టండి! కొట్టే అధికారం మీ చేతిలోవుంది. మంచివాడికే గదా ఈ ప్రపంచంలో కష్టనష్టాలు! నేనైతే మీకు లోకువైపోయాను. వాడేం చేసినా మీరు పట్టించుకోవడం లేదు." అన్నాడు భీమయ్య.

మేజస్ట్రేటుగారికి ఈ రైతు బిడ్డరూ వ్యవహారాల్లోదిగి కొంప గుల్ల చేసుకోవడమేమీ నచ్చలేదు. ఎలాగైనా వాళ్ళకు రాజీ కుదిరించి, వాళ్ళ కాపురాలు నిలబెట్టాలనుకున్నాడాయన. పోరు నష్టమనీ, పొందు లాభమనీ వాళ్ళకు చెప్పి చూచాడు. కానీ వాళ్ళల్లో ఎవరుగానీ రాజీకి సుముఖులుగా లేరు.

మేజస్ట్రేటుగారి హితోపదేశమంతా శ్రద్ధగావిని భీమయ్య ఇలా అన్నాడు: "నాకిప్పుడేభై ఏళ్ళు. నాకు నలుగురైదుగురు కొడుకులున్నారు. వాళ్ళకు పెళ్ళిళ్లుచేశాను. గంజికి లేని సంసారానికి ఘరానాగా బ్రతికే వెసులుబాటు కలిగించాను. పదిమందిలో గౌరవంగా బ్రతికాను. ఎప్పుడూ కోర్టు మెట్లెక్క లాటీ దెబ్బలు తినలేదు. ఈ నాటికీ మహానుభావుడు నన్నీగతికి తీసుకొచ్చాడు. ఆయనగారితోనా నాకు రాజీ! వద్దు వద్దు. వాడితో రాజీకి దిగడంకన్నా గంగలో దూకి చస్తాను"

భీమయ్య తర్వాత మాట్లాడలేకపోయాడు. అతడి కంఠం గద్గదికమైపోయింది.

3

రుద్రయ్య బస్తీనుంచీ ఇంటికి తిరిగివచ్చేసరికి సూర్యుడస్తమిం

★ గోటదీరుపనికి గొడ్డలేల? ★

చాడు. అతడి కొడుకులు పొలం నుంచీ ఇంకా రాలేదు. ఆడవాళ్లు పెరట్లో చిక్కుడు పాదులకు నీళ్లు పోస్తున్నారు. అతడు ప్రయాణ బడలికతో ఇస్సురని నిట్టూరుస్తూ తండ్రి మంచం దగ్గర కూలబడ్డాడు.

"ఏమైంది బాబూ కేసు?" అన్నాడు ముసలాడు.

"ఏమౌతుంది? ఇరవై లాటీ దెబ్బలు వీపు వాచేట్టు!"

"ఎంత ఘనకార్యాన్ని సాధించావురా అబ్బాయీ! వాళ్లు అతణ్ణి చావగొట్టేస్తారని కూడా అనుకో. అందువల్ల నీకేం ఒరుగుతుంది?"

"నాకు ఒరిగే దేమిటి? వాడింక అలాటి పనులు చేయడు."

"ఏలాటి పనులు చేయడు? అసలు అతడు నువ్వు చేసిందానికన్నా దుష్కార్యం చేశాడనేనా నీ నమ్మకం?"

రుద్రయ్యకు కోపం వచ్చింది. "నేనేం చేశాను? గర్భంతో వున్న ఆడదానిపైన చెయిజేసుకున్నానా? ఇంటినికాల్చేస్తానని బెదిరించానా?" అన్నాడతడు.

వృద్ధుడు మెల్లగా నవ్వి, ఓపిక తెచ్చుకొని ఇలా అన్నాడు: "ఒరే బాబూ! నేను మంచంపైన్నుంచీ లేవలేనివాణ్ణి. నువ్వు ప్రపంచమంతా చుట్టిరాగల శక్తి వున్నవాడివి. అందువల్ల నువ్వు నాకు బొత్తిగా లోకానుభవం లేదనుకుంటున్నావు. నీకన్న నేను పెద్దవాణ్ణి. మంచో, చెడ్డో చెబుతున్నా విను. నువ్వొక వ్రేలితో మరొకనిలో వున్న దోషాన్ని చూపిస్తున్నావు. కానీ మూడు వేళ్లు నీవైపుకే వంగి 'నీలో ఇరుమిక్కిలిగా దోషాలున్నా'యంటుండడం నువ్వు గమనించడం లేదు. అతడేదో చెడ్డపని చేసినట్టు చెబుతున్నావు. అతడు మాత్రమే ఆ కార్యం చేస్తే ఇంత కొట్లాట ఎందుకు వచ్చింది? ఒక చేతితోనే గాలిని తట్టితే శబ్దం వస్తుందా? రెండు చేతులు కలిస్తేగానీ శబ్దంరాదు. నేనూ ఏభై ఏళ్ళు సంసారసాగరంలో ఈదినవాణ్ణే. భీమయ్యతండ్రీ, నేనూ ఒక కంచాన తిని, ఒక మంచాన పడుకున్నాం. ధాన్యంగానీ, ధనంగానీ అతనికి లేకపోతే నేను, నాకు లేకపోతే అతడు ఇచ్చి, పుచ్చుకునేవాళ్ళం. ఇప్పుడు నువ్వేం చేస్తున్నావ్? అతనితో స్నేహంగా వుండకపోతే పోతివి. అంతటితో ఊరుకోరాదా? అతడి పొలంలో చాటునా, మాటునా ఆ పుల్లిని తోలేయమని నీ కొడుకులకు హుకూం ఇచ్చేశావు! ఆ ఇంటివాళ్లు పొలాలకు వెళ్లినప్పుడు పొట్లకాయలు, చిక్కుడుకాయలు కోసుకుని వచ్చేయండని నీ భార్యకు, కోడలికి ఆర్డరు ఇచ్చేశావు! ఆలోచించు. ఇదంతా బాగుందా? వాడు నీ చెంపపైన ఒక వ్రేటేస్తే, నువ్వూ అదేపని చేస్తావా? తప్పకదూ! గాంధీజీ ఏమన్నాడు? 'ఎవడైనా నిన్ను కొట్టితే, ఊరుకో.' చచ్చినట్టు వాడే పశ్చాత్తాపపడతాడు' అనలేదూ! ఏం? నా మాటలు నీకు నచ్చలేదూ!"


వృద్ధుని కంతలో దగ్గు వచ్చింది. ఆయాసం ఎక్కువైంది. కొంతసేపటికి సమాళించుకుని ఇలాఅన్నాడు: "పోనీ. ఈ కలహంవల్ల నీకు ఇంతో, అంతో లాభమేమైనా కలుగుతోందా? ఈ ఏడు పంటలన్నీ బొత్తిగా చెడిపోయాయి గదా! నీకు కోర్టుకు వెళ్ళిరావడంతోనే సరిపోతోందాయె! కుర్రవాళ్లకు పొరుగింటిపైన పగ తీర్చుకోవడానికి వెరవులు వెదకడంతోనే సరిపోతోందాయె! కలుపుతీయకపోవడంచేత చల్లిన వరిపైరు సరిగ్గా పండలేదు. మిరపతోట నీళ్లు కట్టక పోవడంచేత ఎండిపోయింది. ఇంక ఒకటి రెండేళ్లు ఇలా జరిగితే మళ్ళీ నువ్వు కోలుకోగలవా?"

రుద్రయ్య తండ్రి మాటల్లోని సత్యాన్ని గుర్తించాడు. ఎలాగైనా కలహానికి స్వస్తిచెప్పి, ఆరేళ్లకు మునుపటిలాగా నిశ్చింతతో కాలం గడప దలచుకున్నాడు. కానీ ఈ ప్రపంచంలో మానవుడు ఒకటిఅనుకోవడం, భగవంతుడు మరొకటిఅనుకోవడం పరిపాటి! పెరట్లోనుంచీ ఇంట్లోకి వచ్చిన ఆడవాళ్ళు, తమ కుటుంబంలోనున్న ఆలు మగళ్లనీ, తండ్రీ కొడుకుల్ని విడదీసి, చెట్టుకొకణ్ణిగా పుట్టకొకణ్ణిగాచేసి ఇంటింటికి తిరిగి భిక్షమెత్తుకునేట్టు చేసేటట్టు భీమయ్య వీధిలో ప్రతిజ్ఞలు పలుకుతున్నాడని రుద్రయ్యతో చెప్పారు. అంతటితో రుద్రయ్య కలలోనుంచీ మేలుకున్నట్టు తటాలున పైకిలేచి "ఆఁ ఆ అప్రయోజకుడు చేస్తాడు! మిగతావాళ్లు ఊరుకుంటారు!!" అన్నాడు.

4

మంగమ్మ సట్టింట్లో దీపం వెలి

గించింది. కుర్రవాళ్లు పొలాల వచ్చాడు. కోడదూడ ఒకటి పగ్గం మంద దగ్గరికి వెళ్లాడు. ఆ రోజు
నుంచీ తిరిగివచ్చారు. వాళ్ళారో తెంపుకొని వీధివైపు పరుగెత్తు అమావాస్య. దగ్గరున్న వస్తువులు
జన చేసిన పనేమిటో తెలుసు తోంది. రుద్రయ్య దాన్ని పట్టు కూడా స్పష్టంగా కనపడ్డంలేదు.
కునేందుకు రుద్రయ్య బయటికి కొని వచ్చి కంబానికికట్టి గొర్రెల పైగా ఆకాశంలో మబ్బులు కూడా



★ గోటదీరుపనికి గొడ్డలేల? ★

అలుముకుంటున్నాయి రుద్రయ్య పెరటిలో వుండగానే కారు చీకటి తెరలు ప్రపంచాన్ని పూర్తిగా ఆవరించుకున్నాయి. అతని కెందుకో ఆ సమయాన మనసులో భీతి పుట్టింది. రోడ్డు దగ్గర భీమయ్య అన్న మాటలు అతని వీనుల్లో ధ్వనింపసాగినాయ్. "వాడి కొంపే మండక పోతుందా?" అబ్బ, ఎంత భయంకరంగా వుందామాట!

రుద్రయ్య మనసులో విపరీతమైన ఆలోచనలు పొడచూపసాగినాయ్. "వాడిప్పుడు సుళభంగా కంచెను తొలగదోసుకు పెరట్లోకి రావచ్చు. రావచ్చేమిటి, వస్తాడు! మెల్లగా ఒక అగ్గిపుల్లగీసి కసవువామిలో పారేసి వెళ్ళిపోతాడు. ఇల్లు, పశువుల కొట్టం, ధాన్యపు గాదెలు అన్నీ కాలిపోతాయ్. నేను వాడిమీద కేసుపెట్టవచ్చు. కానీ సాక్ష్యం దొరకదు. అగ్గిపెడుతున్నప్పుడు నేనే గనుక వాడిని పట్టుకుంటేనా..."

కసవు వామికి వెనుక వైపు నుంచీ చరచరామన్న శబ్దం వినవచ్చింది. రుద్రయ్య పిల్లిలా మెల్లగా అడుగులు వేసుకుంటూ అటువైపుకు వెళ్లాడు. చిన్న వెల్తురు దృగ్గోచరమైంది. అదీ ఒక క్షణం సేపు. రుద్రయ్య దూరంగానే నిలబడ్డాడు. మళ్ళీ ఒకసారి వెలుగుపుట్టింది. ఆ వెలుగులో ఒక వ్యక్తి కనపడ్డాడు. గుప్పెడు కసవును మండుతున్న అగ్గిపుల్లతో ముట్టిస్తున్నాడా వ్యక్తి! రుద్రయ్య పరకాయించిచూచాడు. సందేహం లేదు, వాడు భీమయ్య.

"కానీ వాడు తీరా అగ్గి పెట్టేయనీ తర్వాత వాడిని పట్టుకొని రాతి కూసానికి నిలదీసి కట్టేసి, పదిమంది సాక్షులతో కేసును కోర్టుకు తీసుకెళ్తాను" అనుకున్నాడు రుద్రయ్య.

ఇంతలో వామి ఒక మూల నుంచీ మండసాగింది. ఒక్క ఉదటున రుద్రయ్య భీమయ్య పైకి లంఘించాడు. కానీ, భీమయ్యకూడా తగు జాగ్రత్తలోనే వున్నాడేమో. అతి చాకచక్యంతో పట్టు విడిపించుకుని, ఒక పరుగుతో కంచెను దాటుకునివీధిలోపడ్డాడు. రుద్రయ్య కాలిపోతున్న వామిని గురించి ఆలోచించలేదు. "పట్టుకోండి దొంగ. ఖూనికోరు కొంప ముంచేశాడు" అంటూ భీమయ్య వెంటబడ్డాడు.

ఇలాంటి కేకలు వినరావడం సహజమే కాబట్టి, గ్రామస్థులెవరూ వీధిలోనికి రాలేదు. భీమయ్య శరవేగంతో తన ఇంట్లో ప్రవేశించి తలుపు మూసి గడియవేసుకోబోయాడు. కానీ రుద్రయ్య అతని వెనువెంటనే లోపలికి దూకి "ఎక్కడికి పోతావురా ద్రోహీ!"అంటూజుట్టు పట్టుకున్నాడు. భీమయ్యకు దిక్కులు తోచలేదు. అతడొక బడితెను తీసుకుని రుద్రయ్యను చావమోదేశాడు. రుద్రయ్య దేహంమీద స్మారకం తప్పి క్రిందపడిపోయాడు. భీమయ్య అతణ్ణి మోసుకెళ్లి వీధిలో పారేశాడు.

రుద్రయ్య కళ్లు తెరిచేసరికి అర్ధరాత్రయింది. అతని కళ్లకు ఊరు కనపడలేదు. మొండిగోడలు కనపడ్డాయి!! "మన ఇల్లే కాదు, ఊరంతా కాలిపోయింది నాన్నా" అన్నాడు చిన్నకొడుకు. రుద్రయ్య కొకసారి గొంతెత్తి ఏడిస్తే బాగుందుననిపించింది. అతడు "నేను మొదటనే మంటను ఆర్పేసివుంటే..." అని పలుమారు గొణుక్కున్నాడు.

5

తెల్లవారబోతూందనగా కనకమ్మ పరుగెత్తివచ్చి "తాతయ్య చావుబ్రతుకుల మధ్య అవస్థపడుతున్నాడు మామయ్యా మర్రిచెట్టు క్రింద! నిన్నొకసారి రమ్మంటున్నాడు" అన్నది. రుద్రయ్యకు మనసు స్వాధీనంలో లేదు. "ఏమిటీ! చావుబ్రతుకులా! నన్నే రమ్మన్నాడా?" అంటూ ఆశ్చర్యపోయాడు. అక్కడున్న పదిమందీ అతనికి పరిస్థితి వివరించి చెప్పారు. రుద్రయ్య నడవలేకనడుస్తూ తండ్రి దగ్గరికి వెళ్ళి కూలబడ్డాడు. వృద్ధుడి ముఖాన జీవకళ అంతరించిపోతోంది. కొడుకును చూడగానే కన్నుల్లోనుంచీమాత్రం ఒక వింత తేజస్సు పొంగిసలాడింది నిజానికా అవస్థలో అతనికి మాట్లాడ్డానికే శక్తి లేదు. కానీ కొడుకుతో ఆఖరు సలహా చెప్పడానికి మాత్రం అతడు బ్రతికివున్నాడు.

"ఎంత పని జరిగిందిరా తండ్రీ! ఊరికెవరు నిప్పంటించింది?" అన్నాడతడు.

"వాడే నాన్నా, భీమయ్య! వాణ్ణి తరిమిపట్టుకున్నాను. కానీ తప్పించుకున్నాడు. నేను వాడి వెంటబడకుండా మంటను మొదటనే ఆర్పేసివుంటే ఇంతపని జరిగేది కాదు." అన్నాడు రుద్రయ్య.

★ ఘంటారావం ★

(27-వ పేజీ తరువాయి)

చూసినప్పుడెల్లా అక్కడున్న ఒక శిల్పాకృతి చూసి ఆమె భయపడేది. ఒకనాడుదయం ఆమె కిటికీలోనుంచి చూసేసరికి ఆ శిల్పం అక్కడలేదు. అంత ఎత్తైక్కి ఆ రాతివిగ్రహాన్ని పగలగొట్టాలంటే అక్కడనుంచి జారి కిందపడిపోవచ్చనే భయం కలుగుతుంది. ప్రాణభయం విడిచిపెట్టి క్వాసిమోడో ఆ విగ్రహాన్ని పగలకొట్టాడు.

ఒక్కొక్కరోజు సాయంకాలం క్రింద భాగంనుంచి విచారకరమైన పాట వినవచ్చేది. బొంగురు గొంతుతో పాడినదైనా ఆ పాటలో దుఃఖం విషాదం ఉట్టిపడుతుండేవి. చెవిటివాని పాటలు యమకంలేని సరళపదాలు.

ఒకరోజు ప్రొద్దున్న కిటికీలో పూవులుంచిన రెండు కూజాలు కనపడ్డాయి. అందులో ఒక కూజా అందంగాఉంది; కాని బీటవారిఉంది. అందులో నీరు కారిపోయింది. పువ్వులు కొంత వాడిఉన్నాయి. రెండోది మట్టికూజా. దాని నిండా నీరుంది. పువ్వులు కళకళలాడుతున్నాయి. ఎమరాల్డా అందమైన కూజాలో వాడిఉన్న పువ్వులగుత్తి చేతతీసుకుని రోజంతా వాసన చూస్తూ గడిపింది. రెండోకూజాలో పువ్వులలాగే ఉండిపోయాయి. అదిమొదలు ఆమెకు గోపురంపైనుండి విషాదగీతాలు వినపడలేదు. అయినా ఆమెకు చింతకలగలేదు. డాలీని గారంచేస్తూ ఎదుటనున్న భవనద్వారంవైపే చూస్తూ, ఫీబస్‌ని గురించి తనలో తాను మాట్లాడుకుంటూ ఆమె రోజులు గడుపుతోంది.

ఆమె క్వాసిమోడోని చూసి చాలరోజులయింది. అతడు చర్చివిడిచి వెళ్ళిపోయాడనిపించింది. ఒకరోజు రాత్రి ఆమెకు ఫీబస్‌ను గురించిన తలపులతో నిద్ర రాలేదు. గదిప్రక్క గాఢ నిశ్వాసం విని ఉలిక్కిపడింది. లేచి చూసింది. వెన్నెలలో మెట్లవద్ద ద్వారాని కడ్డంగా ఆకారంలేని ఒక పెద్ద ముద్ద కనపడింది. క్వాసిమోడో కటికిరాళ్ళపైన పడుకుని నిద్రపోతున్నాడు.

(ఇంకావుంది.)

గోటదీరుపనికి గొడ్డలేల?

"రుద్రయ్యా! చనిపోతున్న నాతో అబద్ధం చెప్పకు. ఎవరిది తప్పు?"

రుద్రయ్య నిర్ఘాంతపోయాడు. అతడి నోట మాట రాలేదు.

"దేవుడిముఖం చూచి నిజం చెప్పు. ఊరు సర్వనాశనమైపోవడానికి ఎవరు బాధ్యులు?"


రుద్రయ్య కళ్లల్లోనుంచీ అశ్రువులు జలజలరాలాయ్! "తప్పు నాదే నాన్నా" అన్నాడతడు!

వృద్ధుడు కుమారుని చేతుల్ని తీసి తన గుండెపైన వుంచుకున్నాడు. తరువాత అతడి తల నిముకుతూ "ఇంకేం చేస్తావు, ఇంకేం చేస్తావు" అన్నాడు.

"ఏంచేయను నాన్నా! నాకేమీ తోచటం లేదు" అన్నాడు రుద్రయ్య.

వృద్ధుడు కళ్లుమూసుకుని "నేను చనిపోతున్నాను తండ్రీ! ఇప్పుడైనా నామాట విను. నీ వామికి నిప్పంటించింది భీమయ్యేనని ఎవరితోనూ చెప్పకు. అతడి అపరాధాన్ని మఱచిపో. నువ్వొకరి నేరాన్ని మన్నించితే, నీ నేరాల్ని భగవంతుడు క్షమిస్తాడు" అన్నాడు. అతడి చేయి కుమారుడి తలమీదనుంచి క్రిందపడిపోయింది. అతడు శాశ్వతంగా కళ్లుమూసుకున్నాడు!

ఊరు కాలిపోవడానికి కారణమేమిటో గ్రామస్థులకు తెలియలేదు. ఆ రహస్యాన్ని రుద్రయ్యెందుకు బట్టబయలు చెయ్యలేదో భీమయ్యకు అర్థంకాలేదు. మొదట అతడు రుద్రయ్యను చూచి భయపడ్డాడు. కానీ రుద్రయ్య అతని దగ్గరకు వెళ్ళి చనువిచ్చి మాట్లాడడు. అంతటితో వివాదం అంతమైంది. కాలిపోయిన ఇళ్ళను తిరిగీ కట్టుకుంటున్నప్పుడు ఆ రెండు కుటుంబాలూ ఒక్క గుడిసెలోనే నివసించాయి. ★



రాజ్‌కపూర్ నిర్మించిన "బూట్ పాలిష్"లో ప్రధానపాత్రధారి రతన్‌కుమార్.


వంగ సినిమా రంగం

బెంగాలీ సినిమాలకు ప్రత్యేక గౌరవం ఆపాదించిన విషయాలు రెండున్నాయి: ఒకటి, కథావస్తువుల ప్రాశస్త్యం; రెండు, కథావస్తువుల ట్రీట్‌మెంటు. ఇంతవరకూ బెంగాలీ చిత్రాలకు ఉత్తమ గ్రంథాలు, మహాపురుషుల జీవిత చరిత్రలు, దేశభక్తియుతమైన కథలు ఎక్కువగా ఇతివృత్తాలను సప్లయి చేస్తూ వచ్చాయి. ఈమధ్య మాత్రం సమకాలిక సాంఘిక సమస్యలను సూటిగా ఎదుర్కొనే ధోరణి ఎక్కువైంది. ఇప్పటిదాకా ఈ సమస్యలను పూర్వపు కథావస్తువులలోనే ఏదో విధంగా ఇరికించేవారు.

పూర్వపు కథావస్తువులకు ముఖ్యాధారం శరత్ చంద్ర ఛటర్జీ, బంకించంద్ర ఛటర్జీ మున్నగువారి నవలలు. బారువా నటించిన "దేవదాసు" చిత్రం (ఇందులో సైగల్ చిన్నదైనా, మరపురాని ఒక పాత్ర ధరించారు) సిసలైన బెంగాలీ చిత్రం అనే ప్రఖ్యాతి పొందింది. బీహార్‌లోని నీలిమందు తోటల యజమానులు కార్మికులపై చేసిన అత్యాచారాలను చూపించే "నీల్ దర్పణ్" చిత్రం కూడా



వై. ఆర్. స్వామి దర్శకత్వంలో నిర్మింపబడుతున్న రోహిణీ వారి "వద్దంటే డబ్బు" చిత్రంలో సముద్రపు ఒడ్డున జానకి.



పి. ఎస్. ఫిలిమ్స్ వారి "ప్రిజనర్ ఆఫ్ గోల్కొండ" లో బీనారాయ్, ప్రేమనాథ్.

★ వంగ సినిమారంగం ★

అదేవిధంగా ప్రఖ్యాతిపొందింది. పైగా ఈ చిత్రంలో ఒక్క పాట కూడా లేదు.

ఈమాదిరి చిత్రాలు, ఇతర దేశాల్లోని చారిత్రిక చిత్రాలవలె, ప్రేక్షకులకు బాగా పరిచితములైన కథలనే ఎత్తుకొని, వాటిని ఒక కొత్త ఫక్కీలో మరింత ఆసక్తికరంగా చేశాయి.

1947 దాకా, సమకాలికమైన, లేక గతంలో జరిగిన, రాజకీయ విషయాలను చిత్రాలలోకి చొప్పించడానికి సెన్సార్‌షిప్ నిబంధనలు ఒప్పేవికావు. అందుచేత సమకాలికమైన దేశభక్తి భావాన్ని, రాజకీయవిషయాలను ఎప్పుడో బాగా పాతరోజుల్లో జరిగినట్లు చిత్రించడం బెంగాలీ సినిమాలకు, నాటకాలకు కూడా అలవాటయింది. ఇలా కాకుండా సమకాలిక సమస్యను సమకాలికంగానే చిత్రించిన ఒక చిత్రం "ఉదయేర్ పథే" (దీని హిందీ తర్జుమా "హంరాహి"). ఈ చిత్రంలో కనిపించే కొత్తరకం ట్రీట్‌మెంటువల్లనూ, మంచి స్క్రిప్టువల్లనూ అది బాగా ప్రజాదరణ పొందింది. అటువంటిదే మరొక చిత్రం "భూలీనై".

ఇక, జీవితచరిత్రల చిత్రాల సంఖ్య కూడా చాల ఎక్కువగానే వుంది. గడిచిన కొలది సంవత్సరాలలో తయారైన ఉత్తమ బెంగాలీ చిత్రాలలో లెక్కపెట్టదగినవి రెండు జీవితచరిత్రల చిత్రాలు. ఒకటి, పహారీసన్యాల్ అద్భుతంగా నటించిన ఈశ్వర్‌చంద్ర విద్యాసాగర్ చరిత్ర. రెండోది వంగకవి మైకేల్ మధుసూదన దత్ జీవితచరిత్ర. ఈ రెండూ విజయం పొందడానికి, ఆ ఇద్దరు వ్యక్తులూ, తదితర పాత్రలూ బెంగాల్‌లో ప్రతియింటా సుపరిచితమైనవారు కావడమే ముఖ్య కారణం.

ప్రస్తుతం బెంగాలీ సినిమాకథా వస్తువులలో వచ్చే కొత్తమార్పులు హర్షించదగినవిగానే వున్నాయి. కొత్త ఎక్స్‌పెరిమెంట్లు చేయాలనే గాఢాసక్తి ప్రబలుతున్నది. ఇది "పథేర్ పాంచాలి" మొదలైన కొన్ని చిత్రాల్లో బాగా కనిపిస్తుంది. పూర్వం కూడా ఇటువంటి ఎక్స్‌పెరిమెంట్లు కొన్ని జరక్కపోలేదు. బారువా తీసిన ఒక చిత్రంలో మొదటి దృశ్యంలోనే ఒక ఎద్దుబండి తలకిందులవడం కనిపిస్తుంది! కాని విసుగెత్తించే ఫార్ములా చిత్రాలు పోయి కొత్తమాదిరి చిత్రాలు రావడం ప్రేక్షకుల ప్రాణాలకు చాలా హాయిగా వుంది. "షాషేర్ బారీ" (పొరుగిల్లు) వంటి హాస్యవినోదకర చిత్రం ప్రేక్షకుల ఆదరణను తేలికగా పొందుతున్నది. ఈ చిత్రంలో వున్న మాదిరి వెంగలితనం, వాస్తవికత ఇటాలియన్ చిత్రాలను తలపిస్తూవుండడం గమనించదగ్గది.

బెంగాలీ సినిమారంగం కథలకే ఎక్కువ ప్రాధాన్యం యివ్వడానికి ఒక కారణం పేర్కొనవచ్చును. బెంగాలీ సినిమా పరిశ్రమకు టెక్నికల్ పరికరాల కొరత, యోగ్యమైన తారల కొరత మొదటినుంచీ వున్నదే. ఈ కొరతలు హర్షించదగినవో, గర్హించదగినవో తెలియదుగాని, బెంగాలీ పరిశ్రమఅభివృద్ధిచెందాలంటే ముందు పరిష్కరించవలసిన కొన్ని దోషాలున్నాయి. ఈ దోషాలు భారతదేశంలోని ఇతర ప్రాంతాల చిత్రాలకు కూడా అన్వయిస్తాయి. కథాకథనంలో చురుకుదనం లోపించి, కథ ఎంతసేపటికీ ముందుకు నడవకపోవడం ముఖ్యమైన లోపం. దీనివల్ల కథావస్తువు మంచిదైనా, చెడిపోయే అవకాశాలున్నాయి. కథతో సంబంధంలేని పాటలు పెట్టడం మరొక లోపం. కృత్రిమమని కొట్టవచ్చినట్లు కనిపించే కళాదర్శకత్వం, కథలోని పాత్రలన్నిటికీ కష్టాలమీద కష్టాలు సంఘటించే అసహజమైన దర్శకత్వం ఇవన్నీ లోపాలే.

కాని బెంగాలీ చిత్రపరిశ్రమను సింహావలోకనం చేసేటప్పుడు, భారతీయ చిత్రపరిశ్రమకు అది చేసిన దోహదం అమూల్యమైనదనీ, శాశ్వతమైనదని ఒప్పుకోవాలి.

బెంగాలీ చిత్రాలకు హిందీ తర్జుమాలు కూడా తయారుచేసి భారతదేశమంతటా ప్రదర్శించడంద్వారా బెంగాలీ పరిశ్రమ ఎంతో సేవచేసింది.

బెంగాల్ స్టూడియోలలో పరిస్థితులు మరొకవిధంగా వుండినట్లయితే, టెక్నికల్ ప్రావీణ్యంకూడా బెంగాలీ పరిశ్రమకు బాగా వుండినట్లయితే ఎటువంటి ఫలితాలు కలిగేవి అనేది ఆలోచిద్దాం. ఇందాక చెప్పినట్లుగా, టెక్నికల్ కొరత మూలంగా బెంగాలీ చిత్రాలలో కథాబలం ఎక్కువగా ఉండడం తటస్థించింది. దీని ఫలితంగా ట్రీట్‌మెంట్ దృష్ట్యా బెంగాలీ చిత్రాలు సంఘటనలకంటె భావాలకే ఎక్కువ ప్రాధాన్యం యివ్వడం, నిర్మాతల వ్యక్తిత్వాన్నే ప్రతిబింబించడం, ప్రాంతీయపరిధిలోపలే వుండిపోవడంకూడా జరిగింది.

బెంగాలీచిత్రాలలోని ప్రత్యేకత ఎక్కడవుంది? చాలవరకూ ఇతరప్రాంతాలచిత్రాల లక్షణాలే బెంగాలీ చిత్రాలకూ వున్నాయి. కాని వాటికి ఒక విలక్షణతకూడా వుంది. ఈ విలక్షణతవల్లనే అవి భారతదేశంలోని అన్ని ప్రాంతాలలోనూ ఆదరింపబడుతున్నాయి. అంతర్జాతీయ చలనచిత్రోత్సవంలో ప్రదర్శింపబడిన "బాబ్లా" ను చూసి ఒక గుజరాతీ ప్రేక్షకుడు "ఈ బెంగాలీ టెక్నిక్ విచిత్రంగా వుందే!" అని అన్నమాట అక్షరాలా నిజం.

('ఫిల్మ్‌ఫేర్'లో కబితా సర్కార్ వ్యాసానికి అనువాదం)

[illegible] ★ ఏ. ఎస్.

దక్షిణ భారత చిత్రకారుల సంఘ యాజమాన్యాన మరొకచిత్రకళాప్రదర్శనం యీ నెల 1న మద్రాసు మ్యూజియంలో ప్రారంభమయింది. ఈసారి జరిగిన ప్రదర్శనం అటు మామూలుగా జరిగే ఒకే వ్యక్తి యొక్క కళాప్రదర్శనమూ కాదు; యిటు జనరల్ ఎగ్జిబిషన్స్ తరహాకి చెందినదీ కాదు. పదిమంది చిత్రకారులు చేరి, కుటుంబ వ్యవహారంగా నడుపుకున్న బాపతు. ఈ పదిమందీ కలిసి ఒకచోట చిత్రకళాప్రదర్శనం చేయటానికి గల కారణం వారి బాణీలలో భ్రాతృత్వం వుండటంమాత్రం కాదు. అటువంటి లక్ష్యం ఏదో ఒకటి నిర్ణయించుకొని, తదనుగుణమైన ప్రదర్శనం ఏర్పాటు చేసి వుంటే, చిత్రాలు ప్రదర్శించిన చిత్రకారులకి, వాటినిచూచే ప్రేక్షకులోకానికి ఒక విధమైన తృప్తి కలిగేదేమో!

స్థూలంగా విభజించి చెప్పవలసివస్తే యీ చిత్రకళాప్రదర్శనంలో ఏ. పి. సంతానరాజుగారి బొమ్మలు ఒంటరిగా బిక్కుబిక్కుమంటున్నట్టున్నాయి. మిగిలిన తొమ్మిదిమంది చిత్రకారులలో ప్రతి ఒక్కరూ, తాము రచించిన ప్రతి చిత్రంలోనూ, ప్రేక్షకుడి వూహాశక్తికి విపరీతమైన పరీక్ష పెట్టారు. సంతానరాజుగారు మాత్రం ప్రేక్షకుడిని అగమ్యగోచరమైన పరిస్థితిలో పడనీయకుండా, తాను తనకళ్ల ఎదుట స్థూలంగా చూసిన ప్రతివస్తువునీ, వర్ణవైవిధ్యాన్నీ అరమరికలు, అల్లిబిల్లి పోకడలులేకుండా కాగితంమీదికి ఎక్కించారు. ప్రదర్శన ప్రారంభదినాన యీయన రచించిన బొమ్మలే రెండుమూడు



శ్రీ ప్రసన్న ఫిలింస్ వారి 'బలవంతంపెళ్లి'లో నాయకి ప్రాతధారిణి శ్రీమతి శోభ.

అమ్ముడైన కారణంచేత ప్రజాబాహుళ్యం, కళాదృష్ట్యా ఎంత గొప్ప రచనఅయినా తమ మెదడుకి పనిచెప్పే బాపతుదైతే మాత్రం, మాటలతో ఎంతైనా మెచ్చుకొంటారు కాని, మూటవిప్పి డబ్బు చెల్లించి కొనబోరనేది స్పష్టమౌతున్నది.

పి. విజయలక్ష్మిగారి (చిత్రకారులు పిలకా లక్ష్మీనరసింహమూర్తిగారి సతి యొక్క, పాటి కృష్ణమూర్తిగారి సోదరి) చిత్రాలు ఏభైకి పైగా యీ ప్రదర్శనంలో వున్నాయి. పిలకా లక్ష్మీనరసింహమూర్తి గారిని వుత్సాహపరిచినట్లుగా వూహించబడుతున్న ఆంధ్ర జానపద చిత్రకళా శైలియే యీమెనూ ఆకర్షించినట్లు అనుమానించటానికి యీ చిత్రాల్లో ఆధారాలు చాలా వున్నాయి. ఆయన చిత్రాల్లోలాగే యీమె చిత్రాల్లోకూడా రాధాకృష్ణులు, సీతారాములు - యిత్యాద[illegible] చిత్రకారుల ఆత్మీయ ఆదర్శపాత్రలు, - అమానుష రూపాల్లో తరుచు వస్తూపోతూ వుండటం

అశ్వరాజ్ వారి "అన్నదాత" షూటింగులో డైరెక్టరు వేదాంతం రాఘవయ్య, నాగేశ్వరరావు, యస్. వి. రంగారావు, అంజలీదేవి, కుటుంబరావు, రాజరత్నం.



★ వర్ణార్ణవం ★

చిత్రం. కృష్ణుని అన్వేషిస్తున్న రాధ యొక్క చిత్రవిశేషం యీమె చిత్రించారు. ఆ చిత్రంలో కొమ్మలులేని ఆకులు, ఆకును పోలినచెట్లు భూమ్యాకాశాలు అంతటా ఆవరించివుండగా, వాటిల్లో నుంచి, 'ఆకులో ఆకు'లా అయిపోయిన అతివ ఆకృతి ఒకటి అతిలలితంగా మింటిలో మిణుకు మిణుకుమనే నక్షత్రకాంతలా దృగ్గోచరమౌతూవుంటుంది. ఈ చిత్రమే కనీసం ఒకవంద ఏళ్ళక్రితం విరచితమై వుంటే, ఫ్రాయిడ్ తన సైకాలజీ సిద్ధాంతాల వ్యాఖ్యానానికి, దీని నొక బలమైన తార్కాణంగా తప్పక స్వీకరించి వుండేవాడనిపిస్తున్నది.

నామగిరి అమ్మాళ్ గారు (శ్రీమాన్ చక్రవర్తుల రాజగోపాలాచారిగారి తనయ) రచించిన పదకొండు చిత్రాలు యీ ప్రదర్శనంలో వున్నాయి. ఇంచుమించు అన్నీ కూడా తైలవర్ణ చిత్రాలు. అందులోనూ ఎక్కువగా ప్రకృతి దృశ్యాలు. 'గూటికి చేరిన పిట్టలు,' 'సంధ్యారాగం' అనే రెండు చిత్రాలలో స్త్రీ ప్రకృతి అప్రయత్నంగా ప్రతిబింబించింది. తన తండ్రి రాజగోపాలాచారిగారి రూపచిత్రాన్ని రచించటానికి యీమె చేసిన ప్రయత్నం చమత్కారంగా ఉంది.

కె. రామమూర్తిగారు యిరవైదాకా చిత్రాలు ప్రదర్శనానికి పంపించారు. ఈయన చిత్రరచనావిధానంలో అనవసరమైన లాలిత్యం వుండదు. కాకుల్నీ, కొండరాళ్లనీ యీయన కమనీయంగా చిత్రించారు. 'సీమంతినీ,' 'అనూహ్యశక్తి' అనబడే రెండుమూడు చిత్రాలలో యీయన కొత్తబాణీలజోలికి పోతున్న ప్రయత్నం కనిపిస్తున్నది. 'గాంధీజీ అస్తమయం' అంటూ 1948 జనవరి 30 నాటి సూర్యాస్తమయ సమయాన్ని, జాతి జీవితానికి వుద్దీపన వికాసాలు కలిగించిన మహాత్ముని అస్తమయానికి వాపోతూ, కర్తవ్యతా విమూఢులైన అశేష భారత ప్రజానీకాన్నీ, యీయన ఆ చిత్రంలో చిత్రించారు. చిత్రం చాలా బాగున్నది.

మొక్కపాటి కృష్ణమూర్తిగారు రచించిన నలభైచిత్రాలు యీ ప్రదర్శనంలో వున్నాయి. పిలకా లక్ష్మీ నరసింహమూర్తిగారి చిత్రాలలోనూ,కృష్ణమూర్తిగారిచిత్రాలలోనూ కనిపించే ఆకృతులు ఒక గూటచిలుకలే అయినట్లు కొట్టవచ్చినట్లు కనిపిస్తున్నది. ప్రతి చిత్రకారుడుకీ ఏవో కొన్ని అభిమాన ఆకృతులు, చిత్రకళా 'సమయాలూ' వుండితీరుతాయి. కాని అవే ఆయన శిష్యపరంపరలోనూ కనిపిస్తే, చూపరికి కించిత్తు చిరాకు కలుగక తప్పదు. వీరు రచించిన 'మాత' 'సంధ్యార్చన' చిత్రాలు అవనీంద్రుని రచనల్లా వుదాత్తంగా వున్నాయి.

శాంతినికేతనంలో విద్యాభ్యాసం చేసిన జి. వి. సుబ్బారావుగారిచిత్రాలు పదిహేను వున్నాయి. ఈయనది చాలామటుకు రేఖాప్రధానమైనశైలి. ఆయన చేతిలో కుంచె, జీవనదిలాగా ఆదిలో అల్పమై, మధ్యలో వుధృతమై, అంతంలో సరస్వతీనదిలా అంతర్వాహినివైఖరిని దాల్చుతుంటుంది. 'సౌందరనందం' అనే పేరుతో యీయన కుడ్యచిత్రరచనాశైలిలోరచించినచిత్రం ప్రశంసనీయంగా వుంది.

టి. వి. రత్నంగారు డజను చిత్రాలు ప్రదర్శించారు. దాదాపు ఏభైయేళ్ళక్రితం రవివర్మ త్రొక్కిన మార్గాన్ని మళ్ళీ యీవేళ యీయన త్రొక్కినట్లు కనిపిస్తున్నది. అందునా, స్త్రీమూర్తుల ముఖాకృతుల చిత్రణంలోనే యీయన కొంతమటుకు కృతకృత్యులైనారు. తైలవర్ణాలను, నీటిరంగుల పద్ధతిలో వాడబోవటం తప్పు కాకపోవచ్చునేమోకాని, శ్లాఘనీయం మాత్రం కాదు. ఈయన నీటిరంగులలో చిత్రించిన 'శివపార్వతి' 'మధురస్మృతి' చిత్రాలు బాగున్నాయి.

పి. ఆర్. రాజుగారి చిత్రాలు ఇరవైదాకా వున్నాయి. పక్షుల, చేపల వర్ణ పరిశోధనకోసం యీయన వేసిన చిత్రాలు బాగున్నాయి. మిగిలిన బొమ్మలను చూస్తుంటే భావంకోసమూ, ఆ భావవ్యక్తీకరణ సాధన సముదాయంకోసమూ అతి నమ్రభావంతో యీయన చేసే పరిశోధన, పడుతున్న ఆరాటన బోధపడుతాయి. ఇటీవల మద్రాసు చిత్రకారులందరూ మూకవుమ్మడిగావుచ్చుకొంటున్న 'ఇంప్రెషనిస్టు' మతం, యీయననుకూడా ఆకర్షిస్తున్నట్లు 'మాతాశిశువులు', ప్రకృతిదృశ్యం' అనే ఆ రెండు చిత్రాలవల్లా అవగతమౌతున్నది.

కె. భాగేశ్వర శర్మగారి చిత్రాలు పదకొండు. వీరి కుంచెప్రభావంలో మనుష్యాకృతులలో ఏదో ఒక విపరీతమైన మార్పు వస్తుంది; వర్ణాలలో సహజత్వపు హద్దులు దాటిపోయిన కాంతి కలుగుతుంది. వీరు రచించిన 'మందారపుష్పాల' చిత్రం, రాగమయి అయిన స్త్రీహృదయాన్ని స్ఫురింపచేస్తూ, కమనీయంగా వుంది.

పి. విజయలక్ష్మిగారి తరువాత చెప్పుకోదగినంత ఎక్కువసంఖ్యలో చిత్రాలు ప్రదర్శించినవారు ఎ. జానకిరామ్ గారు. రేడియోయిలాకా వుద్యోగం ఏనాటినుంచో చేస్తూ, యిటీవల రెండు మూడు సంవత్సరాల వ్యవధిలో ఆయనకు దొరికిన విరామ సమయాలను వినియోగించి చిత్రించిన చిత్రాలలో నలభైమూడింటిని యీ ప్రదర్శనంలో వుంచారు. ఈయన చిత్రరచనకు లాలిత్యము, స్ఫురణ అనే రెండు అంశాలు మాత్రమే అతి ప్రధానమైవున్నట్లు తోస్తుంది. ప్రబంధకన్య వడుములా ప్రేక్షకుడి మనస్సులో అస్తినాస్తి భావాన్ని కలిగించేటంత మృదులంగా మాత్రమే యీయన వర్ణాలను వాడుతారు. వర్ణాల విషయంలో మాత్రమే కాక, వస్తువు విషయంలో కూడా యీయన ఎక్కువభాగం ప్రేక్షకుడి ఊహాకీ, అవగాహనకీ వదిలేస్తుంటారు. అంత ఎక్కువభాగం ప్రేక్షకుడి వూహాకి వదిలేసినందువల్ల ప్రయోజనంకంటే ఎక్కువగా అపకారమే జరుగుతుంది. ఉదాహరణకి 'మహాశ్వేత నడిచిన బాట' అనే యీయన చిత్రాన్ని తీసుకొందాం. అందులో మహాశ్వేత మాత్రం కనుపించదు. మిగిలినవెన్నో కనిపిస్తాయి. అలాంటి చిత్రాన్ని చూస్తున్నప్పుడు చాలామంది మనస్సుల్లో తెనాలిరామలింగని 'భావతురంగం' చిత్రఉదంతం జ్ఞప్తికి వచ్చితీరుతుంది. 'యాత్రికుడు' అనే పేరుతో యీయన రచించిన చిత్రం ప్రేక్షకుణ్ణి అవలీలగా వూహాలోకాలలోకి తీసుకుపోగలిగిందిగా వుంది.

ఈ పదిమంది చిత్రకారులవీ కాక, దేవీప్రసాదరాయ్ చౌదరిగారు శిష్యులకోసం చిత్రించి చూపించిన మూడుచిత్రాలను కూడా తెచ్చి యీ ప్రదర్శనంలో పెట్టారు. ఈ ప్రదర్శనానికీ ఆయన స్కూలుపిల్లలకి పాఠం చెప్పటానికి వుపయోగించిన ఆ బొమ్మలకూ గల సంబంధం ఏమిటో అనూహ్యం. మద్రాసుచిత్రకారులలో వస్తాద్ అయిన చౌదరిగారి వుస్తాద్ గిరీ యీ మూడు చిత్రాల్లోకూడా బుజావుతున్నది. ★

★ సినిమా వార్తలు ★

యునైటెడ్ టెక్నీషియన్స్ ఎండ్ శ్యామలా స్టూడియో వారి "పల్లెపడుచు" నిర్మాణం చాలవరకు పూర్తయిందని తెలుస్తోంది. కొత్త సంవత్సరాదికి ఈ చిత్రాన్ని విడుదల చేయాలని నిర్మాతలు ఆలోచిస్తున్నారు.

*   *   *

హైదరాబాదులో "బలవంతం పెళ్ళి" అనే సాంఘిక చిత్రాన్ని తెలుగు హిందీలలో నిర్మించ తలపెట్టిన వైద్యులరమణారావుగారు, మార్చి నెల ఆరంభంనుంచీ తమ చిత్రం ఔట్ డోర్ షూటింగు హైదరాబాదులో ప్రారంభం అవుతుందని తెలుపుతున్నారు. నటీనటులందరూ తెలంగాణాలోనివారే. కామెరామాన్‌గా రహమాన్ గారిని కొత్తగా బుక్ చేశారు. సంగీతం ఓగిరాల రామచంద్రరావు, డి. ఎస్. రామమూర్తి, సౌండు వాల్కే గార్లు. త్వరలోనే హైదరాబాదులో స్టూడియో నిర్మాణానికి కూడా ఏర్పాట్లు చేస్తున్నామనీ, దీనికి శ్రీ మీర్జాపురం రాజావారు కూడా సహాయం చేస్తారనీ డైరెక్టర్ రమణారావుగారు తెలుపుతున్నారు.

లిటిల్ బాలే ట్రూప్ వారి రామాయణ ప్రదర్శనం

గత బుధవారంనాడు మద్రాసులో చక్కని నృత్యప్రదర్శనాలు ప్రారంభమయినవి. ప్రదర్శకులు బొంబాయినుండి వచ్చిన లిటిల్ బాలే ట్రూప్ వారు. ఈ ట్రూప్ నిర్వాహకుడు ప్రసిద్ధ నృత్యదర్శకుడు శాంతివర్ధన్. వీరి బృందనృత్యాలు ప్రేక్షకులను సుమారు రెండున్నర గంటలసేపు సమ్మోహితులను చేశాయి

ఋషీవాలీ స్కూలు (బెంగుళూరు) సహాయార్థం ఈ ప్రదర్శనాలు ఏర్పాటైనాయి. మొదటిరోజున, అనగా ఫిబ్రవరి 3వ తేదీన ప్రదర్శనాలు చూడడానికి వచ్చినవారితో అన్నామలై మందిరం కిటకిటలాడింది. మద్రాసు గవర్నరు శ్రీ ప్రకాశగారు కూడా హాజరయ్యారు. సాయంత్రం ఆరున్నరకు ప్రదర్శనం ప్రారంభమైంది. మొదట గుజరాతీ జానపద నృత్యం ప్రదర్శితమైంది. తరవాత రాసలీలా నృత్యం, కొంత విరామంతర్వాత రామాయణ ప్రదర్శనం జరిగాయి. "రామాయణం" ప్రేక్షకులను తన్మయస్థితిలో ముంచివేసింది. దీనిలో పప్పెట్ షో (కీలుబొమ్మలాట), బాలే టెక్నిక్ రెండూ కలగలుపు చేయబడినవి. ముఖాలకు ఆయా పాత్రల మాస్కులు తగిలించుకుని, నృత్యపు కదలికలుకూడా కీలుబొమ్మల కదలికలనే అనుకరిస్తూ, పసిపిల్లలకుకూడా కథాంశం బోధపడేటంత సౌలభ్యం సాధిస్తూ ప్రదర్శనం కొనసాగింది. నృత్యమే ఉత్తమస్థాయిలో ఉండగా, అంతకంటే ఉత్తమంగా ఉన్నదనిపించే మనోహరమైన సంగీతం ప్రేక్షకులను అలరించి వేసింది.


ఇక ప్రొడక్షన్ విలువల విషయంలో కూడా లిటిల్ బాలే ట్రూప్ వారి కౌశలం అద్భుతావహంగా వున్నది. సినిమాలతో అధోగతికి దిగజారిన మనకళలు ఇటువంటి చిన్నచిన్న సంఘాలద్వారానే పునరుద్ధరించబడాలి. ప్రతి చిన్న అంశంలోనూ జాతీయతను, పూర్వ సంప్రదాయాలను, ఉత్తమ సంస్కృతిని అన్నిటినీమించి ఒక నిర్దిష్ట వ్యక్తిత్వాన్ని ఈ ట్రూప్‌వారు ప్రదర్శిస్తున్నారు. వీరికి మన ప్రభుత్వాలు ఇంతకుముందు కొంత సహాయం ధనరూపేణా, ఇతరవిధాంగా చేసివున్నాయి. అయితే అది చాల స్వల్పం. ఇతోధికమైన ఆర్థికసహాయం, ప్రోత్సాహం యివ్వడం ప్రభుత్వాల కర్తవ్యం. ★



గోకుల్ వారి "నిరుపేదలు"లో రిక్షాయజమాని ధర్మయ్యగా ఆర్. నాగేశ్వర రావు, గుమాస్తాగా కుటుంబరావు.

★

బంగారయ్య (నాగేశ్వర రావు,) మస్తాను (ఏ. శేషగిరి రావు) తూము ప్రదేశాల్లో గంజి కేంద్రం స్థాపించారు. అశ్వరాజ్ వారి "అన్నదాత"లో ఒకదృశ్యం.





యునైటెడ్ ఆర్ట్ పిక్చర్స్ అండ్ శ్యామలావారి "పల్లెపడుచు"లో కృష్ణకుమారి.

యోగాసనములు-దేహారోగ్యము

3 మనోరోగములు - మహాముద్ర

మంచిచెడ్డలవలెనే మనుష్యులకు ఆరోగ్యము, రోగము అనునవి చెప్పిరావు. ఇవి అనాహూతులైన అతిథులవంటివి. విధివైచిత్ర్య మిట్టిదని గ్రహించిన వివేకులు రానున్న ప్రమాదములను ముందే కనిపెట్టి నివారింప జూచుకొందురు. సద్విద్యల సాహాయ్యముతో సాధనలను దెలిసికొని సర్వేంద్రియములను స్వాధీనమొనర్చుకొందురు. ఇట్టి సద్విద్యలు అసంఖ్యాకములైననూ భారతీయులు అవి అరువదినాలుగని నిర్ణయించిరి. వీనిని అసారములు, అల్పసారములు, సారములు, సారతరములు, సారతమములు అని అయిదు విధములని విభజించిరి. వీనిలో మనకు కావలసినవి సారతమములైన సద్విద్యలు. సారమనగా బలము, లేదా స్థిరాంశము. దీనినే ఇంగ్లీషులో ఎసెన్స్ (*Essence*) అందురు.

కర్మరూపమును తెలియబరిచి, జ్ఞానమును బోధించి, యోగసాధన కుపకరించునట్టివి సారతమములు.

కర్మ, జ్ఞానము, యోగము అను నీ మూడును మానవునకు అత్యంతావశ్యకములు. వీనిలోనే యొక్కటి లోపించినను జీవితము దుఃఖభాజనమగును.

చిరకాలముగా అభ్యాసము లోపమై విస్మరింపబడిన ఈ యోగాంగ సాధనలలో నేడు పారమందుకొనవలెనన్నచో ఇంత విమర్శ యవసరమని, ఇది ఇంకనూ చాల దని నా మిత్రులు, విద్యార్థులు, విద్యార్థినులు నన్ను ఉద్బోధించినందువలన ఇంత యవతారిక అవసరమైనది. యోగాంగ సాధన లొక క్రమపద్ధతి ననుసరించి అభ్యసింపవలసినవనియూ, అందరికినీ సుసాధ్యమై, సర్వరోగములనూ నివారింపగలిగి, స్వల్పకాలములో నమితఫలముల నీయగలుగు విధమున ఈ సాధనల యభ్యసనవిధానము నిర్ణయింపబడవలెననియూ వారి యభిప్రాయము. ఇందుకు నేనేగాక అందరునూ అంగీకరించగలరు.

శ్రీ భగవత్పతంజలి మహర్షులు పరమ సూక్ష్మమైన యోగదృష్టిలో యోగశాస్త్రమును సాక్షాత్కరింప చేసుకొనిన వారు.

~~"వ్యాధిస్త్యాన సంశయప్రమాద ఆలస్య~~

అవిరతిభ్రాంతిదర్శన అలబ్ధ భూమికత్వ అనవస్థితత్వానిచి త్తవిక్షేపాస్తేంతరాయాః" (పా. ద. 1. పా. సూ. 20)

మానవుడు దారాపుత్రాదులతో సంసారయాత్రనుసాగించుచూ, ఈ ప్రపంచమనగా నేమి, దీనికిమూలహేతు వేమి, నేను, నాది, నావారు అను నీమాటలలోని 'నా' అను వస్తువెట్టేది; ఈ మొదలైన ప్రశ్నల కుత్తరములను తెలుసుకొన యత్నించుటకుముందు తన నిజస్వరూపమును తెలుసుకొనవలెను. తానెవరో తెలిసికొనినప్పుడుగాని ప్రపంచమునుగురించి తెలుసుకొనజాలడు. తానెవరో తెలుసుకొనగోరువాడు ప్రప్రథమమున మనోరోగములు లేనివాడై యుండవలెను.

టి. కృష్ణమాచారి

మనోరోగమునుగుర్తించుట కష్టముకాదు. జ్ఞాపకశక్తి క్షీణించి గిజగిజలాడువారు, అనుక్షణమునూ కోపతాపాదులకు లోనై కుందువారు, శాంతి సహనములు లేక ప్రవర్తించువారు, నిత్యము అసంతృప్తికి లోనై విషయభోగములకు దాసులగువారు మనోరోగముల వలన బీడింపబడుచున్నవారని గుర్తురుగ వచ్చును. ఇట్టివారు "విక్షిప్తచిత్తులు, మూఢచిత్తులు, క్షిప్తచిత్తులు' అని యోగశాస్త్రము పేర్కొన్నది.

యోగశాస్త్ర మిట్లు చెప్పుచున్నది: 'బాహ్యేంద్రియములకు పుష్టి కలిగించవలసిన త్వక్ (చర్మము), మాంసము, మజ్జ, మేధస్సు, శుక్లము, రజస్సు, రక్తము, ఓజస్సు అనునవిఅవసరమైనంతకంటె యధికమైననూ అల్పమైననూ ఇట్టి యవస్థలు సంభవించును'అయితేఇంతమాత్రమున శరీరపుష్టినీ వృద్ధినీ యోగశాస్త్రము నిషేధించుచున్నదని భావించరాదు. అట్లని దేహమును అమితముగా పెంచుకొని శాస్త్రవిహితమైన కర్మకు ప్రతిబంధకము నేర్పరచుకొనరాదు కూడ.

మంచి వస్తువులను దుర్వినియోగపరచిన నష్టమే వాటిల్లునని అందరికినీ విదితమే. ఆ మంచిని సంపాదించుటకు ఆధారభూతమైన శరీరమును దుర్వినియోగపరచకూడదని వేరుగా చెప్పనవసరము లేదు. శరీరమును

~~దుర్వినియోగపరచుట అనగా దుర్వ్యర్తనకు~~

లోనై శరీరమును, శరీరాంగములను అలయింపజేయుట.

కాని నడవడికలోని మంచిచెడ్డలను గుర్తించుటలో జాగ్రత అత్యంత మవసరము. ఒకరికి మంచివలె కనపడునది మరొకరికి చేటువలె కనపడవచ్చును. ఈవిధమైన సంశయములు వారివారి మనస్సంకోచ వికాసములవలన జనించును. ఒకరికి మంచిని మరొకరికి చెడుగును కూర్చు విషయములు లోకములో ఉండవని చెప్పుట సాహసము.

సర్వజనులు సుఖమునే పొందగోరి దుఃఖమును నివారింప గోరుచుందురు. కాని సుఖదుఃఖములు రెండును ఒకే విధమైన మనః పరిణామములని అందరూ గుర్తింప నేర్వలేరు. అవి కంటి కగుపడునవిగావు. కంటి కగుపడనంత మాత్రమున అవి లేవని చెప్పలేము. ఆ సుఖదుఃఖములకు నిలయమైన మనస్సు కూడ అంతే. ఆధునిక వైజ్ఞానికులు యంత్రముల ఆధారముతో మనస్సు అను దానిని కంటికి చూపలేరు.

సుఖదుఃఖములు మొదట మనసులో పుట్టి, కొన్నాళ్ళకు బాహ్యేంద్రియ, శారీరక వికాసహ్రాసములకు హేతువులగును. అవి చివరకు సహింపరానివగును. ఉద్రేకము కలిగించి శరీరము నుడికింపజేయును. బాధల కోర్వజాలక మనుష్యులు నేలపై పొర్లి విలవిలలాడుచుందురు. ఆహార విహార యానపానాదులందు స్వాభావికముగానో కృత్రిమముగానో (బలాత్కారముగానో) వచ్చు అలవాట్లవలన ఇట్టి అవస్థలు సంభవించును. ఇట్టి యవస్థలకు లోనగుటకంటె మించిన కష్టముండునా? మనకు లభించిన స్వాతంత్ర్యమును, అవకాశములను సద్వినియోగము చేసుకొని, మన శరీరమును మన స్వాధీనములో నుంచుకొని మంచిదారిలో పెట్టుకొనుటకుగాను యోగశాస్త్రములో అనేక మార్గములు చూపబడినవి. వానిని చక్కగా మనన మొనరించుకొనుట మన ప్రథమ కర్తవ్యము.

వస్తువులన్నీ పరస్పర సంబంధ బాంధవ్యములచేత తమతమ నామములు, రూపములు. ప్రకృతులలో మార్పులు పొందుచున్నవి, ఇదేవిధముగా మంచిచెడ్డలుకూడ. శరీరావయవములను, ఇంద్రియములను అపాయము, చెడుగు పోకని మార్గములో నడిపి, జీవితమున కనువగునట్లు వినియోగించుకొనుట మానవ

~~ధర్మము. అట్టి మార్గములు చక్కని వివరణ~~

లతో యోగశాస్త్రములో చెప్పబడినంత విస్తరముగా మరే శాస్త్రములోనూ చెప్పబడలేదు.

శారీరక రోగచికిత్సా క్రమము, మానసిక రోగచికిత్సాక్రమము, ఆత్మశక్తి బోధన క్రమము అని మూడుపద్ధతులను బోధించు యోగశాస్త్రము ప్రసిద్ధికెక్కినదని శ్రీ భగవత్పతంజలి మహర్షులు చెప్పినారు. శరీరమునందు రోగము పూర్తిగా వ్యాపించిన పిమ్మట తన్నివారణకు యత్నించువారి కంటె, రోగములు సమీపించకుండగనే యోగాంగ సాధనలవలన శరీరములను రక్షించుకొనువారు ఉత్తములు. రోగము క్రమ్మిన తరువాత నివారించుకొన యత్నించువారు మధ్యములు. యోగము రోగనివారక మగునో కాదోనని సందేహించి వెనుదీయువారు మూడవతరగతికి చెందినవారు. రోగనివారణకు ఔషధపానాదులవంటి సాధనలనేకము లెక్కకు మీరియున్నవి. ఎవరికి వారు వారివారి సాధన విధానములే యుత్తమమని ప్రచారము చేయుట లోకసహజము. తమ విధానమే అత్యుత్తమనుమా అన్యసాధనలను తెగనాడువారిని గురించిన విమర్శ అరుచికరమగునని విడనాడుచున్నాను. స్త్రీలు, పురుషులు, పిన్నలు, పెద్దలు, ధనికులు, దరిద్రులు అను వ్యత్యాసములేక సర్వమానవులకూ ఎల్లదేశములలో సర్వ ఋతువులలో, మితత్రయముతో అపాయ భయములేక సర్వ రోగములనూ ఏది నివారింపగలదో, అట్టి సాధన విధానమే మనకిపుడు కావలసినది. అంతమాత్రమున ఎట్టి వైద్యములూ కూడవని నేను చెప్పుచున్నట్లు భావించరాదు. దేశకాల పాత్రములనుబట్టి, వస్తువులనుబట్టి, శక్తినిబట్టి ఎప్పటికేవి అవసరమగునో అవి యన్నియూ స్వీకరించదగినవే. అట్లు పతంజలి మహర్షులే చెప్పియున్నారు. శరీరముయొక్క సామాన్య పరిస్థితినిబట్టి యోచించినచో, ఆహార ఫలహారాదికములను అధికముగా తినుట, అనవసరము గు ఆటలు, త్రాగుట, అనవసర శరీర పరిశ్రమ మొదలగు కారణములవల్ల రోగములు సంభవించుచున్నవని తెలియును. సాంప్రదాయికము కర్మలను విడనాడిన వారిని గమనించినచో ఈ విషయము స్పష్టమగును. నేటి పరిస్థితులను అవగాహ మొనరించుకొనువారికి సంగతి సుబోధకమే.

కొందరు దురభ్యాసములను విడనాడగలవారుందురు; కొందరు విడనాడ యత్నింతురు; అనేకులు విడనాడుట సాధ్యము గావందురు. అత్యాహారాది దురభ్యాసములకు నేడు మనుష్యుల నాకర్షించునవి కల్లు, చుట్టలు, సిగార్లు మొదలైనవి. వీని

కైనను నియమమును మితిని అతిక్రమించి యలవడువారు ఎంత ద్రవ్యము వ్యయము చేసినను, ఎంతమంది వైద్యుల సాహాయ్యము బొందినను ఆరోగ్యలాభము బొందజాలరు. ఈ అలవాట్లు అనివార్యమైనచో మితము నేర్చి యోగాసనములను సాధన చేసినచో ఆరోగ్య లాభమును బొందగలరని ధ్రువముగా చెప్పవచ్చును. ఔషధపానము, సూదులపోట్లు (ఇంజెక్షన్లు), శస్త్రచికిత్స, రోగ నివారకములగు తాత్కాలిక సాధనలేగాని, రోగములకు మూలహేతువులను కనిపెట్టి నివారింపజాలవు. కనుక మనము, మన సంతానము నిరంతరము దృఢారోగ్యముతో దీర్ఘాయుష్మంతులమై జీవించి సుఖించదలచితిమేని, ఔషధపానాదులే ఆరోగ్యసాధకములను భ్రమను విడిచిపెట్టి, వానితో పాటుగాని, ప్రత్యేకముగా గాని యోగశాస్త్రములో చెప్పబడిన కొన్ని ముఖ్యమైన యోగసాధనలను అభ్యసించక తప్పదు.

రానురాను ప్రపంచములో నేడు రక్తపుపోటు(బ్లడ్ ప్రెషర్), మూలవ్యాధి, అజీర్ణవాయువు, అండవాయువు, మూత్రకృచ్ఛ్రం, మధుమేహములు (డయబెటిస్), కడుపునొప్పులు, కండ్లరోగములు, శీతఃస్ఖలనాదులు, అకాలరజస్రావము, కాసము (ఆస్తమా), ఉబ్బసము, పార్శ్వవాయువు (పెరాలిసిస్), కుష్ఠము, క్షయము, గుదావర్తము, సంధివాతము, మలబంధము మొదలగు రోగములు అధికముగా వ్యాపించుచున్నవి. పసిపిల్లలు మొదలు వృద్ధులవరకూ, ఆడవారనక మగవారనక అందరినీ నేడీ రోగములు పీడించుచున్నవి. ఇవి ఏ ఔషధములకు, సూదులపోట్లకు, శస్త్రచికిత్సలకు లొంగక "మేము పోము"ని శఠించి కూర్చున్నవి. తెలిసియూ తెలియనివారివలె నుండువారు, వేరుపాయములకొరకు వెతకులాడువారు, వైరాగ్యమున శరణుజొచ్చువారు, యోగాంగ సాధనలలో కృషి చేయువారు, యోగశాస్త్రమునం దీ రోగములకు ప్రతిక్రియకలదో లేదో యని శంకించువారు అనేకులు నాకండ్ల కగుపడుచున్నారు. యోగశాస్త్రమునుగురించిన ఇట్టి సంశయమునకు ప్రధాన కారణము యోగసాధన క్రమము సక్రమముగా ప్రచారము కాకపోవుటయే యని నేను ప్రమాణసహితముగా నిరూపించగలను. ఈ సందర్భముననే "వ్యాధిస్త్యానసంశయప్రమాద, ఆలస్య, అవిరతి, భ్రాంతిదర్శన, అలబ్ధభూమికత్వ, అనవస్థితత్వాని చిత్తవిక్షేపాస్తేంతరాయాః॥ దుఃఖదౌర్మనస్య అంగమే జయత్వశ్వాస ప్రశ్వాసావిక్షేప సహభువః"అని శ్రీ భగవత్పతంజలి మహర్షు లుపదేశించినారు.


శ్రమపూర్వకమున ప్రతియొక్కరూ మన

శ్చాంచల్యమును పోగొట్టు సాధనలు చేయుటవసరము. మనశ్చాంచల్యమే అన్ని రోగములకును మూలకారణము. మనస్సు చలించుటకు కారణము ఆహారదోషము. ఆహారశుద్ధిచేతనే మనస్సు స్థిరమగును. అటుపిమ్మటనే ఇంద్రియములు స్వాధీనము కాగలవు. ఆ తరువాతనే రోగములు దూరమగుట. "అన్నమయం హి సౌమ్యమనః ఆపోమయః ప్రాణః తేజోమయావాగితి॥ ఆహార శుద్ధౌ సత్వశుద్ధిః సత్వశుద్ధౌః ధృవాస్మృతిః" (ఛాందోగ్యోపనిషత్ ఆరవ ప్రపాఠకము)

ఇప్పుడు ఆహారము జీర్ణమగుటకుగాను, అందరికి సులభసాధ్యమైన "మహాముద్ర" అను యోగాంగ సాధనక్రమమును గురించి వ్రాయుచున్నాను. ఇది బ్రహ్మాస్త్రము వంటిదని నమ్మండి.

మహాముద్ర: (హ. యో. ప్ర. ఉ. 2 శ్లో. 10–18)

"పాదమూలేన వామేన
యోనిం సంపీడ్య దక్షిణమ్
ప్రసారితం పదం కృత్వా
కరాభ్యాం ధారయేత్ దృఢమ్
కంఠబంధం సమారోప్య
ధారయేత్ వాయు మూర్ధ్వతః
యథా దండహతః సర్పః
దండాకారః ప్రజాయతే
ఋజ్వీభూతా తథా శక్తిః
కుండలీ సహసా భవేత్
తదా సా మరణావస్థా
జాయతే ద్విపుటాశ్రయా॥
తతః శనైః శనైరేవ
రేచయేత్ నతు వేగతః
ఇయంబలు మహాముద్రా
మహాసిద్ధైః ప్రదర్శితా
మహాక్లేశాదయో దోషాః
క్షీయంతే మరణాదయః
మహా ముద్రాంచ తేనైవ
వదంతి విబుధోత్తమాః
చంద్రాంగేతు సమభ్యస్య
సూర్యాంగే పున రభ్యసేత్
యావత్తుల్యా భవేత్ సంఖ్యా
తతో ముద్రాం విసర్జయేత్
నటా పథ్య మపథ్యంవా
రసాస్సర్వేపి నీరసాః
అపిభుక్తం విషం ఘోరం
పీయూష మివ నశ్యతి
క్షయకుష్ఠ గుదావర్త
గుల్మాజీర్ణ పురోగమాః
తస్య దోషాః క్షయం యాంతి
మహా ముద్రాంతుయోఽభ్యసేత్
కథితేఽయం మహాముద్రా
మహాసిద్ధి కరా నృణామ్



మహాముద్ర—

★ యోగాసనములు - దేహారోగ్యము ★

గోపనీయా ప్రయత్నేన
నదేయా యస్యకస్యచిత్॥


[తాత్పర్యము] ఎడమకాలి మడమను శహాస్యేంద్రియము క్రింది నరమునకు చేర్చి అదిమిపట్టి, కుడికాలును కర్రవలె చాచి (ఇరుప్రక్కలకు వంగకుండ లేక తిరుగ కుండ), కుడికాలి వ్రేళ్ళను రెండు చేతులతో గట్టిగా పట్టుకొని, వెన్నెముకను చక్కగా లేవనెత్తి వీపును వంగకుండా నిలబరచి, రొమ్ము ముందుకులాగి, గడ్డమును రొమ్మునకు దగ్గరగాచేర్చి, కండ్లు రెండూ మూసికొని, గొంతులో సన్నని తిన్నని శబ్దమువచ్చే విధముగా రెండు ముక్కు రంధ్రములతో ఊపిరి వదలుచూ, పీల్చుచూ ఉండవలెను. ఊపిరి పీల్చి తరువాత కనీసము అయిదు సెకండ్లు ఊపిరి నిలిపి ఆపైన మెల్లిగా ఊపిరి విడువవలెను. ఊపిరి విడుచునప్పుడు ఎంత మెల్లిగా ఎంతసేపు విడిచిన అంత మంచిది. ఈవిధముగా ప్రారంభదశలో పండ్రెండు మారులకు తక్కువగాకుండ చేయవలెను. ఒక రేచకము, ఒక పూరకము, ఒక కుంభకము- ఈ మూడు చేరి ఒక సంఖ్య అని తెలియవలెను.

అటుపిమ్మట ఎడమకాలు చాచి, కుడి కాలిమడమను యోనిక్రింద నరమునకుచేర్చి, రెండుచేతులతో ఎడమకాలి వ్రేళ్ళను పట్టుకొని 12 సార్లు చేయవలెను. రెండుప్రక్కలనూ సమ సంఖ్యలో చేయవలెనే కాని ఎక్కువ తక్కువ లుండకూడదు. (రేచకమనగా ఊపిరి విడుచుట, పూరకమనగా ఊపిరపీల్చుట, కుంభకమనగా ఊపిరి బంధించుట)

సరియైన గురువులవద్దచేరి దీని నే క్రమము ప్రకారము సాధన చేయవలెనో తెలుసుకొని మహాముద్ర నభ్యసించువారిని పైన పేర్కొన్న రోగము లంటవు. ఆ రోగముల వలన బాధపడుచున్నవారు ఆహార విహారాది నియమములతో ఈ యోగము నభ్యసించినట్లయితే క్రమక్రమముగా ఆరోగములు నిర్మూలమగును. ఇక్కడి చిత్రపటములను చూసి చక్కగా మననముచేసి అభ్యసించవలెను. ఈ చిత్రపటములలో మొదట చూపబడినట్లు అభ్యాసప్రారంభకులును, రెండవ పటములో చూపబడినట్లు దృఢాభ్యాసులును మాత్ర మభ్యసింపగలరు.

పైన పేర్కొనబడిన రోగములలో నేది యున్నను మహాముద్ర నభ్యసించి పోగొట్టుకొనవచ్చును. అయితే ఒక రోజు చేసి రోగముపోలేదన్న చో, అది నిరుపయోగము. ఎన్నియో సంవత్సరములనుంచి పెంచిన రోగము ఒక రోజులో మానదు. ఒకసారి అశ్వత్థప్రదక్షిణముచేసి బొడ్డు తాకి చూచుకొన్న కథవలె ప్రవర్తించరాదు. "సతు దీర్ఘకాల నైరంతర్య సత్కారాదర సేవితో దృఢభూమిః" (పాతంజల దర్శనము 1 వ పా. 14. సూ.)

శరీరారోగ్యము కాపాడుకొని దీర్ఘాయుర్దాయముతో ఇహపరసౌఖ్యముల ననుభవించ గోరెడువారు, ఈ శరీరమను గృహమునకు 16 కంబములవలెనుండు 16 స్థానములను నిత్యము శుచిగానుంచి కాపాడుకొనుట అవసరము. కాలివ్రేళ్ళ మొదలు బ్రహ్మరంధ్రమువరకూగల ఈ 16 స్థానములేవనగా: 1 అంగుష్ఠ - కాలిచేతుల బొటనవ్రేళ్లు 2 గుల్ఫ- చీలమండలమీది గ్రంథులు 3 జాను- మోకాళ్లు 4 ఊరు - తొడలు 5 సీవనీ -



మహాముద్ర—



విజ్ఞానవీధులు
"డాక్టర్"



171. పెన్ను విదలిస్తే సిరా ధారగా పడదేం?

"పెన్ను దులిపినప్పుడు సిరా ధారగా పడక బొట్లు బొట్లుగా ఎందుకు పడుతుందీ" అని బందరునుంచి వల్లూరిపల్లి మురహరి రావుగారు అడుగుతున్నారు.

ఒక గాజు గ్లాసునిండా నీరు నింపండి. పూర్తిగా నిండి పొర్లిపోడానికి తయారవాలి నీరు. అప్పుడు ఒక పోస్టుకార్డుని ఆ గ్లాసుకి మూతలాగ పడవెయ్యండి. గళాసు పొడుగునా నొక్కి రాయండి. కార్డు గళాసుఅంచుకి అంటుకున్నట్టుగా నొక్కండి. అంతటా అంటినప్పుడు గ్లాసును ఎత్తి నెమ్మదిగా పక్కకివంచి తిరగవేసి పట్టుకోండి. కార్డుమీద అరచేతితో నొక్కి తిరగవేసి, తరవాత అరచేతిని తీసివేసినాసరే. ఇప్పుడు గ్లాసులోని నీరు కిందపడిపోదు. కార్డుకీ గ్లాసు అంచుకీ స్పర్శ బాగాఉంటే గ్లాసును పక్కకి వంచినా నీరు పడిపోదు. ఎందుచేత?

గాలి కార్డును నొక్కుతూండడముచేత గ్లాసును తిరగవేసినప్పుడు గాలి కార్డుని పైకి నొక్కింది. గ్లాసుని విదలిస్తే కార్డూ నీరూ బొళక్కుమని పడిపోతాయి. ఎందుచేత? గ్లాసును విదలించి ఆపినప్పుడు గ్లాసు ఆగిందికాని నీరు (విదలింపువల్ల) కిందికి కదుల్తూనే ఉంది. కార్డునుతోసి నీరు పడిపోతుంది.

ఇప్పుడు ఫౌంటెన్ పెన్ను బేరల్‌లో నీరునింపి, బేరల్ తిరగవెయ్యండి. బొప్పాయి గొట్టమునిండా నీరు నింపి తిరగవేసినాసరే. ఆనీరు కింద పడదు. కొంచెంగా విదలించండి. చుక్కలే పడతాయిగాని నీరంతా పడదు. ఏల? నీరు గొట్టామునిండా నిండి ఉంది. గాలి ఇందాకటి కార్డునివలెనే నీటి ఉపరితలాన్ని పైకి నొక్కి పట్టింది. నీటిమీద రబ్బరుపొరవంటి పల్చని నీటిపొర ఉంటుంది. ఇది ఈ గొట్టాములో నీటికి ఇందాకటి కార్డులాగ పనిచేస్తుంది.

ఇప్పుడుగాని గట్టిగా విదిపితే, గొట్టాము అంచులవెంట పట్టిఉన్న నీరు కొంచెము రాలుతుంది. ఈ బిందువుకీ మిగతా నీటికీ గల ఆకర్షణని మించిపోయింది మనము దులిపిన బలము. అయితే ఈ బిందువు పోగానే మిగతా నీటి ఉపరితలము మళ్లీ బిగిసి నీటిని పట్టి ఉంచుతుంది. పెన్ను బేరల్ నింపి, నీటిని విదిపేయడము సులువుకాదు. అందులోనూ మూతికి కొంచెములోపుకి నీరు ఉంటే మరీ కష్టము. ఏమంటే, విదపడము వల్ల నీరు మూతిదగ్గరకి దిగిందనుకుందాము. బేరల్ రెండో కొసని నీటికీ బేరల్ కొసకీ ఖాళీ ఏర్పడుతుంది. ఇక్కడ గాలీ గీలీ ఏమీలేదు. కనక వెలపలిగాలి నీటిని నొక్కి మళ్ళీ వెనక్కి పంపించేస్తుంది.

పెన్నుకు పాళీ, ఫీడరూ అమర్చి, దులిపితే జరిగేదిదే. దులిపిన బలానికి, ఫీడరులోకి జారిన సిరా బయటపడుతుంది. లోపలి సిరాని గాలి నొక్కిపట్టుతుంది. అయితే సిరా అసలు దిగడము ఎలాగు జరుగుతుందీ? అంటారా? ఏటవాలుగా పట్టుకుంటాము కాదూ? కనక సిరా తలము వాలుగా వంగి సిరా కొంచెము జారుతుంది.

తోకమల్లిపూవుకాడవంటి రంధ్రముగల గాజుగొట్టములో నీరు నింపి, ఆ నీటిని దులిపివేయడము కష్టము. వెచ్చబెట్టి ఆవిరిగా పంపించేస్తారు. పరిశోధన శాలలలో.

చిట్టిప్రశ్నలకు జవాబులు

—భూగర్భంలో నీటి జలలూ వుంటాయీ, నెమ్మదిగా ఇసుకపొరలలోంచి చిమ్ముకుంటూ సాగిపోయే నీరూ వుంటుంది. మామూలు నూతులలో ఇలాగ చిమ్ముకుంటూపోయే నీరు ఊరుతుంది. పగల్లా నీరు తోడగా తోడగా సాయంత్రానికి నీరు తగ్గినా రాత్రల్లా ఊరి మళ్ళీ ఉదయానికి యథాప్రకారంగా నిండిపోయే బావులు చూడలేదా మీరూ? ఇవి నెమ్మదిగా చిమ్మే నీరు చేరినవే.

ఆర్టీజియను నూతులు చాలా లోతుకి తవ్వుతారు. అవి భూగర్భ జలప్రవాహాలలోకి దిగుతాయి. దానితో ఆ నీరు ఈ నూతులలోనుంచి ఉబికి, ఆ చుట్టుపట్ల కొండల పొరలలోఉన్న మట్టానికి లేవబోతుంది. ఈనీటిని పంపుగొట్టాలద్వారా పైపులోని నీరులాగ ధారగా తెచ్చుకుని, కాలవలుకట్టి సాగుచేయిస్తారు.

ఈ నీటితో సాగుచేస్తే కలుపుమొక్కలు ఎక్కువగా మొలవవు. విత్తనాల్ని తీసుకురాదీ నీరు నదీజలాలలాగ.

—పలచబడిపోతుంటేమ, ద్రవము సులువుగా ప్రవహించడమున్నమాట. వెచ్చబెట్టినప్పుడు అణువుల కణములు కలవరము చెందుటవల్ల కణమునకునూ కణమునకునూ గల ఆకర్షణ కొంత తగ్గి, ప్రవహించడానికి నిరోధము తగ్గుతుంది. దము అ మ

★ యోగాసనములు - దేహారోగ్యము ★

రహస్యేంద్రియముల క్రిందినరము 6 లింగ - రహస్యేంద్రియము 7 నాభిః - బొడ్డు 8 హృత్ - రొమ్ము 9 గ్రీవా - మెడ 10 కంఠదేశః - కంఠము 11 లంబికా - నాలుక 12 నాసికా - ముక్కు 13 భ్రూమధ్యం - కనుబొమ్మల నడుమభాగం 14 లలాటం - నుదురు 15 మూర్ధ - తల 16 బ్రహ్మరంధ్రం - నెత్తి మాడు.

రోగచికిత్స చేయువారు, చికిత్స పొందువారలుకూడ ఈ 16 స్థానములయొక్క వికారములు, అశక్తి, నీరసభావములను చక్కగా గుర్తించి చికిత్స నిర్ణయించవలెను. అట్లు చేయనియెడల ఈ సాధనలుగాని ఏ ఔషధములుగాని పనిచేయవు.

మహాముద్ర ఈ 16 స్థానములను శోధించును. అందువల్ల దీని నభ్యసించువారు చాల జాగ్రత్తగ, తెలివితో గమనించి అభ్యసించవలెను. ఈ విషయమై అధికముగా తెలుసుకొనగోరువారు గోరక్షనాథుల "యోగసిద్ధాంత పద్ధతి"అను గ్రంథము పఠించుట మంచిది.

[ఇంకా ఉన్నది]

★ [illegible]ప్రశ్నలకు జవాబులు ★

పలచబడుతుందన్నమాట. ఆముదమే కాదు. ఏద్రవమేనా పలచబడుతుంది. అయితే నీరు ఉంటేమాత్రము, వేడికి ఆనీరు ఇగిరి చిక్క బడుతుంది ఏదముకేనా.

—తెలుపు రంగులో ఏడురంగుల కిరణాలూ కలిసి ఉన్నాయి. అయితే అన్ని రంగులపాళ్ళూ సమానముకాదు. నీలమూ, నారింజా, ఎరుపూ ఎక్కువ. ఆకుపచ్చన వీటి తరువాత. కనక ఈ రంగులు ప్రధానంగా కనపడతాయి ఇంద్రధనుస్సులో. నలుపన్నది రంగుకాదు. రంగు లేకపోవడమే నలుపు.

—'చంద్రకాంత మణులు' చంద్రుని వెన్నెలకు ద్రవించడము మే మెరుగము. అది కేవలము కవుల ఊహా కాబోలు.

—పురుగు కుట్టినచోట మంట తగించడానికి శరీరము కూడబెట్టే 'రక్షియే' దగ్గరు.

—బల్లి తోకలోకూడా మన నెన్నెముకలోలాగ నరాలుంటాయి. తోక తెగిపోగానే ఈ నరాలు జలదలాడతాయి. అంటే తోక కొట్టుకుంటుంది. అయితే జీవముతో సంబంధము తెగిపోవడమువల్ల తున్నశక్తి కాస్తా కొంతసేపటికి చల్లిపోఉంది.

—మునిగిపడమూ తేలడమూ కేవలము ఒక వస్తువు బరువుమీద ఆధారపడదు. ఇత్తడి కానీ మునిగిపోతుంది. ఇత్తడిబిందె తేలుతుందికదా? ఒకవస్తువును నీటిమీద వెయ్యగానే ఆ వస్తువు నీటిలో ప్రవేశించేభాగము మేరకు నీరు తొలిగిపోతుంది. ఈ కారణము వల్ల వస్తువుని తొలిగిన నీటిబరువంత శక్తిలో నీరు పైకి ఎత్తుతుంది. మంచుగడ్డ బరువుకన్న, అది నీటిలో మునిగితే తొలిగిపోయే నీటిబరువు హెచ్చు. కనక నీటి ప్లవనశక్తి మంచుగడ్డని తేల్చేస్తుంది. రాయి మునిగితే తొలిగిపోగల నీటిబరువు రాతిబరువుకన్నా తక్కువ. కనక రాయిమునుగుతుంది. రాతిని రాతిచిప్పలాగ తయారుచేస్తే దానివెడల్పైన పృష్ఠము నీటిలో దిగినకొద్దీ నీరు తొలిగిపోతూ, ఎప్పుడైతే రాతిచిప్ప బరువు, తొలిగిపోయిన నీటి బరువుకి సమానమవుతుందో అప్పుడు తేలడము మొదలుపెడుతుంది. అంటే ఒక వస్తువు తేలుతూన్నప్పుడు దాని బరువు, నీటిలో మునిగిఉన్న దాని భాగము తొలిగించిన నీటి బరువుకి సమానమన్నమాట. అందుకే ముక్కలాగ పడేస్తే మునిగే సీనారేకు దొప్పలాగ కొట్టి నీటిలో వేస్తే తేలుతుంది రాధాకృష్ణయ్యా నాయుడుగారూ.

—నాస్తికులు అంటే దేవుడు ఉన్నాడని ఒప్పుకోనివారు. అయితే వేదాలు పరమప్రమాణ గ్రంథాలని ఒప్పుకోనివారు నాస్తికులని మరొక అర్థము ఉంది.

—స్వర్గ నరకాలా? చూచి వచ్చినవారు లేనన్నాళ్ళూ వాటి ఉనికి అనుమానమే.

—రెక్కలాడించకుండా ఆకాశపథములో గద్దలూ, రాబందులూ పోగలగడము వాటి వేగమువల్లనే. అవి చాలా దూరముగా ఉండడమువల్ల ఆ వేగముయొక్క ఉద్ధృతము మనకి ఆనదు.

—సముద్రపు నీరు నీలిరంగుగా ఉండడానికి కారణము ఆ నీటికణములు తమలో ప్రవేశించిన సూర్యుని వెలుగులోని నీలిరంగుని ఎక్కువగా విరజిమ్మడమే. దోసిడిలో సముద్రపు నీటిని తీసుకుంటే ఆ నీరు విరజిమ్మిన వెలురుకంటె ఆ నీటికి అడుగున ఉన్న చేతిచర్మము పరావర్తము చేసే వెలురు బలమైనది కావడమువల్ల చేతికూడే కనబడుతుంది. ఆ నీటిని పారబోసినచో, ఆ కణాలలో దూరి మళ్ళీ వెనక్కి పరావర్తమైన వెలురు తెలుపుకావడమువల్ల ఆ నీరు తెల్లగా కనబడుతుంది. తామరాకు మీది నీటిబొట్టు తెల్లగా మెరవదూ? ఇక్కడ గాలి అక్కడ తామరాకువంటిదే నాగేశ్వరరావుగారూ.

—కాస్మిక్కు కిరణాలంటే విశ్వాంతరాళములోనుంచి వచ్చే కిరణాలు. బహుశా తత్తుల్యమైన కిరణాలు హైడ్రోజను బాంబువల్ల కలగవచ్చును.

—కొండలా? కృత్రిమంగా పుట్టించడమా? లావాద్రవము అందేవరకూ నూతులు తవ్వితే, ఆ నూతుల్లోంచి లావా ఉబికి కొండల్ని పుట్టించగలదు. హిమాలయా పర్వతాల నెత్తిమీద పది హైడ్రోజను బాంబుల్ని పడేస్తే ఈ కొండ పిండి అయి ఆ పొడి చేరినచోట చిన్నకొండ పుట్టగలదు. ఇంతదాకా ఎందుకూ, అంతటా తవ్వి ఒకచోట పోశేస్తే 'కొండ' అవదూ? దక్షిణ అమెరికా పశ్చిమతీరం సముద్రపు పక్షుల రెట్టలుచేరి పెద్దపెద్ద గుట్టలు (చిన్న చిన్న కొండలు) ఏర్పడ్డవి ఉన్నాయి. గ్వానోలంటారు వీటిని.

★ ప్రయోజకుడు ★

(24-వ పేజీ తరువాయి)

పోతారెందుకు?...కొనమన్నదాన్ని నేనూ ఇవాళ సుందరానికి మన సుబ్బుల్నిచ్చి పెళ్లి చేయడానికి ప్రధానం జరుపుదాం అనుకుంటుంటే...అందుకని మామిడిపళ్లు కొనమన్నాను. మీరు రాగానే చెబుదాం అనుకుంటున్నాను. అంది సన్నగా.

పేరిశాస్త్రిగారు సులోచనాలు తగిలించుకుని పంచాంగం విప్పాడు. 'దివ్యమైన ముహూర్తం బాబూ! ఇవాళ. తనురిదే ఆలస్యం. సదస్యులు వచ్చారు.' అన్నాడు.

జువ్వలా లేచాడు జగన్నాథం. నిష్ప్రయోజకుడు కానీ దాచుకోలేనివాడు...'

'చాల్లే నాన్నా మీకన్నా నయమే' అంది సుబ్బులు.

చాలా చిత్రంగా లేదు?...సరే నేను ముందుకొచ్చి తగులుకొన్నాను. 'ఏవడయ్యా నిష్ప్రయోజకుడు? అతనా మనవా?...హుఁ... తెలివంటే అతగాడిది. లౌక్యం అంటే అది..మీకు కాఫీలు ఇడ్లీలు పెట్టి, కబుర్లుచెబుతూనే చదరంగ ఆటలో మీ లోపాలు కనిపెట్టేసి, కిటుకులు నేర్చేసుకుని,—మీకు ఇంతవరకూ కర్చుపెట్టిందీ, మీదగ్గర ఓడిపోయిందీ కలిపిన దానికన్న నాలుగురాళ్ళు ఎక్కువే ఒడేసి లాగాడు మీదగ్గిర...పైగా తుమ్మాయిలాటి ఉద్దండుడి దగ్గర్నించి సవ్యంగా అప్పు వసూలుచేసి, దానిమీద పందేల రూపేణా పదహారు రూపాయలు గెల్చాడు. నీ కూతురికి ఇంతకన్న గొప్పవాడిని ఎక్కడ తెస్తావయ్యా? డబ్బుంది, తెలివి ఉంది, మంచి మనస్సు ఉంది,...లౌక్యం తెలుసూ...'

'అన్నిటికన్నా ముఖ్యం అయినది వాళ్ళిద్దరికీ ఇష్టం అయింది' అంది సుబ్బులక్ష్మి తలి తలుపుచాటునుంచి. సుందరం ముసిముసి నవ్వులతో జగన్నాథానికీ, నాకూ, కరణంగారికీ నమస్కరించాడు.

సుబ్బులు జడ ఎగరేసుకుని లోపలికి వెళ్లిపోయింది.

'అబ్బో! ఎంతలౌక్యం చూపావయ్యా! ఇక్కడకూడా అనుకుంటూ నేను ఘక్కున నవ్వాను'

కథ ముగించారు సుబ్రహ్మణ్యంగారు. కథ విని, కిలకిల నవ్వింది పద్మ.

"నీకూ వస్తున్నాడులే, అలాటి మొగుడే-ఇంకో గంటలో...ఆమాటకొస్తే ఇతగాడు సుందరాన్ని మించిన సుగ్రీవుడు." అన్నారు సుబ్రహ్మణ్యంగారు. రామదాసుగారు సాభిప్రాయంగా చూశారు సుబ్రహ్మణ్యంగారి వంక.

"సుగ్రీవు డందంగా ఉంటాడా?" అంది పద్మ. ★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, Madras



దక్షిణభారత చిత్రకారుల ప్రదర్శనం

బె స్త ప డు చు

—భాష్యా శర్మ.



మధుర స్మృతి

—కే. కే. రత్నం.

5 వారాలనుంచీ లక్షలాది జనులు ఏరి, కోరిచూస్తున్నారు

